భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

★

జూన్ 1972

సంపుటము : 49 : సంచిక 6 :

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

జూన్ 1972

ఆనందవల్లి

శ్రీ పోచిరాజు శేషగిరిరావు

కేమకని వజ్రమ్మై హృదయ
కందరవాసిత సేవ్యమూర్తియై
అమలిన తారకా నిచయ
మంతట నీదగు వెల్గువెన్నెలల్
కొమరున సోఁక నా హృదయ
కుంజము మేల్మి పరీమళమ్ములన్
విమలతఁ జల్లు శాంత రమ
ణీయములై సువిలాసవీచులై.

నలిగిన డెందమందు నవనందనసుందర కల్పసూన రా
శులు జిగిదేలుచుండగ—వచోమధురాలససుప్రసన్నతా
లలితము నౌను—ధర్మపరిలాలసపేశలరాగరంజనన్
మలగ గదే—మదీయ మణిమండప దీపికపై ప్రభాకరా !

ప్రాతరుత్ఫుల్ల కుసుమ నికేతనమ్ము !
అవధి మీఱిన కవనసేవధి నిజమ్ము !
పరువు లొలసిన యానంద వర్షధార !
క్రొత్తయనుబంధ మిది సాధకునకు సుమ్ము

వెన్నెలవాక దివ్యపృథివీగళితమ్మయి మర్త్యసీమపై
గ్రన్నన వ్రాలి భావమధురమ్ము మనోహరగంధబంధురా
సన్నత సుప్రసన్న పరిసర్పిత చందన చర్చితమ్మునై
అన్నగసార్వభౌమతనయాదరహాస వికస్వరమ్మునౌ.

ఒక మించుతళుకు మనమున
వికసించిన, తనువుతనువు పేశలమ్మై, ని

ర్వికలత హొవణిల్లగ -రా
గ కదంబము వినిన యట్లు కమనీయమౌ్మ.

రాగస్పంద సుందరమ్మ్మ రసధారావేగ సంరూధమున్
వాగీశప్రీతిభామహత్వ మధుర వ్యాహార సందర్భమున్
జేగీయ ప్రీతిమానధీరమును సుశ్రీకాంతి హేవాకమున్
భాగీరథ్యుపబృంహితమ్మునను శశ్వత్ ప్రాణపుంజమ్మునౌ

సురపొన్న పూచినట్లుగ
విరిసిన మందారతరువు వితముగ-నీ సా
గర మెల్ల సుధాసేచన
పరిపూతత నందినట్లు వాసించునహో!

తరళాతితరళసుందరమణీమయ భాష
ణావళు లొసపరి శ్రీ వహింప
మధురాతిమధుర సంపన్మనోమందిర
ద్వారతోరణమాల పరిఢవిల్ల
లలితాతిలలిత మంజులపారిజాత మా
లా సుగంధశ్రీ విలాస మొలయ
కరుణాలవాల నిర్మల ఘనాఘనము పు
ష్కలముగా వర్షించి ప్రక్కకొదుగ

మన్మనోవీధి శాంతి సంపన్నమగుచు
ఒక సముల్లాసకళిక ప్రత్యూషవేళ
పులకలెత్తింప-లౌకికస్ఫూర్తి తలఁగి -
చిత్కళామయమయ్యె విచ్ఛిత్తి లేక.

కరుణ తొలుకాడు కన్నుల కాంతి వర్ష
ధార లురలెను : తన్మయత్వమ్ము నెనసె ;
అమృత రసపూరమున మనస్సుమము ముంచి
యెత్తినట్టులు శ్రవణిల్లె యెసకమెసఁగ.

ఆ నం ద వ ల్లి

ప్రముఖ రమణీయ శిల్పాభిరామముగను
కావ్యరూపాన త్వన్మూర్తి గండరించి
చూపనెంచిన గీర్వాణ సుకవికోటి
కంతుపట్టగలేదు నే నెంతవాఁడ !

అమృత నిభృతమ్ములైన నీ యక్షియుగము
కౌముదీరంజనాంచిత గాత్రవల్లి
మెఱపు దొంతరగమి మిఱుమిట్లు గొలుప
లోవెలుఁగు నెమకుచుందు లోలోన నేను.

నాన్యతోదర్శనీయమై అవతరించి
దిగ్దిగంతరముల వెంట తేజ మెసఁగి
దశదశాంతరమందు సుందరత మెఱసి
కల్పకుంజము నాలోన కానుపించె.

క్రొమ్మెఱుగు ధాళధళ్యమ్ము గుస్తరించి
నవశరజ్జ్యోత్స్న నీరాజనమ్ము లీయ
శ్రీ గురూత్తము చరణ సంసేవ సలుప
గీలు కొలిపితి భక్తిమై కేలుదోయి.

సరసపేశల రుచిర వచస్సు నిలువ,
లలితరోచిర్వితానముల్ లాస్యమాడ—
కుసుమ సుకుమారతలు గుమిగూడి యొదుగు -
ప్రౌఢనిర్భర వాసనల్ రాగమొలుక.

మధుర పీయూషవర్ష సంభావ్య దివ్య
పరిమళోద్గార రుచిరపవౌ వానజల్లు
డెందమున విరియించె ఆనందవల్లి :
మెల్పునన్ నిల్పె సుకవితా కల్పవల్లి :

లోని పొరలలో దీపించె హేలగాను
తళతళత్తళకీను సుద్దానుకాంతి :
అందముల దీవి : సుకవితా మందిరమ్ము :
ద్రాక్షపందిరి జీవితోద్యానమునకు.

సరస్వతీ తత్త్వము

"కుమార భారతి"

శిల్పమనగా మూర్తి. అంతర దర్శనమున ప్రతిబింబించిన నీ రూపభావమునకు రూపకల్పనయే మూర్తి. అనగా భావప్రతీక.

ఇట్టి శిల్పప్రతీకలు భారతీయ సంప్రదాయమున మూఁడున్నవి. ఒకటి మానవ—జాంతవరూపము. ఉదాహరణము——గణపతి.

రెండు స్త్రీ—లతారూపము, సాలభంజిక.

మూఁడు మిథునరూపము, దంపతులు.

రెండవది ప్రస్తుతాంశము.

ఒక దివ్యసుందరి నాట్యభంగిమతో వెనుకనున్న లత నానుకొని నిలుచుండుట భారతీయ శిల్ప ప్రపంచమున కన్నుపడినచోటనెల్ల కనిపించును. ఇదే సాలభంజికా విగ్రహము. సాలమనఁగా చెట్టు లేక లత. భంజికయనగా స్త్రీ. రెండును కలిపి సాలభంజిక. (Tree –Woman Configuration.)

ఈ శిల్ప సంప్రదాయమునకు అలంకారికార్థమొకటి; తాత్త్వికార్థ మొకటి. మొదటిది సౌందర్యదృష్టి. రెండవది సత్యదృష్టి. సత్యము నాధారముగా చేసికొని సౌందర్యము పుట్టుచున్నది. అనఁగా ఆలంకారిక శిల్ప సంప్రదాయమునకు, తాత్త్వికసత్య మాధారభూతము.

కేవల సౌందర్యదృష్టితో చూచినచో లతా—స్త్రీ—ఈ రెండు ద్రవ్యములును ఏకత్రసన్నివేశము పొంది, పరస్పరసౌందర్యపోషకములుగా కన్పించును. స్త్రీయొక్క శరీరమే సాల (లతా)కాండము. అందలి వంపులు స్త్రీ నాట్యభంగిమను పోషించును. లతలు బాహువులు; లతాంతము సుందరిముఖము; లతాకాండమునకు, లతలకుగల యతుకులే శరీరకాండమునకు, కరచరణాద్యవయవములకుగల సంధులు. ఇట్లు స్త్రీయే లతగా, లతయే స్త్రీగా రూపింపబడి ఒక మధురమైన భావమును ప్రేక్షకునియందు సృష్టించి; సౌందర్యలోకములలోనికి మనస్సును లాగికొనిపోవును. ఇచ్చట నుపమానోపమేయభావముకాక స్త్రీ తనూగత మధురసౌందర్యమును శిల్పి బహిర్గతముచేసి లతగా చెక్కెను. కావున లత భంజికకంటె అన్యద్రవ్యము కాదు. అది తత్తనూగతమైన నిర్గుణసౌందర్యము. ఇది ఆలంకారికదృష్టి.

ఈ స్త్రీ విశ్వజనీన సామాన్య స్త్రీత్వమూర్తి—దేవి.

ఇచ్చటి లత లోకమందలి లతకాదు. పైన చెప్పినట్లు స్త్రీ తనూగత సుకుమార సౌందర్య మధుర ప్రతీక. కావున ఆ స్త్రీ, ఆ లత, లౌకిక ద్రవ్య విశేషములుకావు. లతా వలయాదికము జన్మ పరంపరా ప్రతీకగా భారతీయశిల్పి గ్రహించినట్లు తత్కళావేత్త లభిప్రాయ పడుచున్నారు. ('బార్హూత్' స్తూపమున బుద్ధుని పూర్వజన్మములకు వ్యంజ్యకములుగ లతలు చెక్కబడినవి.) లత అల్లుకొనిపోవు స్వభావము కలది. దాని ధర్మమది. విశ్వమును చిలువలు పలువలుగా అల్లుకొనిపోవు స్వభావముకలదు. ఈ సమాన ధర్మమును పురస్కరించుకొని లత సంసార స్వరూపముగా దానికి నిదానము (Symbol) గా గ్రహింపఁబడుట—అంతరదర్శనము లేక ప్రతిభ. ఈ స్త్రీయే దేవి యన్నపుడు అది ప్రకృతి. ప్రకృతియే లత. కావున సాలభంజిక విశ్వస్వరూపము. ఇంతేకాక భారతీయ జీవితమం దొక విశేషమేమనగా, జీవుఁడు లేక మానవుఁడు ప్రకృతితో తద్గత బహువిధ జీవరాసులతో సమరసముగా బతుకుట. ఈ జీవిత సామరస్యము కళలందు ప్రతిబింబితమైన సత్యము. వృక్షజాలములతో మనుష్యజీవితమునకు సంబంధము

విహితమగుటయే సాలభంజికలో కనిపించును. లతా ప్రపంచమునకు మనుష్యప్రపంచమునకు గల సమన్వయమును సాలభంజికావిగ్రహము చెప్పుచున్నది. 'It is the symbolic of the calm of existance in a Paradise, when no Gods, had yet ordained the laws, by which this universe abides and strives, when "Three Ages before the Gods', the plants were created"—(Rigveda-10.97-1) అని 'STELLA KRAMARICH' గారు తమ "Indian Sculpture" అన్న గ్రంథమున వ్రాసిరి. కావున నీ దృష్టితో సాలము సృష్టికి పూర్వమందలి ఒకానొక ప్రశాంత స్థితికి ప్రతీకయగుచున్నది. దానినుండి సర్వము జనించుచున్నది.

సృష్ట్యారంభమున ఏకాకియైన ప్రజాపతికి భయము కలిగినదట. దేనివలన భయము కలిగినదని అతడు విచారింపగా—ఆ భయము పోయినది. కాని అతనికి ఆనందము లేదట. తోడున్నచో బాగుండునన్న వాంఛ కల్గినది. ఆ వాంఛనుండి స్త్రీ జన్మించినదట. ఇది స్థూలసృష్టికి పూర్వమున్న సూక్ష్మసృష్టికి సంబంధించిన విషయము. అనగా ప్రజాపతియొక్క మనస్సునందు పత్నీభావ ముదయించినది. ఇది భావదశ కాని ద్రవ్యదశకాదు.

ఇట్లు పతిపత్నీభావ ముదయించినది. సృష్టి సాగినది. ఇది బృహదారణ్యకమునందలి విషయము [1—4—2, 3.]

భయమునుండి వాంఛ, దానినుండి స్త్రీ జన్మించినది. ఇది ఆనందపారమార్థికదశ — స్త్రీ పుంసమ్మేళనము. కావున విగళితమైన ఆనందము, మరల తిరిగి ఎపుడు సిద్ధించినది?—ప్రకృతి పరమాత్మల సమ్మేళనమువలన; ఈ ప్రత్యభిజ్ఞయే లౌకిక, పారలౌకిక, సమన్వయసూత్రముగా భారతీయ శిల్పియొక్క తాత్త్వికదర్శనము. ఈ దర్శనమునుండియే సాలభంజిక సాక్షాత్కరించినది. సాలమనగా శివుడు. భంజిక దేవి. ('Gauri embracing Siva as the Madhavi creeper, clasps the young amra-tree with her bosom-like a cluster of blossoms.' (యోగవాశిష్ఠము — నిర్వాణ ప్రకరణము 18—3 చూ. INDIAN SCULPTURE). లత గౌరి. ఆమ్రసాలము శివుడు. ఈ సమ్మేళనమే సంపూర్ణతాసిద్ధి. ఇదే అర్ధనారీశ్వర తత్త్వము. వ్యక్తావ్యక్త విశ్వసమన్వయ నిదానము. విధానము. కాగా సాలభంజిక అర్ధనారీశ్వరతత్త్వ సూత్రము నాధారముగాగొని, తాత్త్వికదర్శనముగల మహాశిల్పి, ఆలంకారికమూర్తిని కల్పించెను. ఆ రెండును భిన్నములుకావు—ఏకములు. సృష్టియొక్క అవ్యక్తదశయందలి స్త్రీ పుంభావప్రతీక.

ప్రజాపతి వాంఛాస్వరూపముగా స్త్రీభావ ముదయించెనుగదా! అనగా ప్రజాపతి మనోంతర్గతమైన ఆనందోత్తరంగిత వాంఛావధి స్త్రీ భావము. అతని మానసిక సూక్ష్మానందప్రతీక స్త్రీ. ఇందుచేత సాలభంజికాశిల్పమున వృక్షమున కానుకొని సుందరి నిల్చియున్నది. సాలకాండమువలె తనూయష్టి యున్నది. తీగ (వాంఛ)లవలె బాహువు లున్నవి. వాంఛాతరంగము (తీగలవంపు) లట్లు స్త్రీ భంగిమ లున్నవి. స్త్రీ శీర్షమున లత పుష్పించినది. లతాంతము ఆమెకు గొడుగుపట్టినది. ప్రజాపతి వాంఛాశేఖరము లతాంతమై స్త్రీ భావమునకు ఛత్రము పట్టినది. ఇప్పుడాతనికి తన ఏకాకితారూపభయభావము నశించినది. ద్వితీయ మావిర్భవించినది. దానియం దాతడు సోలిపోయెను. తన్మయత్వము చెందెను. భయము అసహాయదశావిర్భూతము. ఆనందము తద్భిన్నము. ఇట్లు విగళితానందము ప్రత్యభిజ్ఞాతమై, స్త్రీ పుంభావరూపమున సమన్వయించి మహానందసుందరముగా సాక్షాత్కరించినది. ఇదే మహోత్కృష్ట సౌందర్య సీమాంచలమైన సాలభంజిక.

అది ప్రపంచమున మరియొకటి గన్పింపని భారతీయశిల్పియొక్క ప్రతిభా సమున్మిషితమైన మహోదాత్తశిల్పమూర్తి. తన్మూర్తికల్పన కాధారభూతమైన తాత్త్వికసంప్రదాయ సూత్ర మిట్టిదిగా Stella Kramarich గారు చెప్పినారు.

(ఈ స్త్రీ పుంభావరూపము ప్రజాపతి మనోగతముగ బృహదారణ్యకము చెప్పినదికదా!—అనగా దాంపత్యము అనాది సిద్ధమని యర్థము. మనస్తత్త్వశాస్త్రవేత్తలు ఇట్టివానినే 'Archetype' అందురు. కావున సాలభంజిక Archetype అన్నమాట. ఇందు

చేతనే శృంగార రసమునకు, భారతీయ కళాసంప్రదాయము, ఆలంకారిక సంప్రదాయము ప్రాధాన్యమిచ్చుట. దానియందున్నంత సార్వజనీనత మరియొక రసమునందు లేకపోవుటకది Archetype అగుటయే.)

ముందువ్రాసిన ఆలంకారిక సంప్రదాయముల కీ తాత్త్వికసత్య మాధారము. లత యుపమానముగ, స్త్రీ యుపమేయముగా మిగిలినది. ఉపమానోపమేయసమ్మేళనమునుండికదా సౌందర్యము పుట్టుట. ఇందుచేతనే 'సౌందర్య మలంకారః' అని వామనాదులన్నారు. కేవలోప మానముగాని, కేవలోపమేయముగాని, దానంతట అది స్వయంసత్తు కలది కాదు. కావుననే పద్మముగాని, నేత్రముగాని సౌందర్య స్ఫోరకము గుట లేదు. సమన్వయము సౌందర్య విధానము. అపుడది అలంకారము. సమ్మేళనము మిథున సంబంధము. ఉపమానోపమేయ సమ్మేళనమున జన్మించు మరియొక సూక్ష్మభావన యలంకారము—అనగా సౌందర్యము. మిథునావస్థయందే మహానందము, అవ్యక్తమనోదశాసమనుభూతమో అది సౌందర్యము. దాని కిద్దఱును కారణములు. కావున భిన్నద్రవ్య సమ్మేళనమున జనించు మరొక అవ్యక్త భావాస్వాదనమానందము -సౌందర్యము—అలంకారము—సంపూర్ణత—భయరాహిత్యము. ఇదే ప్రజాపతి కథలో వచ్చినది. ఇదే ఉపమానోపమేయ భావముగ సాహితీ శాస్త్రమునందు ప్రపంచితమైనది. కావున లత యుపమానము. ఇందుచే స్త్రీ పాదతాడన పరీరంభాదులచే లతలు పుష్పించునట్లు కవికులగురువుయొక్క సాహితీ పరమార్థ దర్శనము. ఇదియే దోహదక్రియగా తరువాతి కవిపరంపర యథేచ్ఛగా సొంత సొమ్మువలె వాడుకొన్నది.

సాలము శివుడు లేక పురుషుడుకదా! స్త్రీ భావ మావిష్కరించినంతనే ప్రజాపతి మనస్సు పుష్పించె (నవ్వె)నుగదా! తత్తాడనాదులు పురుషునకు రత్త్యుద్దీపన సామగ్రియే కావున శృంగార రస విషయమే. (కాళిదాసు శృంగార ప్రాధాన్యవాదియే.) భయమునుండి వాంఛపుట్టి దానినుండి స్త్రీ సమాగమముకల్గి ప్రజాపతి యానందింపగా సృష్టి సాగినట్లు చెప్పిన బృహదారణ్యకశ్రుతి విషయమే, కుమార సంభవకథగా మహాకవి కాళిదాసు వ్రాసినాఁడు. వాంఛ—కామము—భిన్నులుగానున్న శివపార్వతుల నేకముచేసెను. కుమారుఁడు పుట్టెను. బృహదారణ్యకమునం దదే ఘట్టమున ప్రజాపతి మనస్సునుండి పుట్టిన స్త్రీ, తనకు జన్మహేతువైన ఇతఁడు తన్నెక్కడకవయునో అని సకలజంతురూపములు ధరించి పరుగెత్తినట్లు, ప్రజాపతియు తదనుగుణముగా నాయా జంతురూపములు ధరించి యామెతోఁ గవయగా నాయాజంతు సృష్టి జరిగినట్లున్నది. ఇదే విషయము శివపార్వతుల వివాహానంతరము కాళిదాసు వర్ణించిన జంతుమిథున విహారముల కాధారము. కావున కాళిదాసు తాత్త్విక సత్యదర్శనమున్న మహాకవి. ఋషియైన శిల్పి-అనగా తాత్త్విక దర్శనమును సౌందర్యదర్శనమును ఆలంకారిక సంప్రదాయముగా-రూపొందించిన దివ్యప్రతిభావంతుఁడు. పైనఁజూచిన సాలభంజిక తత్త్వార్థమే మహాకవి నోటినుండి అపూర్వవాణిగా ఇట్లావిర్భవించినది:

> 'అధరః కిసలయ రాగః,
> కోమల విటపానుకారిణౌ బాహూ
> కుసుమ మివ లోభనీయం
> యౌవన మంగేషు సన్నద్ధం'
>
> —శాకుంతలము. 1 అంకము.

11 వ శతాబ్దమునకు సంబంధించిన రాజస్థానమునందలి సాలభంజిక శిల్పమొకటి ఫిలడల్ ఫియా వస్తుప్రదర్శనశాలయందున్నది. దాని బొమ్మ 'Indian Sculpture' అన్న గ్రంథమున 38 వ చిత్రముగా ముద్రితమైనది. అందొక సుందరి భంగివామనోజ్ఞయై నిలుచున్నది. దక్షిణబాహువు తలమీఁదుగ నెడమవైపునకు వ్రాలినది. ఎడమచేయి పైకి ముడుచుకొన్నట్లున్నది (అది విరిగిపోయినది.) వామ భుజశిఖరము మీఁదుగ లత శీర్షముపైనుండి వంపుగానెత్తిన కుడిచేతి దండవరకు వచ్చినది. ఈ లతావలయము చివర పత్రములు కలవు. శీర్షముపై పుష్పము క్రిందికివ్రాలి కిరీటము పెట్టినది. ఆమె నిలిచియున్న తీఱు—భంగిమ—లతాభంగిమ. ఎత్తిన చేతివంపుపై తీఁగ వంపు వాలియున్నది. శీర్షమున జటామకుట మున్నది. దానికి పైన పుష్పమకుటము ఛత్ర మట్లున్నది, శిఖరాకారమున జడముడి యుండగా దానిపై విప్పారిన పద్మమును బోర్లించినట్లుగ పద్మమున్నది. ఆకులు, ముదులు, పిందెలు, లత నలంకరింపగా, ఆభరణములు

సుందరి శరీరమును నలంకరించు కున్నవి. ఇట్లు స్త్రీ శరీర సౌందర్యమే లతగా, లతా సౌందర్యమే స్త్రీగా శిల్పింప బడినది. శిల్పి ఉపమానోపమేయ భావమును శిల్పించి స్పర్ధ కల్గించుటయేగాక, స్త్రీ తనూ సౌందర్యమును బయటకులాగి, ఆ నిరూప సౌందర్య గుణమును — భావమును లతగా రూపించినాఁడు. ఇందుచే స్త్రీకి కుడిప్రక్క వీణ నేటవాలుగ పెట్టెను. సౌందర్యము లతగా, శరీర, శారీర మనో మాధుర్యము బహిర్గతమై వీణాకృతిని దాల్చినదన్న మాట. ఇట్లు లత, వీణ, రెండును, స్త్రీ శరీర మందలి కొన్ని దివ్యగుణములకు ప్రతీకలు. ఈ మాధుర్యమే కాళిదాసుపై శ్లోకమందున్నది.

శకుంతల లతలకు చెలిమికత్తెలతో గలిసి నీరు వోయుచున్నది. అన్నియు పూలచెట్లు—తీఁగెలపొదులు. నడుమ లతాంగులు. కేసరవృక్షముచెంత శకుంతల, ఒకచేత కుండఁబట్టుకొని నిలుచున్నది. చూచిన చెలి అన్నది—'అక్కడే క్షణముండుము — కేసరవృక్షము లతా సనాథ మగును'ని. అప్పుడు చాటున నిల్చిన రాజు పై శ్లోకము నన్నాఁడు. ఈ వాతావరణ మంతయు Kramarisch — సాలభంజికను గూర్చి; "The woman and tree configuration in the consonance and intermingling of shapes, is an assurance of the felt correspondences, and unity of human life, that of vegetation. It is a symbolic of the calm of existence in Paradise —" అన్నట్లుగా నున్నది. ఎంత ఆశ్చర్యము!

అధరము కిసలయరాగము. కోమల లతలను బాహువు లనుకరించుచున్నవి. యౌవనము లతాంత మట్లు అంగములందు సన్నద్ధమైనది. అది స్పృహణీయముగా నున్నది. ఆమె యందము తీఁగె యందముతో స్పర్ధపడుచున్నది. రెండందములు పరస్పర ఘర్షణ మొందుచున్నవి. రాజు లతను జూచుచున్నాఁడు—శకుంతలనుఁ జూచుచున్నాఁడు. రెండు ఒకటే ; పరస్పర పోషకములుగ నున్నవి. వంగిన చిగురాకట్లధరమున్నది. రాజుదృష్టి భ్రమరము ట్లటు నిటు భ్రమించుచున్నది. (శకుంతల మోముపై భ్రమరము వ్రాలినట్లు కవిచేసిన కల్పనవే రాజుదృష్టికది — మధుపము నిదానము (Symbol). దృష్టికి మధుపములకు నుపమానోపమేయభావమున్నదికదా!) 'కోమల విటపానుకారిణౌ బాహూ' అనుటచే పై సాలభంజికా శిల్పమందువలె బాహువులు ఒకటి పైకి ముడువఁబడి, మరియొకటి శీర్షముపైనుండి వంపుతిరిగి యున్నదేమో! ఆమె నీటికుండను బుజముపై మోయుచున్నది కదా! లేక ఒకచేత కుండను ధరించి ; ఆచేయి క్రిందికి వ్రేలాడుచుండగా అవ్రే లుకు లాడుట అన్యధర్మమును విటపానుకారిణి — అన్నాడేమో ! లతా ధర్మమును, చలనమును, రెంటిని బాహువు లనుకరించు చున్నవని సందర్భము. సాల భంజికా శిల్పమునందు శీర్షముపై వంపుతిరిగి లత, పూలు, ఆకులు, చిగురు తొడిగినట్లు ఆమె తలపై కూడ, నట్లే యుండియుండును. అంతయు బొమ్మగా నున్నది. లత తొడిగిన పూవువలె యౌవనము స్పృహణీయముగ నున్నది – సాలభంజికా శీర్షముపై లత పుష్పించినట్లు. ప్రజాపతికథలో స్త్రీ భావోదయము అయినపుడు కలిగిన మధుర భావన వలె యౌవనము స్పృహణీయముగ నున్నది. అనఁగా నెవనికి స్పృహణీయము ?—దుష్యంతునకు. నాటకమును ప్రారంభించుచునే సారథిచేత దుష్యంతు నని పించెను—నీవు యజ మృగమును నెన్నాడుచున్న సాక్షాత్ పినాకివలె నున్నావని. ఆ పినాకపాణి బృహదారణ్యకోపనిషత్తునందలి ప్రజాపతి.

సాలభంజికనుగూర్చి వివరించుచు Kramarisch గారు వ్రాసినమాట లివి—'The shape of the woman and that of the tree remain distinct. Yet they are assimilated to one another, the arms resembling the stem of the tree or creeper, the curves of the stem borrowed from those of the woman's body, both swaying in a co-ordinated rythem, punctuated by shapes of flowers; garments, and ornaments, joints of the woman's body, and nodules of the plant. The woman leans against, touches, embraces, or climbs, the tree in a visual image frequently given verbal expression."

శకుంతల : (అగ్రతోఽవలోక్య) – 'ఏషవాతేరిత పల్లవాంగుళీభిః త్వరయతీఽవ మాం కేసర వృక్షకః. యావ దేనం సంభావయామి.'

అనఁగా,

ప్రియంవద అన్నది:—'సఖీ! శకుంతలే! అత్రై వతావత్ ముహూర్తం తిష్ఠ. యావత్ త్వయా ఉప గతయా లతాసనాథైవ అయం కేసరవృక్షకః ప్రతిభాతి (ఇక్కడ కేసరవృక్షమనఁగా సాలభంజికలోని సాలము—శిపుఁడు. ఇక్కడ దుష్యంతుఁడు.)

తరువాత రాజన్న పై శ్లోకము.

కేసరవృక్షముప్రక్క శకుంతల సాలభంజికవలె నున్నది. బహుశః దానిని స్పృశించుచున్నదేమో! 'సంభావయామి' అన్నదికదా! శకుంతలా తనూసౌంద ర్యము ముగ్ధమసృణమైన లతగా చెప్పబడినది. కావున మహాశిల్పి, మహాకవి, ఇద్దరు నొకే తాత్త్వికసత్య మును భిన్నమార్గముల ద్వారమున వ్యక్తీకరించు చున్నారు.

కాళిదాసు కావ్యనాటకములందు నాయికలను శిల్పసుందరీ భంగివలె మనోజ్ఞలనుగా చిత్రించుట బహుధా చేయును. అనఁగా శిల్పసుందరి మనోజ్ఞ భంగిమలను వాగ్రూపమున వెల్వరించును.

'దీర్ఘాక్షం శరదిందు కాంతివదనం
బాహూనతావంసయోః'

'వామం సంధి స్తిమిత వలయం న్యస్య
హస్తం నితంబే'—మాళవిక, ప్రథమాంకము.

'తంవీక్ష్య వేపథుమతీ సరసాంగయష్టిః'—
కుమార, 5—85.

ఇట్లు నాట్యభంగిమలు వాగ్రూపమున వెలు వడుట ఆయన కవిత్వమందే యున్నది.

ఆధునిక చిత్రకళా బ్రహ్మ 'పికాసో' 'La Femme Flewr' అన్న బొమ్మ నొకదానిని చిత్రించెను. అది తన భార్యయైన 'Francoise' అన్నామె చిత్రము. అది వాస్తవిక ప్రతికృతి (Portrait) కాదు. చిత్రకారున కామెయందు ఒకవిచిత్ర సౌంద ర్యము గోచరించెను. 'అది వాస్తవిక ప్రతిచిత్రమున కతీతమైనది', అని చిత్రకారు డభిప్రాయపడి పై బొమ్మగీసెను. అదియొక విచిత్రమైన బొమ్మ. అందు చంద్రబింబము, దానిని చుట్టుకొన్నట్టుగా ఆకులు, చంద్రబింబమునుండి క్రిందికొక లతాకాం తమువంటి గీత. చంద్రబింబము ముఖము. ఆకులు జుట్టు. లతాకాంతము తనూయష్టి. కాండమున కిరు ప్రక్కల వ్యత్యస్తముగా వృత్తములు గీయబడినవి. అవి స్తనములట! దానికి క్రిందుగా రెండు హస్తములు. దక్షిణ వక్షోజముక్రింద అడ్డముగా, కొంచము ఏట వాలుగ, రెండుగీతలు, చివర వృత్తము. అందు సగము తరంగాకారరేఖ. ఇందు వృత్తము భూమి. తరంగా కారరేఖ సంద్రము. వృత్తమున సగము సముద్ర ముగా సూచన. మిగిలినది మెట్ట—కలిసి భూమండ లము. వామస్తనముక్రిందనుండి దానికించుక ఐమూ లగా ఒకరేఖ, అది వామహస్తము. దానిచివర త్రికో ణము. ఈ హస్తమాకాశమును స్పృశించు చున్నదట. ఎగుడు దిగుడుగానున్న స్తనములచేత స్త్రీ యొక్క భంగిమ సూచిత మగుచున్నదట. ఒక భంగమలో నిలుచున్న స్త్రీ సౌందర్యమిట్లు సూచింప బడినది. సాలభంజికలోవలె ఒకచేయి పైకెత్తి వంపుగా నిలిచి నపుడు, ఎత్తిన చేతివైపున్న స్తనము పైకినిక్కుట సహజము. అపుడు స్తనవిన్యాసమున నెగుడు దిగు డులేగాక స్తనాకృతులందు పెద్ద, చిన్న తనములును స్ఫుటములుగదా! ఒక భంగిమలో నున్నపుడు తను యష్టిగూడ వంపుగా చిత్రితము కావలయును కదా! కాని లతాకాండము నిటారుగ నున్నది. దానికి సమా ధానము చిత్రకారుడు చెప్పినది 'లోకమును కళ అను సరింప నవసరములేదు' — అని. ఆకారము అనగా కాండము నిటారుగా నున్నను స్తనవ్యస్తత చేత భంగిమ వ్యంగ్యమగుచున్నదని 'పికాసో' సమాధానము. ఇది భారతీయ సంప్రదాయమే. కళ జగత్తు నెంత వర కనుసరించును?—కళ లోకమును కొంతవరకే యనుసరించి పిదప దానిని త్రోసిరాజన్న ఘట్టములు భారతీయ శిల్పసాహిత్యసంప్రదాయమునందు కొల్ల లుగ నున్నవి.

'పికాసో' బొమ్మలో రెండు సూత్రము లున్నవి.

ఒకటి లతను స్త్రీగా చిత్రించుట, లేక వ్యతి రేకము.

రెండు—భంగిమయున్నను శరీరయష్టియందు తదనుగుణముగా వంపు సూచింపకుండుట.

(1) స్త్రీనట్లు చిత్రించినచో నేమైనది?—

చిత్రకారుడే చెప్పెను—'The portrait resolved itself in a symbolic floral pattern.'—(Life with Picaso - P. III). ఒకచేయి భూమండలమును, మరొకచేయి ఆకాశమును స్పృశించుచున్నదనియు, నాతని మాటయే. తన భార్యయందు తాను దర్శించిన సౌందర్యము విచిత్రమన్న దృష్టినుండి స్త్రీ సామాన్య సౌందర్యము లతాసౌందర్యమన్న భావసూత్రముగా మారి అక్కడనుండి బొమ్మ పుట్టినది. అప్పుడది విశ్వజనీన స్త్రీత్వధర్మమైన దివ్యసౌందర్యమై, భూనభోంతపరివ్యాప్తమైనదిగా సాక్షాత్కరించినది. 'పికాసో' భార్యతో నన్నాఁడు—

"We are all animals, and about three quarters of the human race look like animals, but yon are like a growing plant, and I 'd been wondering how could I get across the idea that you belong to the vegetable kingdom. rather than the animal. I have never felt impelled to portray any one else this way. It is strange, it it not?"—

—Life with Picaso (111, 112.)

నిజముగా నా భావము వచ్చుట ఎంత వింత? ఆ భావమెట్లు వచ్చినది?—అతనికి తెలియదట—ఆశ్చర్యము!

ఇది సర్వము భారతీయకళా సంప్రదాయమే కదా! సాలభంజికా విగ్రహ రచన కాధారమైన సూత్ర మిదియేకదా! (కాని నానాఁట పరిపాలించు కళాబహిరా కృతీ భేదముల ననుసరించి రూపకల్పనలందు మార్పులు వచ్చినను తదంతర్గత సూత్ర మొక్కటే. సంప్రదాయమనఁగా నదియే.)

(2) భంగిమ స్తనవిన్యాసము ననుసరించి వ్యంగ్యమైనది. కాని తదనుగుణముగ శరీర విన్యాసము మారలేదు. అక్కరలేదని చిత్రకారుని వాదము. ఇట్టిపద్ధతి ప్రకృతిని తలదన్నిన పద్ధతి. సహజతకు వ్యతిరేకత. అనగా 'వైచిత్రి'—భారతీయ కళా సంప్రదాయములందు చాలచోట్ల నున్నదే. ఉదాహరణమునకు 'పత్తడకల్' విరూపాక్షాలయ మందలి నందిమండపమున, నొక స్త్రీ విగ్రహమున్నది. ఆ మూర్తి వామస్తనము చిన్నది—కుడిది పెద్దది. (ఈ భేదము స్వల్పము). విన్యాసమున హెచ్చుతగ్గు లున్నవి. వామము పైకుండగా దక్షిణము క్రిందికున్నది. ఈ హెచ్చుతగ్గులచే నొకచేయి పైకి లేచియుండవలెనన్న నిష్ఠయము సూచిత మగుచున్నది. అప్పుడు స్కంధ భాగమున తదనుగుణముగ మార్పుండవలెను. అట్లు చెక్కబడలేదు. మామూలుగనే యున్నది. దక్షిణ వక్షోజమునకు క్రిందిభాగమున, పార్శ్వమున రెండు ముడుతలున్నవి. కుడిభాగము కొంచము క్రిందికి వంగినట్లు సూచిత మగుచున్నది. కాని స్కంధము ఎడమది పైకి, కుడిది క్రిందికి వంగినట్లు, స్కంధ భాగమున సూచన ఏమియులేదు. అనగా కన్పించుట లేదు. అనఁగా స్తనములే భంగివ్యంజకములు. శరీరము దానంతట సదట్లే యుండగా ఒకానొక యవయవ విన్యాస సూత్రమునసే భంగిమ స్ఫురింపఁ జేయఁబడుచున్నది. ఇదే 'పికాసో' అన్నది— "The form exists at its own right-but it is not the gesture that determines the form".

Life with Picaco (P. 111)

Form ని gesture నియమింప జాలదు. ఇది ఇదే. అది అదే. ఇది అనుభవమే కావచ్చు. కాని విచిత్రమైనది. కారక అభినయ విద్యా విశారదులైన నాట్య విద్యార్థులు ముఖాద్యంగములందొకదానిని ఇతరములు కదలకే చలింపజేయుచు భావప్రకటనము చేయుట కన్నదికదా! 'భంగిమ' యనినంతనే అది నాట్య విద్యావిషయము. ఇది భారతీయ సంప్రదాయము కాని పాశ్చాత్య సంప్రదాయము కాదు. ఈ భారతీయ సంప్రదాయమును 'పికాసో'—ఎట్లు పుణికి పుచ్చుకొనె నన్నది ప్రశ్న. ("In the western view of art, Nature and Art are considerd opposites."—INDIAN SCULPTURE.) ప్రాచ్యకళా సంప్రదాయము పై రెంటికి సమన్వయము.

ఏసూత్రము భారతీయ శిల్పి—కనులయందు వ్యక్తమైనదో, పరదేశీయుడైన 'పికాసో'లోకూడ నదే సూత్రము విచిత్రముగనట్లు వ్యక్తమైనది. (మానవ జాంతవమూర్తి కేవల మొకే భారతీయకళా సంప్రదాయమునకు చెందినదికాదు. పాశ్చాత్యకళలో అది ఈనాటికిని 'పికాసో'లో కన్పించుచునేయున్నది. అతఁడు చిత్రించిన 'Mino taurs' జాంతవమానవ మూర్తులే యని Kramarisch గారు వ్రాసిరి. కాని సాలభంజిక

సూత్రముగూడ 'పికాసో'లో పై రీతిగా వ్యక్తమైనదని వారు చెప్పలేదు.

ఆ సూత్రమేది?—అదే ప్రతిభ—లేక దర్శనము. అది ఆర్షము—ఋషిధర్మము. విశ్వవ్యాప్తమైన మహాశక్తి తద్వ్యక్తీకరణమున కనుగుణమైన మనస్సు నుండి అది దేశకాలాబద్ధమై బహిర్గతమగుచున్నది. వాల్మీకి నోటినుండి అప్రయత్నముగా వెల్వడిన 'మా నిషాద' శ్లోకమున—సరస్వతి—కవికి తెలియకయే తననుండి వ్యక్తమైనది. 'కిమిదం వ్యాహృతం మయా!' (ఇదేమి నేనిట్లన్నాను?). ఇంత అందముగా శ్లోక మెట్లు పుట్టినది—అన్న వాల్మీకియేకదా 'మానిషాద!' అన్నది. మరిదేమి?—కావున అది సరస్వతీ తత్త్వము. దివ్యప్రతిభ. 'కిమిదం వ్యాహృతంమయా!'—I had been wondering, how I could get across the idea!—it is strange; is it not?" అన్న 'పికాసో' మాటలును ఒకటేకదా!

వాల్మీకి తపస్వి కావున సరస్వతియని బ్రహ్మ దర్శనమున గ్రహించెను. ఇంతే భేదము. దేశకాల వ్యక్తుల కతీతమైన సరస్వతీరూపమైన ప్రతిభ నుండి పుట్టినకళ దేశకాలభేదములు దాటిపోవు చున్నది. ఈ విషయము విశ్వజనీనముకానిచో పై రీతిగా జరుగుటకు వీలులేదు. పౌరాణిక కథలు (mythological stories) అన్నిదేశములందొకేరీతిగా కన్పట్టుచున్నవి. కారణమేమి?

"We must therefore assume that they (myths) correspond to certain collective (and not personal) structural elements of the human phyche, in general".

—Introduction to a Science of Mythology-C. G. Jung.

ఈ Colletive uncousciousness నుండి జన్మించినది కావున కళలందును సాజాత్యత గోచరించుచున్నది. శిల్పి అనగా కళాకారుడు, ద్రష్ట; అనగా ఋషి. అతడు దర్శించునేగాని ఆలోచించి సాధించడు. JUNG గారు అదే గ్రంథమున ఒకానొకచో నన్నారు.

"The primitive does not think consciously, but that thoughts appear. The primitive can-not assert that he thinks, it is rather that some thing thinks in him.' ఇందుకే వాల్మీకి పికాసోలు అట్లాశ్చర్యపడుట.

ఇందుకే 'సహృదయ చక్రవర్తి' ఆనంద వర్ధనుడు ఈ మహావిషయమునిట్లు సూత్రించెను.

'సరస్వతీ స్వాదు తదర్థ వస్తు
నిష్యందమానా మహతాం కవీనాం
అలోక సామాన్య మభివ్యనక్తి
పరిస్ఫురంతం ప్రతిభా విశేషం'

—ధ్వన్య—1— 6.

లౌకిక, మనోగోచరము కాని వస్తుతత్త్వము లను గోచరింపజేయు ప్రతిభ సరస్వతీ ప్రసాద దత్తమై కవి మనస్సున పరిస్ఫురించుచున్నది. దానిచే తత్త్వ ముద్యోతితమై బహిర్గమించుచున్నది.

దీనికి హేతువు ఏకాగ్రత. ధ్యానావస్థ. లౌకిక వ్యాపారవిదిప లక్షణము. ధ్యేయవస్తువునందు మనస్సు లగ్నమగుట. ఇది సమాధ్యవస్థ. అది లేనిదే కళలేదు!

"—One of the most important elements of plastic and pictorial art is the natural intuition, or vision, by which any thing is conceived and intuited in the mind, with the emotive personality of the artist. This intuition is of the nature of 'dhyana' or meditation, in which the artist melts his personality in the emotive vision or intution, of the object of his representation, which may be a spiritual idea or a physical form."

(Fundamentals of Indian Art-Page 18, Surendranath Das Gupta.)

పికాసో చిత్రకారుడగుటను; ఈ సమాధ్యవస్థ చిత్ర రచనా సమయమున నున్నట్లతని ఈ క్రింది వాక్యములే ప్రకటించుచున్నవి.

"While I work, I leave my body out side the door, the way Moslems take of their shoes, before entering the mosque"—

Life with Picaso P. 110.

ఈ దశయందే విచిత్రార్థ స్ఫోరకమైన కళా సరస్వతి సాక్షాత్కరించుచున్నది.

(సాలభంజిక—శిల్పరచన కాధారమైన తాత్త్విక విషయము Kramarisch గారు చెప్పినదే. 'పికాసో' బొమ్మనుగూర్చిన వివరణ మతడు చేసినదే.)

బెనిఫిట్ ఆఫ్ ది డౌట్

శ్రీ పణతుల రామచంద్రయ్య

జాలిలేని మేఘంతో పెనగులాడే నక్షత్రపు అంచులపై
చచ్చిపోతున్న స్వప్నాలన్నీ ఆశాసంకేతాలనుకొని,
హేతు శైతల్యాన్ని మరచిపోయి, భ్రమిస్తున్నా డతడు—
ఈ మారు సమీపించే నగరం చైతన్యాన్ని ప్రసవిస్తుందని.

మూడోక్లాసు పెట్టె కిటికీ అంచునజారే మంచుబొట్టులో తనరూపం
మార్తికట్టి మొన్నటి ప్రశ్నల ముడి విప్పుతుందనుకుంటున్నాడు —
వెనక్కి పరుగెత్తే కొండలూ, చెట్లూ! నిన్నటి నిశాకాసారం లోనికి
తను విప్పి పారేసిన మలిన వస్త్రాల్లాంటి వనుకుంటున్నాడు.


చీకటి మరకలంటిన హృదయాన్ని
ఏకాంతపు రుమాలతో తుడుస్తూ

ఒకమూల శూన్యంలోనికి ముడుచుకుంటున్న అతణ్ణి
ఊరిస్తూ ఒక వెచ్చనిగాలి తరంగంవచ్చి స్పృశిస్తే,
టెలిగ్రాఫ్ స్తంభంపక్కన పవళించిన నీటిగుంటమొహంలో
వెలయాలి నవ్వులాంటి తెల్లదనం వలయాల్ని సృష్టిస్తే,
ఆలోచిస్తాడు సగంసగం విరిగిన క్షణాలపై విశ్రమించి
ఆగామి స్నేహసంగీత సిక్త నవనవోన్మేషశ్రీలను గురించి.

కనిపించే దేమో ఏవిగాలేనితనం—
గమ్యానికి అతడద్దిన తీవ్ర తీవ్ర వాంఛా చందనం
కాలంధాటికి నిలవటం సందేహాస్పదం.

ఇప్పటిదాకా అంతు పట్టలేదుకాని
ఈ ప్రయాణం ఓ సొగసైన సోమ్నాంబులిజం
ఇప్పటిదాకా ఆత్మను తోసుకొస్తున్న ఉద్రేకం
హృదయంలో దాగివున్న ఒకానొక జ్వరం.

అయినా ఒక్కొక్కసారి వెనక్కి పరుగెత్తే చెట్లమీద
అందంగా రెక్కలార్చే పక్షులు కువ కువ లాడినప్పుడు,
అవి అతడి గుర్తింపుకోసం తహతహ లాడినప్పుడు,
అంతటా ఆవరించిన జడత్వం పగిలిపోయి
ఆతడికి కొన్నేళ్లకిత్రం ఆశలు కల్పించిన మైదానాలూ, నీలనేత్రాలు,
స్మృత్యగ్ని కణాలై హసిస్తాయి
జీవితంలో మెరుపు ఉన్నాయని నమ్మిస్తాయి.
ఏమోమరి - ఆ నమ్మకం నిజం కావచ్చు
సహస్రాధిక నక్షత్రాలతో కలిసిపాడని స్నేహసంగీతాన్ని తాకి
జాలిలేని మేఘం పశ్చాత్తాపాన్ని కురిసిన క్షణంలో
ఆ ప్రయాణం శుభాంతమే కావచ్చు —
అతడి జ్వరం నయం కావచ్చు.



శ్రీ అరవింద విరచిత

సావిత్రి – ఒక గాథ, ఒక ప్రతీక'

శ్రీ వి. వి. యస్. రామదాసు

ఇంగ్లీషుభాష ఆంగ్లేయులు భారతీయులకిచ్చిన కానుక అనుకుంటే శ్రీ అరవింద విరచిత భాగవత జీవనము 'ది లైఫ్ డివైన్' అనే ఆధ్యాత్మిక గ్రంథమూ, సావిత్రి అనే మహా కావ్యమూ భారతీయులు ఆంగ్లేయులకూ వారి భాషద్వారా ప్రపంచానికి యిచ్చిన గొప్ప బహుమానా లనడంలో సందేహం లేదు.

ఇంగ్లీషుభాష ఖండ ఖండాంతరములలో వ్యాపించినందువల్ల ఆయా దేశాల కవులు ఇంగ్లీషులో రచనలుచేసి దానికి బలాన్నీ వైవిధ్యాన్నీ చేకూర్చారు. కాగా ఇంగ్లీషుకు ఆధ్యాత్మికపుష్టిని సమకూర్చిన ఖ్యాతి శ్రీ అరవిందులకే చెందుతుంది.

ఎ. ఇ. జార్జి రస్సెల్ అనే ఐరిష్‌కవి దిలీప్ కుమార్ రాయ్‌గారికి వ్రాసిన ఉత్తరంలో ఇంగ్లీషు భాషకు ఆధ్యాత్మికభావాలను వ్యక్తపరచడానికి తగిన సరంజామా లేదని వ్రాశారు. కాని శ్రీ అరవిందులు ఆ అభిప్రాయాన్ని వ్యతిరేకించి క్రొత్తభావాలకు అనుగుణంగా ఆంగ్లభాషను మలచవచ్చునని వ్రాశారు. వ్రాయడమే కాక అది ఒక సవాలుగా తీసుకుని ఆధ్యాత్మిక భావాలను ఆంగ్లంలో వ్యక్తంచేసి దివ్యజీవనం అనే గ్రంథంలోనూ సావిత్రి అనే మహావిశ్వకావ్యంలోనూ అద్భుతంగా రుజువు చేశారు.

యోగిగా, తాత్వికునిగా, సాంఘికమేధావిగా, రాజకీయవేత్తగా శ్రీ అరవిందులకున్న ప్రజ్ఞ బృహత్తరమే అయినా కవిగా వారికున్న అసమాన ప్రాభవము మనకు ప్రస్తుతాంశము.

శ్రీ అరవిందులు 1872 వ సంవత్సరం ఆగస్టు 15 వ తేదీన కలకత్తాలో జన్మించారు. వారి తండ్రిపేరు కృష్ణధనఘోషు. తల్లిపేరు స్వర్ణలతాఘోషు.

వారిని అజాతీయం చేసేపని వారి అయిదవ ఏటనే జరిగింది. 'నాటు' భాష, 'నాటు అలవాట్లు' వీలయినంతవరకు వారికి అంటకుండా చేయాలని కేవలం ఇంగ్లీషువాతావరణంలో పెంచాలనే అభిప్రాయంతో వారి అయిదవ ఏట డార్జిలింగులోని ఒక కాన్వెంటుకు పంపారు వారి తండ్రిగారు. ఇంటిదగ్గర కూడా ఇంగ్లీషు నర్సును పెట్టారు. 1879 నుంచి 1892 వరకు శ్రీ అరవిందులు ఇంగ్లండులో విద్యాభ్యాసం చేశారు. ప్రతి అంశంలోనూ ప్రథమశ్రేణిలో కృతార్థులయ్యారు.

ఇంగ్లండులో వారు ఇంగ్లీషు, లాటిన్, గ్రీకు భాషలలో అపారపాండిత్యమును సంపాదించారు. ఫ్రెంచి, జర్మను, ఇటాలియను, స్పానిషు భాషలలో పరిచయం సంపాదించారు. పదమూడవ ఏటనే ఇంగ్లీషులో కవిత్వం వ్రాయడం ప్రారంభించారు.

ఈ విధముగా అజాతీయం చేయాలనే అభిప్రాయం వారి తండ్రిగారి కున్నప్పటికీ వారు 1893వ సంవత్సరంలో అనగా తమ 21 వ సంవత్సరంలో భారతభూమి మీద అడుగు పెట్టగానే దైవ కృప వల్ల పునర్జాతీయం చేసే లీల ప్రారంభం అయింది. ఆ క్షణంలో ఎంతో ప్రశాంతత వారిని ఆవరించి, తరువాత ఎన్నో నెలలు చెదరకుండా నిలిచింది. కాశ్మీరులో నడుస్తూండగా వారికి దివ్యానుభవం కలిగింది. నర్మదా నదీతీరాన వారికి మహాకాళిశక్తి అనుభూతి

కలిగింది. రాజకీయ కారణాలవల్ల వారు అల్లీపూర్ జైలులో నిర్బంధించబడినప్పుడు అక్కడ వారికి నారాయణ దర్శనం లభించింది. సర్వం నారాయణ మయంగా సాక్షాత్కారం అయింది. రాజకీయాలలో ముమ్మరంగా పాల్గొనిన తరువాత మానవజీవిత సార్థకత ఆధ్యాత్మికపథంలోనే ఇమిడిఉన్నదని గ్రహించి, మౌనయోగసాధనకు అనువుగా పాండిచేరికి వారు చేరుకున్నారు.

ఆధ్యాత్మికరంగములో శ్రీ అరవిందుల తత్వమునకు ఆధారభూతమైనది సనాతన ఆధ్యాత్మిక విజ్ఞానమే లయినప్పటికీ ప్రధానముగా రెండు నూతన సిద్ధాంతములను వారు ద్యోతకం చేశారు. 1. పూర్ణయోగ ప్రతిపాదన, 2. మహామానవ ఆవిర్భావ సిద్ధాంతము—వారి ఆధ్యాత్మిక కృషి ఫలములు.

ప్రపంచ సాహిత్యరంగంలో 1. భవిష్యత్కవితా సిద్ధాంత ప్రతిపాదన, 2. ఆ సిద్ధాంతమును ప్రతిబింబిస్తూ చేసిన ఆధునిక మహావిశ్వకావ్యమైన సావిత్రి రచన వారు చేసిన రెండు ఘనకార్యములు.

హైందవ జాతీయస్మృతిపథం ఎంత ప్రగాఢమైనదంటే భారతీయకవి మతాలు మారినా దేశాలు ద్రిమ్మరివచ్చినా కొన్ని యితివృత్తాలు కవి స్మృతిలో గాఢముద్ర వేసుకుంటాయి. తోరూదత్అనే కవయిత్రి తలిదండ్రులు క్రీస్తుమత స్వీకారం చేసినప్పటికీ, ఆమె ఇంగ్లండులో కొన్నిసంవత్సరాలున్నప్పటికీ ఆమె ఇంగ్లీషులో కవిత వ్రాసినప్పుడు హైందవ గాథల్ని ఎన్నుకున్నారు. అందులో ముఖ్యంగా సావిత్రి యితివృత్తాన్ని తీసుకుని చక్కని కవిత్వం వ్రాశారు. రమేష్చంద్రదత్‌గారు కూడా ఇంగ్లండులో కొంత కాలం ఉండివచ్చినప్పటికీ ఇంగ్లీషు పరిసరములలో మెలగినప్పటికీ వారుకూడా ఆంగ్లంలో కవిత లల్లినప్పుడు అనేక సనాతన యితివృత్తాలతోపాటు సావిత్రి యితివృత్తంకూడా తీసుకుని వ్రాశారు.

మృత్యువుపై ప్రేమ సాధించిన విజయాలు శ్రీ అరవిందులను బరోడాకాలంనుంచీ ఆకర్షించాయి. పురూరవుడు ఊర్వసికోసం ఊర్ధ్వలోకానికిపోయి సాధించాడు. దానిని యితివృత్తంగా తీసుకుని 'ఊర్వసి' అనే కావ్యం వ్రాశారు. బ్రాహ్మణపుత్రుడు రురుడు ప్రమద్వరకోసం పాతాళలోకానికిపోయి సాధించాడు. దానిని యితివృత్తంగా తీసుకుని లవ్ అండ్ డెత్ వ్రాశారు.

ఊర్వసి, లవ్ అండ్ డెత్ వ్రాసిన బరోడా కాలంలోనే సావిత్రి కావ్యం మొదటి ప్రతిని వ్రాశారు. పురూరవుడు, రురుడు చేసిన త్యాగములలో స్వార్థం ఉన్నందువల్ల ఆ యితివృత్తములతో తృప్తిచెందక మానవాళి అంతటినీ ఉద్ధరించే మహాశక్తి సావిత్రి కథను యితివృత్తంగా తీసుకున్నారు శ్రీ అరవిందులు.

మహావిశ్వకావ్యమైన సావిత్రిని రచించడంలో శ్రీ అరవిందులకు అయిదు ధ్యేయాలు ఉన్నవి.

1. వ్యాసమహాభారతంలోని సావిత్రీ ఉపాఖ్యానాన్ని ఒక ఆధునిక మహాకావ్యంగా రూపొందించడం మొదటి లక్ష్యం.

2. ఆధ్యాత్మికసాధన, సిద్ధిని చూపించే పూర్ణయోగ పాఠ్యపుస్తకంగా ధ్వనించే పద్యకావ్యమును రచించడం రెండవ లక్ష్యం.

3. మానవ కార్యకలాపాలలో విశ్వకార్యకలాపాన్ని ప్రతీకగా స్ఫురింపచేసే దివ్యలీలానాటకాన్ని విశ్వకావ్యంగా రచించడం అనగా వారి దివ్యజీవనం అనే గ్రంథంలో చెప్పిన అంశాలనే కవిత్వ పరిభాషలో రసవంతంగా అందించే విశ్వకావ్యాన్ని రచించడం మూడవ లక్ష్యం.

4. కవియొక్క ఆత్మ అనుభవించిన ఆధ్యాత్మికానుభూతిని పాఠకుని ఆత్మకు సూటిగా అందించే గుణంగల భవిష్యత్కవిత అనగా మానసభూమికను దాటి అతిమానస విజ్ఞాన భూమికలకు ప్రయాణింపచేసే కవిత్వానికి మచ్చుతునకగా రచించడం నాలుగవ లక్ష్యం.

5. ఇంగ్లీషు భాషలోని బ్లాంక్‌వెర్స్‌లో ఉపనిషత్తులలోను కాళిదాసకావ్యాలలోను ఉన్న భావచలనాన్ని వీలయినంతవరకు సృష్టించడం; అనగా సంస్కృత భాషలోని స్పష్టత, స్వచ్ఛత వేదాలలోని అర్థబాహుళ్యం ఇంగ్లీషు ఛందస్సులో యిమిడ్చే ప్రయత్నం చేయడం అయిదవ లక్ష్యం.

వారు సావిత్రి మహాకావ్యాన్ని బరోడా కాలంలో వ్రాసినప్పటికీ అది వారు అతిమానస స్థితిని దాటిన

తరువాత కలిగిన ఆధ్యాత్మికానుభవాల దృష్ట్యా చాలా పర్యాయములు మార్చారు. కొన్ని భాగాలు పదిమార్లు సవరించడం కూడా జరిగింది. కవితాగుణంలో దేనికదే రసగుళిక అయినప్పటికీ ఆధ్యాత్మికానుభూతిలో వారికి కలిగిన పరిణామం దృష్ట్యా పూర్ణవిరాట్ దర్శనానికి ప్రస్తుత బృహద్గ్రంథం అవసరమయింది.

చివరకా ఉద్గ్రంథానికి 'సావిత్రి ఒక గాథ, ఒక ప్రతీక' అని నామకరణం చేశారు.

మూడు భాగాలు, 12 పుస్తకాలు, 49 పర్వాలు, సుమారు 24,000 చరణములు ఆ మహా కావ్యములో ఉన్నాయి.

అసంపూర్ణత—కనీసం మొదట సంకల్పించిన పథకంలోనివన్నీ లేకపోవడం — ప్రతిమహాకావ్యానికీ ఒక లక్షణమేమో అనిపిస్తుంది. 1. ఏడవ పుస్తకం 'ది బుక్ ఆఫ్ యోగా' ఆఖరు పర్వంయొక్క మకుటం యివ్వలేదు. 2. మొదట సంకల్పించిన 51 పర్వములలో 49 మాత్రమే వ్రాశారు. ఎనిమిదవ పుస్తకం 'ది బుక్ ఆఫ్ డెత్'లో మొదటి రెండు పర్వాలూ రచించలేదు.

స్వల్పంగా ఈ భాగాలు లోపించినప్పటికి గ్రంథమంతా ఏకబిగిని చదివితే ఒక సంపూర్ణత, నిండుతనం గోచరిస్తాయి. చెప్పవలసినది సందర్భ శుద్ధితో చెప్పడం జరిగింది. ముఖ్యమైనదేదీ విడిచి పెట్టలేదు.

ఈ మహాకావ్య రచనకు శ్రీ అరవిందులు 50 సంవత్సరాలు కృషి చేశారు.

గ్రంథ విశ్లేషణ చేయడానికి ముందు సావిత్రి పాత్రయొక్క ఉత్కృష్టత, విశిష్టత మనవి చేస్తాను.

శ్రీ అరవిందులు తమ మహా విశ్వకావ్యమైన 'సావిత్రి'కి ఇతివృత్తాన్ని వ్యాసమహాభారతంలోని సావిత్రి ఉపాఖ్యానంలోనుండి తీసుకుని వారి అయిదు ధ్యేయాలకూ అనుగుణంగా మార్చి మెరుగుపెట్టారు. వ్యాసుని 'సావిత్రి' విశిష్టమైనది. అందములో, సత్యసంధతలో, సత్ప్రవర్తనములో, శక్తిలో సాటిలేనిది. పదునెనిమిది సంవత్సరముల తపఃఫలముగాసావిత్రీదేవి వరప్రసాదంవల్ల సావిత్రి కల్గింది. సూర్యుని అంతటి తేజస్సుతో కూడిన సౌందర్యము కలిగినందువల్ల ఆమెను వరించుట కెవరికీ సాహసము లేకపోయింది. చిన్న విషయాలలో కూడా ఆమె అసత్యము పలుకలేదు. ఆమె సహజముగానే మంచిది కావడంవల్ల అందరికీ ఉపకారం జరిగింది. చరిత్రలోగాని గాథలలోగాని ఉన్న కథానాయికలలో ఆమెకు విశిష్టస్థానం ఆమెకున్న 'శక్తి' వల్లనే వచ్చింది. ఆమెకున్న మరొక విశిష్ట లక్షణం ఏమిటంటే ఆమె అసలు ఏడ్వదు. సత్యవంతుడు తన తలిదండ్రులను గురించి ఏడ్చినాడు. ద్యుమత్సేనుడు కుమారునిగురించి ఏడ్చినాడు. కాని సావిత్రి ఏడ్వదు—నారదుడు అప్రియమైన మాటలను పల్కినప్పుడుగాని, సత్యవంతుడు మరణించినప్పుడుగాని, పునర్జీవము పొందిన తరువాత సత్యవంతుడు తలిదండ్రులను తలచుకొని ఏడ్చినపుడుగాని ఆమె ఏడువలేదు. అది మొండితనంవల్లనూ కాదు. బండతనంవల్లనూ కాదు. ఆమె ధ్యేయాన్ని సాధించగల శక్తి ఆమెకున్నదనే ఒక చైతన్యమూ, ఏ సంఘటనయైనా ఎదుర్కొనగలిగే సంసిద్ధతా మాత్రమే ఆమె స్థితప్రజ్ఞత్వమునకు కారణములు. ఆమె అందమును, సత్యసంధతను, మంచిని, శక్తిని యినుమడింపచేసే ప్రత్యేక గుణం ఆమెకు సత్యవంతునియందుగల మహోజ్వల ప్రేమయే. ఆమె సాధారణంగా స్త్రీగురించి అందరూ అనుకునేటట్లు సుందరి, అబల, మగవాని ప్రక్క ఎముకనుండి చేయబడిన నారి మాత్రం కాదు—ఆమె దివ్యధామమునుండి దిగివచ్చిన అనంత స్త్రీ మూర్తి.

సావిత్రి ఏడువకపోవడమే కాదు, ఆమె యాచించదు కూడా. నారదుడు హెచ్చరించినమీదట అశ్వపతి ఆమెను మరల వరించుమని చెప్పినప్పుడు ఆమె సత్యవంతుని పెండ్లాడనిమ్మని తండ్రిని బతిమాలలేదు. హృదయార్పణ జీవితంలో ఒకసారి మాత్రమే జరుగుతుందని చెప్పింది. నారదుడు తన మనస్సు మార్చుకుని సత్యవంతునికి సావిత్రి నిచ్చేటట్లు అశ్వపతిని ఒప్పించాడు. ఆమె వజ్రసంకల్పాన్ని దివ్యమునినారదుడూ, మహారాజు అశ్వపతీ యిద్దరూ ఎదిరించలేకపోయారు. త్రిరాత్ర వ్రతం చేసే నిర్ణయం ఆమెదే. ఆమె మామగారు దానిని అనుమతించారు. నాలుగవరోజు రాత్రివరకు నిరాహార దీక్ష పూనడం ఆమె నిర్ణయమే. ఆ గడ్డురోజున

సత్యవంతునితో అడివికి వెళ్ళాలనే నిర్ణయంకూడా ఆమెదే. 'మీతో రావాలనిఉంది. వద్దనకండి' అంటుంది భర్తతో. అత్తమామలతో 'అడివి చూడాలని ఉంది' అని చెబితే వాళ్ళు కాదనలేకపోయారు. సత్యవంతుడు అసువులను బాసిన క్షణంలో అతని ప్రాణాల్ని తీసుకొనిపోవడానికి ఆమె ముందు యముడు నిలచినప్పుడు ఆమె ధృతి సడలలేదు. 'ఎవరు మీరు? ఎందుకు వచ్చారు ?' అని కాస్త కటువుగా అడిగింది సావిత్రి. యముడు సత్యవంతుని ప్రాణాలను తీసుకొని పోతున్నప్పుడు తనభర్త ప్రాణాలవెంబడి వెళ్లింది సావిత్రి. ప్రతి పర్యాయమూ యముడు మాట్లాడిన తరువాతనే ఆమె మాట్లాడింది. ఆమె వదనంలో గాని కంఠస్వరంలోగాని యాచన అనేది ఎక్కడా కనిపించలేదు. ఆమె ధర్మబద్ధంగా మాట్లాడడంతో యమధర్మరాజు యిరుకున పడ్డాడు. ఎందుకంటే అతడు మరణానికిమాత్రమేకాక ధర్మానికికూడా దేవతే. ఆమె మాటల సారాంశము అదే. యమధర్మరాజు కోరమన్న తరువాతనే ఆమె వరా లడిగింది. అత్తమామలకోసం, తలిదండ్రులకోసం అడిగిన తరువాత చివరకు సత్యవంతుని గురించి తనగురించి ఆలోచించింది. ఆమె మాటలను విన్న యముడు చైతన్యమునుపొంది ధర్మరాజుగా తన ధర్మమును గ్రహించి సత్యవంతుని ప్రాణమును వాపసుయిచ్చి సావిత్రివద్దనుండి శలవు తీసికొనినాడు.

సావిత్రి కూతురుగా, భార్యగా, కోడలుగా తన ధర్మమును మరువలేదు. అయినా ధర్మములను పాటిస్తూకూడా వాటిని అధిగమించి ఆమె తలిదండ్రులకు అత్తమామలకు సంరక్షకురాలిగా వారిని ఉద్ధరించింది.

సాహిత్యాభిమానులకు సావిత్రి ఉదాత్త కథానాయకురాలు కావచ్చు. కాని హిందువులకు, ముఖ్యంగా హిందూస్త్రీలకు ఆమె మ్రొక్కిన వరమిచ్చు వేల్పు. ఈ రోజువరకు హైందవ నారీమణులు వారి అయిదవతనంకోసం సౌభాగ్యంకోసం సావిత్రీవ్రతం ఆచరిస్తున్నారు. సాహితీ ప్రియులకు రాముడు రామాయణ కావ్యనాయకుడు. కాని కోట్లాది హిందువులకు రాముడు దేవుడు. సాహితీవరులకు కృష్ణుడు మహాభాగవత నాయకుడు, భారతకథలోని పార్థసారథి. కాని అతని కోట్లాది భక్తులకు అతడు కృష్ణభగవానుడు, గీతా ప్రవక్త. అదే విధముగా సావిత్రి సౌశీల్యమునకు, సౌభాగ్యమునకు, ప్రతివ్రతాశక్తికీ అధిష్ఠాన దేవత. తక్కిన దేవతలను పూజించినట్లు ఏదో మ్రొక్కుబడి చెల్లించుకోడం కాదు ఆమె విషయంలో హిందూ స్త్రీలు చేసేది. వారి హృదయాలయాలలో నిరంతరం నిలచి ఏలే దేవి సావిత్రి.

వ్యాసమహాభారతములోని సావిత్రీఉపాఖ్యానమును శ్రీ అరవిందులు ఎంతవరకు మార్చినారో గమనిద్దాము.

ప్రధాన ఘట్టములు మార్చలేదు. అశ్వపతి 18 సంవత్సరములు తపస్సు చేయడం, తత్ఫలితంగా సావిత్రి జననం, సావిత్రీ సత్యవంతుల పరిణయానికి విధిపెట్టిన అగ్నిపరీక్ష, సావిత్రి త్రిరాత్ర వ్రతం, సావిత్రి యమునినీ విధినీ జయించి సత్యవంతునికి పునరుజ్జీవనం యిప్పించడం, అత్తయింటి వంశాన్నీ, పుట్టింటి వంశాన్నీ ఉద్ధరించడం—ఇవి ప్రధాన ఘట్టములు, వీటిని మార్చలేదు.

కాని గాథను ప్రతీకగా మలచడంలో కొన్ని మార్పులు అవసరమయ్యాయి.

అశ్వపతి పదునెనిమిది సంవత్సరములు తపస్సు చేసినట్లు ముక్తసరిగా సుమారు పది పాదములలో వ్యాసమహర్షి వ్రాసినారు. అశ్వపతి యోగమును వివరించుటకు శ్రీ అరవిందులు 15 సర్గలు వ్రాసినారు. వారి మహాకావ్యంలో దాదాపు సగభాగం అశ్వపతి యోగాను ఆక్రమించినది.

సావిత్రి ఆచరించిన త్రిరాత్ర వ్రతము గురించి మూల ఉపాఖ్యానములో రెండు శ్లోకములలో సంక్షిప్తముగా చెప్పబడినది. కాని ఒక దివ్యశక్తినీ దివ్య చైతన్యాన్నీ పొందడానికి, అవతార లక్ష్యమును తెలుసుకొనడానికి సావిత్రి అంతర్దృష్టి ప్రసరించిన తపస్సును వివరించడానికి శ్రీ అరవిందులకు అధ్యాత్మికంగా కలిగిన అనుభవాన్నీ వారి సహసాధకురాలయిన మాతృశ్రీకి కలిగిన యోగసిద్ధి అనుభవాన్నీ వినియోగించి దాదాపు 4,000 పాదములలో విపులీకరించారు.

సావిత్రీ యముల సంవాదమును, సావిత్రీ విజయమును శ్రీ అరవిందులు మూడు పుస్తకములుగా 150 పుటలు వ్రాశారు. సావిత్రీదేవి యిచ్చిన వరముగా వ్యాసమహర్షి చిత్రించిన సావిత్రిని శ్రీ అర

విందులు వారి కావ్యంలో ఆదిశక్తి అవతారముగా రూపొందించారు. సావిత్రియొక్క దివ్యమానవ గుణం వారి కావ్యమునకు పునాదివంటిది. అంతటి దివ్యశక్తి వల్ల సావిత్రి యమునిలో మార్పు తేగలిగినది. జడముగానున్న యమునిలో నిద్రాణమై ఉన్న ధర్మమును మేల్కొలిపి చైతన్యం కలిగించి యమధర్మరాజనెడి పేరును సార్థకము చేసినది.

మరణమును జయించిన తరువాత సావిత్రీసత్యవంతుల జీవితమును చిత్రించడంలో శ్రీ అరవిందులు ప్రత్యేక ప్రతిభ చూపించారు. గాథలో వారిరువురూ భూమికి దిగివచ్చి, సత్యవంతుడు వాని తండ్రి రాజ్యమును పొంది చాలకాలము సుఖముగా పరిపాలిస్తాడు. కాని శ్రీ అరవిందుల ప్రతీకలో సావిత్రీసత్యవంతులు మరణరాజ్యం నుండి లేచి ఎక్కడ సత్యసూర్యుడు ఎన్నడూ అస్తమించడో ఎక్కడ అజ్ఞానమనేదే తెలియదో ఎక్కడ మరణానికి తావు లేదో అటువంటి అనంతదినప్రదేశంలో ప్రవేశిస్తారు. అటువంటి సత్యప్రదేశంలో కొంతకాలము గడపిన తరువాత నూతన మానవత్వాన్ని సృష్టించడం అనే దివ్యకార్యాన్ని అనుష్ఠించడంకోసం భూమికి దిగివస్తారు. ఆ విధముగా వ్యాసముని వ్రాసిన గాథను సృజనాత్మక దర్శనము గలిగిన శ్రీ అరవిందులు విశ్వప్రతీకగా మార్చారు.

ఇక గ్రంథవిశ్లేషణ చేస్తాను. ఈ మహావిశ్వకావ్యంపేరు 'సావిత్రి– ఒక గాథ, ఒక ప్రతీక.' ఈ మహాకావ్యంలో గాథకు సంబంధించినదీ, దానిలోని చిహ్నానికి లేక ప్రతీకకు సంబంధించిన నిగూఢత్వాన్ని వీలయినంతవరకు విడమరిచి చెబుతాను.

మొదటి పుస్తకం 'ది బుక్ ఆఫ్ బిగినింగ్స్' లోని మొదటి రెండు పర్వాలూ సంఘటనల మధ్యలో 'సత్యవంతుడు మరణించవలసిన రోజు' నాడు ప్రారంభమవుతాయి. సావిత్రీసత్యవంతుల వివాహం జరిగి పన్నెండు మధురమాసాలు అప్పుడే గతించి సత్యవంతుడు మరణించవలసిన నాటి అరుణోదయ మది. గాథలోనేకాక ప్రతీకగా కూడ అది అరుణోదయమే— అది విశ్వచరిత్రలో ఒక క్రొత్తశకానికి ఉషఃకాలము. ఈ మహాకావ్యం అంతటిలో ద్వికాలము ద్విచర్య కనిపిస్తాయి. ఒకప్రక్క గాథగా అది ఒకరోజు సంఘటనే చెప్పినప్పటికీ ప్రతీకగా ఆధ్యాత్మిక భూమికలో సర్వకాలము అనంతకాలము దానిలో యిమిడిఉన్నాయి. గాథలో భౌతికభూమికలో సత్యవంతుడు మరణించవలసిన రోజున ప్రారంభమై యమునిపై సావిత్రి విజయం సాధించి సత్యవంతుడు పునర్జీవనం పొందడంతో అంతమవుతుంది.

ఇక ప్రతీక చూద్దాం.

ఆధ్యాత్మిక భూమికలోకూడా సంఘటనల మధ్యలో ప్రారంభమయింది. మానవచరిత్రలో అణ్వస్త్రాల అసురసృష్టితో మానవజాతే నాశనమయ్యే పరిస్థితులు ఎదురయినవి. ఈ గడ్డుసమస్య దాటి మానవాళి బ్రతికి బట్టకడుతుందా లేక నాశనం అవుతుందా ?

ఇదే జీవన్మరణ సమస్య గురించి వారి దివ్యజీవనం అనే గ్రంథంలో శ్రీ అరవిందులు ప్రశ్నించారు. దానికి పరిష్కార మార్గాన్ని కూడా సూచించారు. మళ్లీ అదే సమస్యను సావిత్రి అనే మహాకావ్యంలో కవిత్వపరిభాషలో చర్చించి పరిష్కరించారు. సావిత్రి కావ్యంలోని ఆధ్యాత్మికనాటకం ప్రతిఆత్మలోను జరుగుతున్నది. నిజానికి అసురశక్తిని ఆధ్యాత్మికశక్తితో ఎదుర్కొని, లొంగదీసి మార్చివేయువచ్చును. అందుచేత ఆత్మకు–ప్రకృతికి పట్టిన తాత్కాలిక పాక్షిక అంధకారం తొలగిపోవడంతో కావ్యం ముగుస్తుంది.

ఇంతటి మహాకార్యాన్ని సాధించే శక్తి సావిత్రికి ఎట్లా వచ్చింది? దానికి జవాబు మొదటి పుస్తకం లోని రెండు పర్వాలలోను, రెండవ పుస్తకం 'ది బుక్ ఆఫ్ ది ట్రావెలర్ ఆఫ్ ది వరల్డ్స్'లోను, మూడవ పుస్తకం 'ది బుక్ ఆఫ్ ది డివైన్ మదర్'లోను వివరంగా చెప్పారు.

మహాభారత ఉపాఖ్యానంలో అశ్వపతిరాజు పిల్లలకోసం తపస్సుచేసి పుత్రికా వరం పొందుతాడు. శ్రీ అరవిందుల కథనంలో అశ్వపతి కేవలం పిల్లలకోసం తపస్సుచేసే రాజు మాత్రమేకాదు. యుగ యుగములుగా ఆత్మజ్ఞానంకోసం అన్వేషించే సాధకునికి ప్రతీక.

అరవిందుల అశ్వపతి యోగము మూడు భాగములుగా విభజించవచ్చును. వ్యక్తిగా ఆధ్యాత్మిక సిద్ధిని పొందడం మొదటిది. 'యోగా ఆఫ్ ది కింగ్'లో వర్ణించబడింది. తరువాత మానవుల ప్రతినిధిగా చైతన్యభూమికలను సాధించడం రెండవది. రెండవ పుస్తకంలో వివరించారు. అయితే ఇంతవరకు ఇది వ్యక్తిగత విజయం మాత్రమే. చివరకు విశ్వమంతటికి దివ్యచైతన్యం లభించి నూతనసృష్టి జరిగే విధం మూడవ పుస్తకం 'ది బుక్ ఆఫ్ ది డివైన్ మదర్'లో వర్ణించారు.

అశ్వపతికి తెలిసిన రహస్యజ్ఞానం నాలుగవ పర్వంలో వివరించారు. దేవుని లీలలు అశ్వపతికి తెలిసినవి. సృష్టిలోని నిగూఢత అర్థమయింది.

లోకాన్ని ఆవరించిన చీకటిని తొలగించడానికి ఆదిశక్తి అంశ అశ్వపతికి కుమార్తెగా అవతరిస్తుందని వరం పొందుతాడు ఆ రాజు.

రెండవ భాగం, 'నాలుగవ పుస్తకం'తో మనం మళ్లీ మానవ కథకు వస్తాం. రాజుకిచ్చిన వరం ఫలించింది. జ్వాలామతల్లి జననం, శైశవం వర్ణించే పర్వం, తరువాత పర్వాలలో సావిత్రి బాల్యం నుండి స్త్రీమూర్తిగా ఎదిగి ప్రేమించే దశకు చేరడం చూస్తాం. రాజ్యభ్రష్టులైన ద్యుమత్సేనమహారాజు కొడుకు సత్యవంతుని, పర్ణశాలలో గుడ్డివారైన తరిదండ్రులకు సేవచేస్తున్నవానిని సావిత్రి చూసింది. సావిత్రి సత్యవంతులు పరస్పరం ప్రేమించుకున్నారు. ఇంటికివచ్చిన తండ్రితో తన ప్రేమ వృత్తాంతమును తెలిపింది సావిత్రి. ఆ సమయంలో అక్కడఉన్న నారద మహర్షి సత్యవంతుని గొప్పగుణాల్ని యోగ్యతల్ని పొగడి, అతడు అల్పాయుర్దాయం కలవాడనీ, ఒక సంవత్సరంలో అతనికి మరణం తప్పదని చెప్పాడు. సావిత్రి తల్లి సత్యవంతునిమీద ఆశ పెట్టుకొనవద్దని సలహాయివ్వగా సావిత్రి సత్యవంతుని మాత్రమే పెండ్లాడుతానని పట్టుపట్టింది.

సావిత్రి అందరి కన్యలవంటిదికాదని, ఆమె దివ్యసంకల్పశక్తివల్ల అంతా సవ్యంగా జరుగుతుందని నారదుడు ధైర్యం చెబుతాడు.

ఏడవ పుస్తకం 'ది బుక్ ఆఫ్ యోగా'లో సావిత్రీ సత్యవంతుల వైవాహిక ప్రేమ వర్ణించబడినది. సావిత్రికి సత్యవంతుని తలవ్రాత ముందుగానే తెలుసును కనుక ఆమె వైవాహిక జీవితంలోని మాధుర్యాన్ని పూర్తిగా చవిచూడలేకపోయినది. సావిత్రి ఆదిశక్తి అంశతో ఉద్భవించినదే అయినప్పటికీ మానవాకృతి ధరించడంవల్ల కొంచెం మనఃక్లేశం తప్పదు. అయినా ఆమెలోని దివ్యత్వం జాగృతంగానేఉంది. ఆమె అశ్వపతియోగఫలము కాబట్టి యోగినిగా తన బలాన్ని గ్రహించి విధితో రానున్న పోరాటానికి సన్నద్ధమయినది. సావిత్రి తనలోనికి అంతర్దృష్టిని ప్రసరించి స్థూలనేత్రానికి కనిపించే ఆకారాన్ని నిరాకరించి లోనున్న ఒక్కొక్క తెరనే తొలగించి ఆమె పూర్ణ దివ్యత్వాన్ని, తన అవతారలక్ష్యాన్ని గ్రహించింది. అశ్వపతి కేవలం సాధన స్వరూపమయితే సావిత్రి ఆ సాధనయొక్క పరిణామమేకాక ఆ సాధనసిద్ధి కూడా. ప్రకృతి ధర్మాన్ని దివ్యధర్మంగా మార్చే పరాశక్తి అంశ ఆ మహాతల్లి. అశ్వపతి, సావిత్రి ఇద్దరూ కూడా తమ స్వార్థంకోసం మాత్రమే ఆధ్యాత్మిక కృషి చేయలేదు. సర్వమానవ విముక్తికి, విశ్వవిముక్తికి దివ్యపరిణామసృష్టికి వారు సాధనచేసి సిద్ధిపొందారు.

మళ్ళీ ఆ గడ్డురోజుదగ్గరకు వద్దాం. సావిత్రి యోగసాధన తరువాత దివ్యదృష్టితోను దివ్యశక్తితోనూ శక్తిమంతురాలై సత్యవంతునితో అడవికి వెళ్లింది. మృత్యుక్షణం సమీపించడంతో సత్యవంతునికి తలనొప్పి రావడం ఆమెపేరు తలుస్తూ ఆమె ఒడిలో తలపెట్టుకుని దీర్ఘనిద్రలో మునగడం జరిగాయి.

సావిత్రి మహాకావ్యంలోని మూడవభాగంలో సత్యవంతుని ఆత్మకోసం సావిత్రికీ యమధర్మరాజుకీ జరిగిన సుదీర్ఘపోరాటమూ, సావిత్రి విజయమూ వివరించారు. బోధివృక్షంక్రింద సిద్ధార్థుని సాధన సమయంలో మహాజ్ఞానోదయం జరిగేముందు సిద్ధార్థుడు మారునితో పోరాడి జయించి బుద్ధుడయ్యాడు. అదే విధమయిన అగ్నిపరీక్షకు లోనయింది సాధ్వి సావిత్రి. అయితే స్త్రీగా భార్యగా ఆమె యమునితో పోరాడడం యింకా ఆసక్తికరమైనది. ఆమె విజయం—ప్రేమ

మృత్యువుపై సాధించిన విజయం. అమృతజీవనమే ఆ విజయఫలం.

యముని సాక్షాత్కారం చాలా అందముగా వర్ణించారు శ్రీ అరవిందులు. భయంకరంగా ఉంటూనే అందముగా ఉన్నాడు యముడు. చావుని ప్రసాదించే వాడయినా ఆయనొక దేవత.

సావిత్రీ యములకు జరిగిన పోరాటం కురుక్షేత్ర యుద్ధంమాదిరి వర్ణించారు శ్రీ అరవిందులు. పరాశక్తి అవతారమైన ఆ మహాతల్లి యమునికి బోధించిన వాక్యాలలో ఒక దివ్యగీత, ఆ గీత ప్రభావం యమునిపై విస్తృతంగా ఉండడానికి తన ఆదిశక్తి స్వరూపాన్ని యమునికి చూపించడంలో ఒక విశ్వరూప సందర్శనం శ్రీ అరవిందులు వారి కావ్యం చివరి భాగంలో చూపించారు. సావిత్రితోపాటు ప్రతీకస్థితిలో అనంత రాత్రి, ద్విసంధ్యలుగడిచి అనంత ప్రభాతంలో అడుగు పెడతాం.

సావిత్రి యముని జయించి విధిని మార్చింది. యముని పాశంనుంచి సత్యవంతుడు విముక్తుడైనాడు. పాశిక తిమిరం ఆవరించిన ఆత్మ సత్యస్వరూపం తేజోమయం అయింది. గాథగా ప్రతీకగా సావిత్రి కావ్యం శుభాంతం అవుతుంది. అయితే ఈ ముగింపు ఈ శుభాంతం మానవచరిత్రలో యింకా వర్తమాన భవిష్యత్తులలో పూర్తికాలేదు. అది యింకా సాధించవలసి ఉంది. మానవుని దివ్యీకరణంవల్లకాని అది సాధ్యంకాదు. అది శ్రీ అరవిందుల పూర్ణయోగ సాధన వల్లనే సాధ్యం అవుతుంది.

శ్రీ అరవిందులు ఇంగ్లీషు ఛందస్సులో అన్ని రకముల పద్య రచనలను చేయగలిగి నప్పటికీ బ్లాంక్ వెర్స్‌లో వారు సిద్ధహస్తులు. వారి మహాకావ్యం సావిత్రి అంతా బ్లాంక్‌వెర్స్‌లోనే వ్రాశారు. వారి బ్లాంక్‌వెర్స్ మిల్టన్‌మహాకవి వ్రాసిన బ్లాంక్ వెర్స్‌తో కొంతవరకును, టెన్నిసన్ మహాకవి వ్రాసిన బ్లాంక్ వెర్సుతో కొంతవరకును పోలి ఉన్నప్పటికిని ఎన్‌జాంబ్‌మెంట్ లేకుండా అనగా ఒక పాదంలోని భావం తరువాత పాదానికి పరుగెత్తకుండా ఏ పాదానికా పాదం స్వయంసమృద్ధముగా ఇటుకలు పేర్చినట్లుండడం వారి కవితా విశేషం.

కాగా మరొక గొప్పగుణంకూడా వారి కవిత్వంలో ఉంది. అనుష్టుప్ ఛందస్సులో వాల్మీకి మహాకవి సాధించినట్లు శ్రీ అరవిందులు బ్లాంక్ వెర్స్‌లో మంత్రప్రభావం యిమిడ్చారు.

దివ్యానుభూతి పొందిన కవికి ఆ అనుభవ ప్రసారానికి భాష ఒక ప్రతిబంధకం కాదని శ్రీ అరవిందులు తమ విశ్వకావ్యం అయిన సావిత్రిద్వారా నిరూపించారు.

ప్రపంచ సాహిత్యంలో శాశ్వతంగా ఏదయినా కావ్యం నిలవడానికి నాలుగు లక్షణాలు కావాలి. ఒకటి అంతర్దర్శనము. రెండు, మానవ సనాతనధర్మంతో సంబంధము. మూడు, సహజంగా, సజీవంగా అమరంగా కదిలే పాత్రపోషణ. నాలుగు, ఆత్మగుణం అనగా కవియొక్క ఆత్మ అనుభవించిన దానిని పాఠకుని ఆత్మకు అందించకలిగే గుణం. ఈ నాలుగు గుణాలూ శ్రీ అరవింద విరచిత సావిత్రిలో పుష్కలంగా కనిపిస్తున్నందువల్ల ఈ మహావిశ్వకావ్యం శాశ్వతంగా ప్రపంచ సాహిత్యంలో నిలుస్తుందనడంలో సందేహం లేదు.



రైలాగింది

"శ్రుతకీర్తి"

జామున్‌గాఁవ్ స్టేషన్ మాష్టరు హడావిడిపడుతున్నాడు. దిగువనుంచీ వచ్చే ఎక్స్‌ప్రెస్ ఆలస్యం అయింది. ఎన్నడూ లేనిది ఆ రోజు జనతా రైట్ టైముకి వస్తున్నది ఎక్స్‌ప్రెస్ బళ్ళు క్రాసింగు వున్నదిఅంటే స్టేషన్‌మాష్టరు మామూలు కంటె హుందాగా అగుపిస్తాడు. పాయింటుకొట్టి టాప్‌లైను మెయిన్‌లైన్‌తో కలిపేశాడు కూలీ. ఆలస్యంగా వచ్చినందుకు శిక్షగా ఎక్స్‌ప్రెస్ టాప్‌లైన్ మీదకు రావడానికి సిగ్నలుపైకి లేచింది. ఆకుపచ్చ జండాచుట్టి ఎడంచేత్తో పట్టుకుని కుడిచేత్తో ఎర్ర జండా విదిలించి పట్టుకుని ప్లాటుఫారం అంచున నిలబడ్డాడు స్టేషన్ మాష్టరు.

కూలీ ఎవర్నో కేకేసి పిలుస్తున్నాడు, 'అరే సజ్జూ...! నీ పంట పండిందిలే యివ్వాళ. ఎక్స్‌ప్రెస్ క్రాసింగుంది...రా...దబ్బున రా...'

స్టేషన్ బయట చెట్టుకింద తువ్వాలుపరుచుకుని పడుకున్న సజ్జూ లేచి తువ్వాలు తలకు చుట్టి పక్కనున్న పెద్దబుట్ట నెత్తుకుని గబగబా అడుగులేసుకుంటూ ప్లాటుఫారంమీదికి వచ్చాడు. బుట్టనిండా నేరేడుపళ్లు నలుపూ నీలం కలబోసిన రంగులో మెరుస్తున్నాయి. అప్పటికే ఒక అరడజనుమంది పిల్లలు నేరేడుపళ్ల తట్టలతో అక్కడకు చేరారు.

జామున్‌గాఁవ్ స్టేషను అంటే ఒక చిన్నగది, రెండు వేపులా వరండా. ప్లాటుఫారంమీద రెండు మూడు చెట్లు, ఒక సిమెంట్‌బల్ల, మెయిన్ లైన్, ఒక టాప్ లైను...అంతే. బుకింగ్ క్లర్కూ, టిక్కెట్టు కలెక్టరు, స్టేషను మాష్టరూ అన్నీ ఒకడే. పాసింజరు బళ్ళు మాత్రమే అక్కడ ఆగుతాయి. రోజుకి మూడు బళ్లటూ, మూడిటూ వెడుతుంటాయి. ఎక్స్‌ప్రెస్ బళ్లు ప్లాటుఫారం మీద స్టేషనుమాష్టరు వూగించే ఆకుపచ్చజండా చూసీ చూడనట్లు ఠీవిగా సాగిపోతుంటాయి. ఎప్పుడన్నా అరుదుగా క్రాసింగు జరుగుతేనో లేక లైన్ రిపేరులో వుంటేనోతప్ప ఆగే పనిలేదు వాటికి. వేసంగిలో ఎక్స్‌ప్రెస్ ఆగిందంటే నేరేడు పళ్లమ్మే పిల్లలకు పండగే. ఒక్కకిటికీ దగ్గరే బుట్టఖాళీ అయిపోతుంది. ఆ బళ్లల్లో పెద్దపెద్ద పట్నాల దొరబాబులుంటారు. వాళ్లకి మసాలామిఠాయించిన నేరేడుపళ్ళరుచిఅన్నా, తిన్న తర్వాత నాలుకజాపి నీలం రంగుచూచి నవ్వుకోవడంఅన్నా చాలా యిష్టంఅని ఆ పిల్లలకు తెలుసు. పావలాకు పదికాయలిచ్చినా తేలిగ్గా కొనేయగలరు. పాసింజరు రైళ్లట్లాకాదు. అందులో వుండేది కొద్దిపాటి దూరాలు పయనించే పల్లెటూరి వాళ్లు. వాళ్లకి నేరేడు పళ్లుకొని తినాల్సిన అవసరం కలగదు. ఆ రుచి వాళ్ళని ప్రత్యేకంగా ఆకర్షించదు. అథవా ఎవరైనా కొనాలనుకుని పిలిచినా పావలాకు పది అంటే నోరు తెరుస్తారు. కొంతమంది కసురుతారు. మరికొందరు గీసిగీసి బేరమాడతారు. నోట్లో వేసుకుచూసి కొంటామంటారు. అందుకని పాసింజరు బళ్ళంటే అమ్ముకునే పిల్లలకు గిట్టదు. కాని తప్పదుగదా! అందుకే ఎప్పుడో రాక రాక వచ్చే ఎక్స్‌ప్రెస్‌కోసం ఎదురు చూస్తుంటారు.

బండిమోత దగ్గరవుతున్నది. అప్పటికే కుర్రాళ్ళు ప్లాటుఫారం దిగి టాపులైన్ వైపుకుపోయి చుట్టుపక్కల పోటీ లేకుండా అనువైన చోట్లు చూసుకుంటున్నారు. సజ్జూ ప్లాటుఫారం మధ్య నిలబడ్డాడు. మిగిలిన కుర్రాళ్ళవంకచూచి తన వయస్సు గుర్తుకువచ్చి కొంచెం సిగ్గుపడ్డాడు. వాళ్ళందరూ తన కొడుకు భోలా యీడువాళ్ళు. భోలా అవిటివాడు కాకుండావుంటే తనబదులు బుట్ట తీసుకుని యిక్కడ నిలబడి వుండేవాడు. అవిటి తనమేకాదు...తన ఖర్మ

కాకపోతే...పదేళ్ల భోలాకు పుట్టుకతోనే మూగతనం కూడా ప్రసాదించాలా భగవంతుడు...సజ్జూ మనస్సులో ఒక్కసారి సన్నగా కలుక్కుమన్నది.

ఎక్స్‌ప్రెస్ వస్తున్న చప్పుడు పట్టాలమీద దణదణలాడుతున్నది అటుకేసి చూశాడు సజ్జూ. ఇంజను పొగ సరిగా కనిపించడం లేదు. ఈ యింజన్లు పొడుగాను సరిగ్గా కనిపించేటట్లు పొగా వదలవు, పాత యింజన్లలాగా చెవు లదిరిపోయేట్టు కూయనూ కూయవు...ఇక చప్పుడుకూడా లేని యింజన్లు వచ్చాయంటే యింకా యేమన్నా వుందా అనుకున్నాడు సజ్జూ.

బండి స్టేషన్‌లోకి వచ్చింది. మామూలుగా బాణంలా దూసుకుపోయేది అక్కడా యిక్కడాగాక నట్టడివిలో జామున్‌గావ్‌స్టేషన్‌లో పట్టుబడిపోయింది. లావాటి దొరచుట్టకాలుస్తూ ఎత్తైన కిటికీలోనించీ ఆంగ్లో యిండియన్ డ్రైవరు స్టేషన్‌మాష్టర్‌వంక కొంచెం చిరాకుతో చూశాడు. స్టేషనుమాష్టరు చేతులో ఎర్రజండా నెత్తురులా మెరుస్తున్నది. కీచుమని చప్పుడు చేసుకుంటూ బండి ఆగిపోయింది. బండిలో ప్రయాణీకులు తలలు బయటకుపెట్టి యిక్కడ ఆగామేమిటాఅని వింతగా చూస్తున్నారు.

సజ్జూ అటూ యిటూ తచ్చాడుతూ ఒక ఫస్ట్ క్లాస్ డబ్బాదగ్గరకు చేరాడు. కిటికీలోంచి ఒకదొర, దొరసాని నేరేడుపళ్లవంక వింతగా చూడసాగారు. అనుభవంకల సజ్జూ వెంటనే బుట్టదింపి తొందరగా రెండాకుల్లో పళ్లుపెట్టి మసాలాపొడిచల్లి గలపరించి చెరొకటీ అందించాడు. దొరసాని ఒకటి తీసుకుని నోట్లో వేసుకుని చప్పరించి గింజవుముసి దొరతో యేదో నవ్వుతూ అన్నది. దొరకూడా తినడం ప్రారంభించాడు. సజ్జూ అక్కడే నిలబడి చూస్తున్నాడు. ఇద్దరి చేతుల్లో ఆకులు ఖాళీ అయిపోయాయి. మళ్లీ చెరొక పొట్లం అందించాడు సజ్జూ. అవి తీసుకుని అతను పర్సుతీసి రెండురూపాయలకాయితం అందించి చాలా అన్నట్లు చూశాడు. కాని దొరసాని ఏదో గట్టిగా అనడంతో మరొక రూపాయికాయితంకూడా యిచ్చాడు. అవి జేబులో భద్రపరుచుకుని రెండు చేతుల్తో వాళ్లకు దణ్ణంపెట్టి ముందు సాగిపోయాడు మరొక కిటికీ దగ్గరకు సజ్జూ.

కాసేపట్లోనే బుట్ట ఖాళీఅయిపోయింది. సందె వేళ పాసింజరు వచ్చేవేళదాకా తారట్లాడాల్సిన అవసరం తప్పిపోయింది.

జనతా దణదణా దూసుకుపోయింది. నెమ్మదిగా ఎక్స్‌ప్రెస్‌కూడా బయల్దేరింది.

సజ్జూ డబ్బులు తీసుకు లెక్కపెట్టుకున్నాడు. మొత్తం ఆరు రూపాయలపైన చేరింది. మామూలుగా ఆ బుట్టకు రెండు రూపాయలకంటె ఎక్కువ వచ్చేవికావు. అనుకోకుండా ఎక్స్‌ప్రెస్ రైలాగడం, బంగారంలాంటిబేరం తగలడంలో సజ్జూకు బుట్టలో ఖాళీఅయిన బరువుకంటె మనసులో భారం మరింత తేలికయింది. డబ్బు జాగ్రత్తపెట్టుకుని తలమీది పాగా విదిల్చి బుజానవేసుకుని ఖాళీబుట్టతో యింటిదోవ పట్టాడు సజ్జూ. స్టేషన్‌లో కుర్రాళ్లు సన్నగా సర్దుకుంటున్నారు. ఇంకా పూర్తిగా అమ్ముడు పోని వాళ్లు అటూ యిటూ తారట్లాడు తున్నారు.

స్టేషన్ పక్కనేవున్న వాగువెంబడి మైలు నడిస్తేగాని వూరు తగలదు. సజ్జూ బుట్ట నెత్తిమీద తగిలించుకుని వాగువెంబడి ఎగుడుదిగుడు రాళ్లమీదుగా నడక సాగించాడు. కింద కాళ్లు కాలుతున్నాయి. పైన సూర్యుడుకూడా బుట్ట చిల్లుల్లోంచి చురుక్కున పొడుస్తున్నాడు. వాగులో యిసుక మేట వేసుకుపోయింది. సజ్జూకు సన్నగా కడుపులో కాలుతున్నది. పొద్దున్నే రెండు చపాతీలు మిరపకాయ పుచ్చుతో నంచుకు తిన్నాడు...అంతే. మామూలుగా అయితే యీవేళప్పుడు స్టేషన్లో ఎవరిదగ్గరో బజ్జీలో సొతాళించిన సెనగలో కొనుక్కుతిని యిన్ని మంచినీళ్లుతాగి చెట్టుకింద చేరగిల పడేవాడు. కానీ యీ రోజు అలాకాదు. ఇట్లాంటిరోజు ఎప్పుడోగాని రాదు. జేబులో డబ్బు గుర్తుకువచ్చి సజ్జూ ఆకలిని గిదిపాడు. పడగాలి సాగింది. వాగులో యిసుక పొరలు పొరలుగా గాలివాటున సాగిపోతున్నది.

ఊరుదగ్గర పడింది. ఊరిచుట్టూ నేరేడు చెట్లు. అందుకే ఆవూరు జామున్‌గావ్ అయింది. చెట్లకింద మంచాలమీదపడి నిద్రపోతున్నారు జనం. ఎత్తైన మట్టి దిబ్బలమీద పెంకులుపరిచిన మిద్దెలు లేకపోతే గోధుమగడ్డితో నేసిన యిళ్లుమాత్రమే ఆ వూళ్లో వున్నాయి. అక్కడ డబ్బున్నవాళ్లెవరూ లేరు.

ఉన్న ఒకరో యిద్దరో వందమైళ్లలోవున్న పట్టణానికి తరలిపోయారు. మోతుబరిరైతులు లేకపోవడం వలన ఎవరిపని వాళ్లదే. అదే వాళ్ల కాధారం. నేలంతా ఎగుడు దిగుడుగా వుంటుంది. ఎక్కడచూసినా రాతి తుప్పలే. వాగులోకి నీళ్లు మళ్లితేతప్ప సాగుబడికూడా అంతమాత్రమే. వాళ్ల బతుకుల్లో ఎక్కువభాగం ఆ చెట్లకింది మంచాలమీదే గడిచిపోతుంది.

సజ్జా మంచాలమీద హుక్కాగొట్టం చుట్టూ కూర్చున్న ఒకరిద్దర్ని పలకరించి కొంచెం ముందుకు సాగి తనయింటియందున్న రావిచెట్టుకింది దేవుడికి దణ్ణంపెట్టి వెనక్కి తిరిగాడు.

పదేళ్ల భోలా అంతయెండలో చూరుకింద పాటి మట్టిగోడ నానుకుని చేరగిలబడ్డాడు. వాడు నడవ టానికి ఆసరాగావుండే కర్ర ఒకపక్క, ఎప్పుడూ తోడుగా తిరిగేకుక్క రాణి మరొకపక్క ఏదో సానుభూతి చూపిస్తున్నట్లు పడుకున్నాయి. లోపలనుంచీ పూనమ్ గొంతు కరుకుగా వినిపిస్తున్నది. క్షణంలో పరిస్థితి అర్థంచేసుకున్న సజ్జా నీరుకారిపోయాడు ఆ రోజు నాలుగురాళ్లు ఎక్కువ గిట్టిన విషయంగానీ, మధ్యాన్నం తిండికి యింటికి రాగలగడంగానీ అతనికేమీ ఆనందం గొల్పడంలేదు. మనిషి అలికిడివిన్న రాణి లేచినిలబడి సజ్జాని చూసి తోకాడించడం మొదలుపెట్టింది. అల వాటుగా సాయంకాలం కాకుండా పెందరాడే యింటికి వచ్చిన తండ్రిని చూసి భోలా కళ్లు మిలమిల లాడాయి. వాడు మాట్లాడేదీ, చూసేదీకూడా ఆ కళ్ల తోనే. సజ్జాకి, రాణికీ ఆ కళ్లంటే మిక్కుటమైన ప్రేమ, ఆప్యాయాతాను. కానీ సవతితల్లి పూనమ్‌కి వాడంటే అసహ్యం. వాడంటేనేకాదు, ఆ ఘూరు, మనుషులు, రాణి, ఆఖరికి సజ్జాఅన్నా కిట్టదంటే అతిశయోక్తికాదు.

లోపల్నించీ దీవనలు యింకా వినిపిస్తూనే వున్నాయి. సజ్జా భోలాముందు కూర్చుని చేతుల్తో దగ్గరకుతీసుకుని 'అన్నం తిన్నావా'అని అడిగాడు, తల అడ్డంగా తిప్పబోయి మళ్లీ ఔనని తల వూచాడు భోలా. దొంగతనం పసికట్టేసినట్లు రాణి ఒకసారి అరిచింది.

తాను తొందరగా యింటికెందుకు వచ్చానో చెబుతున్నాడు సజ్జా. ఇంతలో పూనమ్ బయటికి వచ్చింది. చూడటానికి పున్నమివెన్నెలలాగా మనో హరంగానే వుంటుంది. కానీ గొంతుమాత్రం అమా వాస్యరాత్రి స్మశానాలలో నక్కలుపెట్టే వూలలాగా వుంటుంది.

'ఏం! యింత పెందరాడే వచ్చిపడ్డావేం! ఈ పూటయినా రెండురాళ్లు పట్టుకొచ్చావాలేదా! ఈ కొంపతో వేగలేక చస్తున్నాను. పైగా యీ అవిటి వెధవొకడు...వాడికొక కుక్క...ఈ చీర చూడు... ఎట్లా వెలిసిపోయిందో! వచ్చేవారం సేఠ్‌జీని చీర తెమ్మన్నాను. మరి డబ్బులెల్లా పట్టుకొస్తావో... అంతా చేతకానితనం.. ఇంతకీ నిన్నని ఏలాభంలే! అంతమంచి వూర్నించితెచ్చి యీ అడివిలో పడేశాడు... మాఅయ్య'అంటూ ఏకబిగిని మాట్లాడేసి లోపలికి తిరిగిపోయింది పూనమ్.

మామూలుగా చీకటిపడ్డాక యింటికివచ్చే సజ్జాకి యీ మాటలువినే అవసరం వుండేదికాదు. సత్తు తపేలాతో నీళ్లు కాచుకుని స్నానంచేసి రెండు రొట్టెలో అన్నమోతిని పడుకుని గుర్రుపెట్టేవాడు. ఏ రాత్రివేళనో బుద్ధిమళ్లితే పూనమ్ నిద్ర లేప గొట్టేది. కానీ పొద్దస్తమానం యింట్లోనే పడుండే భోలా ఆవెువచోవ్యాఘాతాలకు ఎరకాక తప్పదు. అది తెలియకకాదు...తెలిసికూడా తనేమీ చేయలేనందుకు అప్పుడప్పుడు చింతిస్తుండేవాడు సజ్జా.

నీరసంగా లేచి నిలబడి కొడుకుకు చేతులం దించి తీసుకుని లోపలికివెళ్లాడు. రాణి చేతికర్రను ఒకవేపు కరిచి పట్టుకుని యీడ్చుకుంటూ తీసుకు వెళ్లింది.

* * *

ఎండలు ముదిరాయి. వాగుఒడ్డున యిసుక చెలమలలో మంచినీటి వూటలో బిందెను నింపు తున్నాడు సజ్జా.

ఎవరికోసమూ ఆగాల్సిన పనిలేని ఎక్స్‌ప్రెస్ జాముమ్‌గాంవ్ స్టేషనుదాటి దర్జాగా యీల వేసు కుంటూ సాగిపోతున్నది.

బిందె నిండింది. చేత్తో బిందెకంటిన యిసక తుడిచి బుజానపెట్టుకుని వూరివైపు నడక సాగిం

చూడు సజ్జా. ఒక్కసారిగా చల్లగాలి సోకింది. చిరుచెమట పట్టిన వంటికి చల్లగాలి సుఖాన్నిగొలిపింది. తల పైకెత్తి చూశాడు — ఆకాశంలో మెరుపు సజ్జా కళ్లల్లో తళుక్కుమంది. ఒక్కసారి ఆనందంనిండింది అతని గుండెల్లో. ఈ యేడు కాస్త తొందరగా వాగు నిండితే పొలంపని మొదలెట్టొచ్చు. నాలుగు గింజలు రాలుబడవుతే ఏడాదల్లా కడుపునిండా తినొచ్చు—ప్రతి యేడూ అలా వుండదు. ఒక్కొక్కప్పుడు సాలు సాలంతా అర్ధాకలితో గడపడమే.

మంచినీళ్లకీ సాగుబడికీ ఆ వాగొక్కటే ఆధారం. అందులోనించీ చిన్నచిన్న మళ్లలోకి నీళ్లెక్కించడానికి పడే శ్రమ పడేవాడికే తెలుస్తుంది. వాగు పూర్తిగా నిండితే మళ్లలోకి నీరెక్కుతుంది. ఎగువన కురిసే వర్షాన్నిబట్టి వాగునిండుతూ వుంటుంది.

సన్నగా సాగినగాలి సెలలువేసుకుంటూ సుళ్లు తిరుగుతూ సాగిపోతున్నది. కొండలమీద చక్కగా నిలువుగా పెరిగిన చెట్లన్నీ గాలివాలుకు లయబద్ధంగా తూగుతున్నాయి.

బిందెలో నీరు కొంచెం పారబోసి దుమ్ము పడకుండా తలగుడ్డ వాసెనగట్టి పరుగులాంటి నడక సాగించాడు సజ్జా. ఇంటిదగ్గర బిందె దించేసరికి మళ్లీ కొంచెం చెమట పట్టినట్లనిపించింది.

ఒకసారి బయటకువచ్చి పరజూచాడు. చిన్న పిల్ల చేతకాక ముఖమంతా పులుముకున్న కాటుక లాగా వున్నాయి ఆకాశంమీద మబ్బులు. నాలుగు వేపులా కొండకొమ్ముల మీదనుంచీ కమ్ముకుంటూ వచ్చిన మబ్బులు లోయలోని వూళ్లమీద చిక్కటి నీడలు పరుస్తూ ఎక్కడ ముంచెత్తుదామాఅని తహ తహ లాడుతున్నాయి.

చూస్తుండగానే గులకరాళ్లు దిమ్మరించినట్లు చినుకులు పడసాగాయి.

అంతవరకూ పొలం సాగుబడిని, తిండినిగురించి ఆలోచిస్తున్న సజ్జాకి నేరేడుపళ్లు గుర్తుకువచ్చాయి. హఠాత్తుగా అతనికి కలవరం కలిగింది. వెంటనే దొడ్లోకివెళ్లాడు. నేరేడుచెట్లన్నీ విరగ కాచివున్నాయి. ఆకు ఆకుకీ కాయవంతున చెట్లన్నీ పచ్చగా నీలంగా కనబడుతున్నాయి.

చినుకులజోరు హెచ్చింది. దానికితోడు గాలి... కొంచెం సేపటిలో కాయలు దింపకపోతే రాలి చితికి పోతాయి. లేదా పెచ్చాడిపోతుంది అంతా నేల పాలవుతుంది. వాగు నిండటం దేవుడెరుగు. ముందీ అవాంతరం తప్పించాలి.

పూసవ్వని పిలిచాడు. సమాధానంలేదు. లోపలికి వెళ్లిచూశాడు. భోలా వెదురుబద్దల కిటికీలోంచి చేతులు చాచి చూరునీళ్ల తడుపులో ఆనందిస్తున్నాడు. రాణికూడా అటూ యిటూ గంతులేస్తున్నది. పూసవ్వ ఎవరింటికో వెళ్లినట్లుంది. వెంటనే ఒకచీర, పొడుగాటివాసం తీసుకుని భోలాని రమ్మనిపిలిచాడు సజ్జా. నేరేడుకాయలు దింపాలంటే, చెట్టుకింద యిద్దరు మనుషులు వెడల్పాటిగుడ్డ రెండువేపులా పట్టుకుంటే పైనించి వాసంతో కాయ రాల్చాలి. అప్పుడే కిందపడి చితకకుండా, మట్టి అంటకుండా కంటికి నదురుగా కాయ బుట్టలో మెరుస్తూ కొనేవాళ్ల కళ్లనాకర్షిస్తుంది. కాని రెండోపక్క పట్టడానికి పూసవ్వ లేదు. సజ్జా చీరను ఒకపక్కవిశాలమైనచెట్టు కాండానికున్న మేకుకు కట్టాడు. రెండవపక్క భోలా చేతికిచ్చాడు. భోలా వూతకర్రను ఒక చంకకింద మోపుకుని రెండుచేతులు బారజాచి చీరను వెడల్పుగా పట్టుకున్నాడు. సజ్జా చెట్టుకొమ్మలగూడు మధ్యకెక్కి కూర్చుని కాయలు విదల్చడం మొదలు పెట్టాడు.

చినుకులు జల్లయి జల్లు కడవపోతగా మారింది. రాణికి వర్షంఅంటే భయం. ఇంటి వాకిట్లోంచి వర్షంవేపు చూసి అరుస్తోంది. వడిగా వీస్తున్నగాలి తాకిడికి భోలాకు కింద పట్టు నిలవడంలేదు. పైనుంచి కాయలు చీరలో పడుతున్నాయి. గాలికి కొన్ని రాలి చీరకు దూరంగా పడిపోతున్నాయి.

చిక్కటివానతెరలు చుట్టుకుని కొండలు తమ నగ్నత్వాన్ని కప్పిపుచ్చుకుంటున్నాయి. భోలా బట్టలు తడిసి వంటి కంటుకుపోయాయి.

సజ్జా చెట్టుదిగాడు—చీరలో కాయలు ఇంట్లో పోశాడు...తర్వాత యింకొక చెట్టు...మరొక చెట్టు... యిలా మొత్తంమీద అన్నిచెట్ల కాయలు చేతనైనంత వరకూ రాల్చాడు. అవన్నీ యింట్లో ఒకమూల పెద్దకుప్పగా పోగుపడ్డాయి.

బట్టపిండుకుని తల తుడుచుకున్నాడు సజ్జా. భోలాకుకూడా తడిబట్టలు విప్పి పొడితుండుగుడ్డ చుట్టబెట్టాడు.

మునురుకున్న మబ్బులకి తోడు చీకట్లు కమ్ముకువచ్చాయి. దీపం వెలిగిద్దా మనుకున్నాడు సజ్జా. తీరాచూస్తే దీపంబుడ్డిలో కిరసనాయిలు అడుక్కి చేరుకుంటున్నది. గూట్లో అగ్గిపెట్టెకూడా నెమ్మకుని నిప్పు రాజుకోలేదు.

* * *

వాన నిమ్మదించేసరికి పూనమ్ వచ్చింది. వస్తూనే మరొకవాన వచ్చినట్లయింది.

'ఛీ...ఛీ...పాడుకొంప...పాడువూరు. ఎండలు తగులెట్టుతుంటాయి. వానలు ముంచెత్తుతుంటాయి. ఇక్కడంతా సిరి ఒలికి బోతున్నట్టు ... మా అయ్య వూరికెల్దాం రమ్మంటే ... ఎక్కడలేని రోషం. ఈ కుంటివాడొక గుదిబండ నా మెడకు. ఎందుకూ పనికి రాడు ... ఇంతకీ నేరేడుపళ్ళు నీళ్లపాలు చేశావా ... ఏదన్నా జాగ్రత్తపడ్డావా' అని అడిగింది—ఒకమూల చింకి చాపమీద భోలాను పడుకోబెట్టి పక్కన కూర్చున్న సజ్జాను. జవాబు చెప్పలేదు సజ్జా.

'ఇంతసేపూ యెక్కడ తగులడ్డావే నువ్వు' లేచి నుంచున్నాడు. మామూలుగా అయితే మాట్లాడే వాడు కాదు. కాని యీ రోజు ఎందుకో అలా లేదు. బతుకంతా తన చేతుల్లోంచి జారిపోయి పగ్గాల్లేని బండిలా పడిపోతున్నట్టున్నది దాని కిష్టంవచ్చి దోవలో. ఏదో రెండురొట్టెలుకాల్చి తన మొహాన పడేస్తుం దన్న వుద్దేశ్యంతో మూడేళ్లక్రితం పూనమ్‌ని పెళ్లా డాడు. వయస్సులో కొంత తేడావున్నమాట వాస్తవమే కానీ అది అంతబాధాకరమైన విషయంకాదు. ఎటొచ్చీ దానికి మనసులేదు...

సజ్జా ప్రశ్న విని పూనమ్ నిర్ఘాంతపోయింది. ఏదో కొత్తగా అగుపిస్తున్నాడు.

'ఆం...ఆం...మహారాజలా నిన్ను కూచుండ బెట్టి సేవ చేయడానికేగా నేను...యెక్కడికి వెళ్ల డానికి వీల్లేదాయె.'

మాట పూర్తికాకుండనే చెంప చెళ్లుమన్నది. కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆశ్చర్యంతో, దుఃఖంతో నోట మాట రాలేదు.

'ఛీ...నిన్నుచేసుకున్న పాపం నాది...'అంటూ సజ్జా చూరులో పాతగోతాం దులిపి తలమీద వేసు కుని ఆ వానలో బయటకు వెళ్లిపోయాడు.

'ఇదంతా నీమూలానే ముదరష్టుడా...'

ఎవరిని గురించి అన్నదో భోలాకు తెలుసు. వాడి దురదృష్టం ఏమంటే వాడు వినగలడు. అర్థం చేసుకోగలడు. బాధ పడగలడు. ఆనందించగలడు... అవసరమైతే...;

పడుకున్నవాడు లేచి గుడ్డతో నేరేడుకాయలు తుడువడం మొదలుపెట్టాడు.

రాత్రి ఎప్పుడొచ్చాడో యేమో తెల్లారేసరికి నేరేడుపళ్లు బుట్టలో నింపుకుని స్టేషనుకి ప్రయాణ మవుతున్నాడు సజ్జా. పూనమ్ మాట్లాడలేదు. ఏతెల్లవారుజామునో కునుకుపట్టిన భోలా యింకా లేవలేదు. సజ్జా బయలుదేరాడు. పదడుగులు వెళ్లాక లోపలినుంచీ అరుస్తున్నది పూనమ్.

'అన్నీ అమ్ముకురా.. ...ఇంకా యింటినిండా పడున్నాయి.'

మాట్లాడకుండా నడిచాడు సజ్జా.

వర్షంవల్ల సజ్జా దొడ్లో చెట్లేకాదు. ఊళ్లో వాళ్లందరూ కాయలు రాల్చారు. కొన్ని పండినవి... కొన్ని పచ్చిని...స్టేషనులో ఎక్కడచూసినా నేరేడు కాయలమ్మే పిల్లలే. మధ్యాహ్నమైనా యింకా సూర్యుణ్ణి కట్టిపడేసే వుంచాయి మబ్బులు. సన్నగా తుపర పడుతూనే వున్నది.

రాత్రి నిద్రలేక తిండిలేక తలదిమ్ముగా ఒళ్లంతా నీరసంగావున్నది సజ్జాకి. అట్లాగే సాయం కాలందాకా నిలబడ్డాడు. పాసింజర్లు వచ్చాయి... పోయాయి. బుట్టలో సగంకూడా తరగలేదు. ధర కూడా మామూలుకంటె సగమే కిట్టుబాటయింది.

నీరసంగా కొంపకి చేరాడు. మాట్లాడకుండా

డబ్బులుతీసి పూనమ్ చేతికిచ్చాడు. ఏకళ నుందో పూనమ్ వెంటనే రెండు రొట్టెలు కాల్చియిచ్చింది.

రాత్రి మళ్లా జోరున వాన మొదలయింది. వానలో తడిసిపోతున్న చెట్లఆకులు రొద పెడు తున్నాయి.

భోలా కుక్కని నిమురుతూ ఒకమూల పడు కున్నాడు. కుక్కి మంచంలో నడుం వాలుస్తూ సజ్జా అనుకున్నాడు...'రేపైనా ఒక ఎక్స్‌ప్రెస్‌బండి ఆగితే బాగుణ్ణు'. అనుకోవడంకాదు. పైకే అన్నాడు.

'రేపో ఎల్లుండో యీ కాయ అమ్ముడుకాక పోతే పాడైపోతాయి. ఎలాగోలా ఎక్స్‌ప్రెస్ ఆగేట్లు చూడకూడదూ'అంది పూనమ్.

'అది మన చేతుల్లోవుందా యేమిటి...'

'స్టేషన్‌మాష్టరుబాబుని బతిమాలకూడదూ కొంచెంసేపు ఆపించమని...పెద్దవాడుగదా!...'

ఒక్కక్షణం సజ్జాకి ఆ సలహా నచ్చింది. కాని వెంటనే తెలిసివచ్చింది స్టేషన్‌మాష్టరేమీ చేయలేడని. ఒకసారి ఎక్స్‌ప్రెస్‌బండి గార్డు ఎడాపెడా దబా యిస్తుంటే మాటాడకుండా తల దించుకున్నాడు. ఈ వూళ్లో వున్నవాడేగదా స్టేషన్‌మాష్టరు. ఆయన్ని వూళ్లోవాళ్ల తప్ప బయటివాళ్లెందుకు గౌర విస్తారు...అది జరిగే పనికాదు. ఏదన్నా క్రాసింగు లాంటిది వుంటే తప్ప ఎక్స్‌ప్రెస్ ఆగదు...'

తన ఆలోచనఅంతా నోటితోకూడా చేశాడు సజ్జా. పూనమ్ యింకేం మాట్లాడలేదు. నెమ్మ దిగా పడుకున్నది.

రాణి నిద్రపోయినా యింకా నిమురుతూనే వున్నాడు భోలా.

మర్నాడు నేరేడుకాయలు గోతంనిండా పోసి మూతిబిగించి తలమీద కెత్తుకుని ఖాళీబుట్ట చేత్తో పట్టుకుని బయలుదేరాడు సజ్జా. ఏదో యింత కడు పులో పడేశాడు. కాస్త సత్తువగానే వున్నది.

బయట యింకా వాన కురుస్తూనే వున్నది. స్టేషనులో ప్రయాణీకు లాట్టేమంది లేరు— ఉన్న నలుగు రయిదుగురూ రేకులకింద కూచున్నారు. సజ్జాకూడా గోతం ఒకమూలపెట్టి బుట్టనిండా పళ్లు తీసుకుని గోతం మళ్లీ కట్టేశాడు. కూలీకి దానిమీద ఒకకన్నేసి వుంచమని చెప్పాడు.

అక్కడక్కడ మబ్బు పలచబడ్డా సూర్యుడు కనిపించడం లేదు. పొద్దున రావాల్సిన పాసింజరు ఆ రోజు నాలుగుగంటలు లేటు. అంటే ఎక్స్‌ప్రెస్ పోయేదాకా రాదు. అటూ యిటూ కొంచెంసేపు తారట్లాడాడు సజ్జా.

ఎక్స్‌ప్రెస్ వచ్చే వేళయింది. సిగ్నలు పైకి లేచింది. స్టేషనుమాష్టరు ఆకుపచ్చజండా పట్టు కుని ప్లాటుఫారంమీదకు వచ్చాడు.

'ఏం...సజ్జా బేరంవున్నట్టు లేదే...'

సజ్జా పైకి చూచాడు 'వాడిదయ...' అన్నట్టు. ఎక్స్‌ప్రెస్ గుండె అదిరేట్టు చప్పుడు చేసుకుంటూ వస్తున్నది. నిర్లిప్తంగా దానివంక చూస్తూ నిల బడ్డాడు సజ్జా. స్టేషనుమాష్టరు ఆకుపచ్చజండా ముందుకు చాచి పట్టుకున్నాడు.

రైలు సిగ్నలుస్తంభందాటింది. ప్లాటు ఫారంమీదకు వచ్చింది. ఇంజను దూకుడికి ప్లాటు ఫారం వణుకుతున్నది. ఇంజన్లో డ్రైవరు ఠీవిగా స్టేషనుమాష్టరు వంక ఒక చిరునవ్వు విసిరాడు. ఇంజను ప్లాటుఫారం రెండోచివర దాటిపోయింది సిగ్నలు స్తంభం సమీపిస్తున్నది.

సజ్జా దానివంకే కళ్లప్పగించి చూస్తూ నిల బడ్డాడు, తనమీద దాని ఆధిక్యాన్ని మెచ్చుకుంటూ.

అలాగే చూస్తున్న సజ్జా ఒక్కసారి చకితు డైనాడు. కళ్లు నులుముకు చూశాడు ...సందేహం లేదు. ఎక్స్‌ప్రెస్ సిగ్నలు స్తంభందగ్గర ఆగిపోయింది.

సిగ్నలుమాత్రం 'నీయిష్టం నీకు దోవ యిచ్చాను నాదేం తప్పులేదు...' అన్నట్టు పైకిలేచి నిలబడింది.

సజ్జాకి ఎక్కడలేని బలంవచ్చింది. బుట్టలో తరిగిన భాగం నింపుకుని బండివేపు దౌడుతీశాడు. బండి చివరిపెట్టెలో ఎవరో కేకేశారు. అక్కడ దాదాపు సగంబుట్ట అయిపోయింది. ఇంకా ముందుకు పోయాడు. కాయలమ్ముడు పోతున్నాయి. జేబు చిల్లరతో బరు వెక్కుతున్నది. రెండు మూడు నోట్లు కూడా చేరాయి. ఇంజను వెనకాలపెట్టిదాకా వెళ్లేసరికి బుట్టలో కొద్దిగా మిగిలివున్నాయి.

ఇంజనుముందు పెద్దగుంపు పోగయింది. జేబు బరువెక్కిన సంతృప్తితో అదేమిటో చూద్దామని ముందుకు వెళ్లాడు సజ్జా. జనం గుంపుగా వుండటం వలన ఏంజరిగిందోతెలీడంలేదు...ఏమయితేనేం...దేవుడు చల్లగా చూశాడు. లేకపోతే క్రాసింగు లేకుండా ఎక్స్‌ప్రెస్ ఆగిపోవడమేమిటి...

నెమ్మదిగా అక్కడ తన ముందున్న ఎవరినో అడిగాడు, ఏంజరిగిందని.

'ఎవరో కుంటికుర్రాడు, కుక్క రైలుకింద పడ్డారుట......పాపం' ఆ పైమాట వినిపించలేదు సజ్జాకి.

రైలుపట్టాలమీది నెత్తురు స్టేషనుమాష్టరు చేతుల్లో ఎర్రజండాలాగా మెరిసింది.



వెలుతురు మొక్క

శ్రీ కె. శివారెడ్డి

ఇంకా
హోటళ్ళు కన్ను మూయలేదు–
కప్పుల ఆరాటాలు
ఆర్భాటాలౌతూ
చిక్కని పొగల్తో ఊహల్ని గుచ్చుకుంటూ
నిద్రించని గుండెల మెళ్లో హారాలేస్తున్నాయి–
కిటికీపక్క పలచబడుతున్న చీకటి
దూరంగా చెట్లగర్భంలో సాంద్రమౌతున్నప్పుడు
నరాల్లో సముద్రాలు ఇంకనప్పుడు
ప్రాణాల్ని వెతుక్కుంటూ
చెట్టుని పుట్టనీ గాలిస్తూ
వేదనని వారబోస్తూ
కిళ్లీ కొట్టుముందో, పుస్తకాలషాపుముందో
ఎక్కడో ఒకచోట
ఇంత వెలుగును చూడాలనే తహతహలో
సర్వాన్ని సమీక్షిస్తూ, సర్వస్వాన్ని పణంగాపెట్టి
ఎంత వెర్రిగా–సాహసంగా–
కాళ్లకి కళ్లుంటయ్‌అంటే నమ్మరు
కళ్లల్లో నాగజెముడు పొదలుంటాయంటే నమ్మరు
కావాలంటే
ఆత్మని మండించి
అక్షరాలకు ప్రాణాలుపోసే
నా దేహంలో కళ్లులేని చోటెక్కడో చూపండి;
అలికినట్టున్న

లోకం చీకటి వాకిటిముందు
ఎవరో పుణ్యాత్ముగాలు
ఇంత వెలుగు ముగ్గేసినట్లు
ఇక్కడే
ఈ గుండెపక్కే
ఈ గుడిసెపక్కే
ఉదయం పసికందు కేకేసినట్లు
అనుభవంలా—ఆత్మగతానుభూతిలా
కాలచక్రం సందుల్లోగుండా
రెప్పల తలుపుల్ని వత్తిగించి
నా పాదాల్ని పరామర్శించే వెలుగును
మీా గుండె కళ్లల్లో పెట్టడానికి
రైలుపట్టాల సునిశిత దృక్పథంలా
ఒక ధ్యేయానికి బలిఅవుతున్న మా ప్రాణాలః
దుమ్మునీ—ధూళినీ—రాళ్లనీ—రప్పల్నీ
వంతెనకింద డేబుర్నీ -ఎన్నో—మరెన్నో
నికృష్టజీవితాల నిస్తేజచిత్రాల్ని!
నిరాడంబరంగా చిత్రీకరిస్తూ—
అవును కాంతికోసమే
ప్రాణంకోసమే -
ప్రయాణంలో సర్వస్వాన్ని
పోగొట్టుకున్న మేం
కన్నీటిని అడుక్కోం
కాంతి అణువును బద్దలుచేసేందుకు సిద్ధమే
వ్యక్తిగతసౌఖ్యం సర్వాధిగూటల్లో
చూడు !
సదయ సహృదయుని నేత్రంలా
ధర్మాగ్రహంలా—త్యాగం నెత్తురులా
పెరిగే కాంతిమొక్క
మా సంతానం.

———

"యయాతి చరిత్రము" మొట్టమొదటి అచ్చతెనుగు కావ్యమా?

శ్రీ శ్రీరంగాచార్య

'అచ్చతెనుంగు కబ్బమున కాదిపదంబయి పొల్చు భాగ్యమును హెచ్చుగా కన్నదేశము' తెలంగాణ భూభాగము.

గోలకొండ సామ్రాజ్యమును పాలించిన తురుష్క ప్రభువులలో మల్కిభరాముడుగా పేరుగాంచిన ఇబ్రహీము ఖులీ కుతుబ్షా సుప్రసిద్ధుడు. ఇతని కాలములో తెనుగు సారస్వతము పలువిధములుగా విస్తరిల్లినది. గోలకొండ ప్రభువులు ఉర్దూ, ఫారసీభాషలతోపాటు తెనుగు సారస్వత నందనోద్యాన వనమును సైతము దివ్యకావ్యకుసుమములచే గుబాళింపజేసి కుతుబ్షాహీ సుల్తానులు తెనుగుసుల్తానులు అని కీర్తి గాంచిరి.

ఈ యుగములోనే 'తపతీసంవరణోపాఖ్యానము', 'యయాతి చరిత్ర', 'వైజయంతీ విలాసము', 'రాజనీతి రత్నాకరము', (నేబతి కృష్ణయామాత్యుని రచన) 'సుగ్రీవ విజయ'మను యక్షగానము ఇత్యాది రచనలు బయలుదేరినవి.[1]

ఇంకొక విశేషమేమనగా ఈ యుగములోనే మన సాహిత్యమునందు సరిక్రొత్తమార్గములు బయలుదేరినవి. వానిలో ముఖ్యమైనవి రెండు. (1) తపతీ సంవరణోపాఖ్యానమును అద్దంకి గంగాధరకవి మల్కిభరామున కంకిత మిచ్చెను. దీనితో తెనుగు కావ్య కన్యకకు మహమ్మదీయుడు కృతి 'భర్త' యగుట ఆరంభమైనది. (2) మచ్చున కెచ్చటనోయున్న అచ్చతెనుగు పద్యమును చూచి అచ్చతెనుగులోనే కావ్యరచన చేయుట— ఇవి పద్ధతులు. మన సాహితీ సంప్రదాయములకు ఇవి వినూత్నములు. ఇందులో రెండవ పద్ధతియైన అచ్చతెనుగులో కావ్యరచన అనుదానికి ఆద్యులెవరు? ఈ విషయము ముఖ్యము.

మన సాహిత్యములో పూర్వుడైన యొక కవి మచ్చున కొక పద్యమును కొత్తపద్ధతిలో రచింపగా తరువాతి కవులు దానినిచూచి అదేపద్ధతిలో ఒక కావ్యమును వ్రాయుట యనునది పరిపాటి. అట్లే నిరోష్ఠ్య రచన[2], అచ్చతెనుగు రచన మొదలైనవి. ఈ ప్రక్రియలు ఒక సాహిత్యముగా పరిణమించినవి.

ఉత్తరహరివంశమునందు నాచన సోముడు (2—171, 172) అచ్చతెనుగు పద్యములు వ్రాసెను. వానిని చూచి తర్వాతి కవులు ప్రత్యేకముగా గ్రంథములనే వ్రాసినారు. (నిరోష్ఠ్యపద్యరచనగూడా సోమునితోనే ఆరంభము కావచ్చును. (1—106.) అంతటితో ఆగక అచ్చతెనుగులో కొన్ని నియమములతో అనగా నిరోష్ఠ్య, నిర్గద్య, నిర్వచనము మొదలైన నియమములతో రచనలు చేసిరి.

ఈ విధమైన అచ్చతెనుగు ప్రభావము మొట్టమొదటిమారుగా కుతుబ్షాహీ సుల్తానుల కాలములోని కవులైన మరింగంటి సింగరాచార్యులు, పొన్నికంటి

---

1. విశేషములకు, చూ:—'కుతుబ్షాహీ సుల్తానులు—ఆంధ్ర సంస్కృతి'అను గ్రంథము. సంపాదకులు — బి. రామరాజుగారు. (1962 ప్రచురణ—ఇదారఅద్బియాతె — ఉర్దు; పంజగుట్టరోడ్, హైదరాబాదు.)

2. చూ:—'దశరథరాజనందన చరిత్ర' — మరింగంటి సింగరాచార్యులు—పీఠికయందు ఆంధ్ర సాహిత్యములో నిరోష్ఠ్యరచన అను భాగము. (నా పరిష్కరణతో ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడెమీవారు 1970 లో ప్రచురించిన గ్రంథము.)

తెలగన్న అను వారలపై బడినది. వీరిలో సింగరాచార్యులు శతఘంటావధానుడు, వింశతి నిరోష్ఠ్య, ఓష్ఠ్య ప్రబంధ నిర్మాత. అంతేగాక శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకళ్యాణమును గూడా వ్రాసినాడు[3]. పొన్నిగంటి తెలగన్న యయాతిచరిత్రమును[4] అచ్చతెనుగు కావ్యముగా వ్రాసి మల్కిభరాము వద్ద మీర్ జుమా (ఆర్థికశాఖామంత్రి) పదవిలోనున్న అమీనుఖానునకు అంకిత మొసంగిన విషయము సాహితీ లోకమునకు పరిచిత పూర్వము. వీ రుభయులు అనగా సింగరాచార్యుడు, తెలగన్న ప్రప్రథమముగా అచ్చతెనుగులో కావ్యరచన చేసినవారు. కాని—ఈ ఉభయులలో ఎవరి కృతి ముందు? అనునది విచారణీయము.

నేటివరకు మన సాహితీప్రపంచము నందు అందరును తెలగన్న యయాతిచరిత్రయే మొట్టమొదటి అచ్చతెనుగు కావ్యమని భావించుచున్నారు. నా యభిప్రాయము ప్రకారముగా లభించిన ఆధారముల ననుసరించి (ఉభయుల కృతుల నాధారముగా) మొట్టమొదటి అచ్చతెనుగుకావ్యము 'యయాతి చరిత్ర' కాదనియు, ఈ ప్రక్రియకుకూడా నిరోష్ఠ్య ప్రక్రియవలెనే మరింగంటి సింగరాచార్యులే శ్రీకారము చుట్టినాడనియును.

తెలగన్నకుముందు సింగరాచార్యుడు శుద్ధాంధ్రములో నిరోష్ఠ్యముగా సీతాకల్యాణమును వ్రాసినాడు. తెలగన్న కృతికన్న ఇదియే మొదటిది. ఈ విషయమును నిరూపించుటకు ముందు యయాతి చరిత్ర, శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకల్యాణము—వీని కృత్యాదులలోగల పద్యములను పరిశీలింపవలయును. తెలగన్న తన రచనయే అచ్చతెనుగునకు మొదటి రచనయని ఇట్లు తెల్పినాడు—

క. 'మున్నెవరు నొడువని యీ
తెన్నిడి కడుమీఱి యచ్చతెనుగుం గబ్బం
బెన్నిక మీఱగ జెప్పిన
నిన్నుం బొగడంగఁ గలఁడె నెలతాల్పయినన్.
(1—11)'

ఉ. అచ్చ తెనుంగుఁ బద్దె మొకట్టైనను
గబ్బములోన నుండినన్
హెచ్చని యాడుచుందు రది యెన్నుచు
నేర్పునఁ బొత్త మెల్ల ని
ట్లచ్చతెనుంగున న్నొడువ
నందుల చందమెఱుంగు వా రెదన్
మెచ్చరొ, యుబ్బురంబనరొ,
మేలనరో, కొనియాడరో నినున్—(1. 12.)

ఈ రెండు పద్యాలు తెలగన్నయే అచ్చతెనుగు కావ్యరచన కాద్యుడని నిరూపించుట కాధారములు.

శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకల్యాణములోగల పద్యములును ఇట్లే గలవు. ఆ పద్యము లివి.

క. మున్నెవ్వడు నుడువని యీ
తెన్నెడయెడ మీరి యచ్చ తెనుఁగు నిరోష్ఠ్యం
బెన్నికఁ జెప్పిన ప్రోడన్,
నిన్నుం బొగడంగ గలడె నెలతాల్పయినన్—
(1—21.)

ఉ॥ అచ్చతెనుంగు బద్దె మొకట్టైనను
గబ్బములోన నుండినన్
హెచ్చని యాడుకొందు రొగి
నెన్నుచు (నేర్పున) గ్రంథమెల్ల ని
ట్లచ్చతెనుంగునన్ నుడువ నందలి
చంద మెఱుంగువారు ని

---

3. ఈ గ్రంథము ప్రప్రథమముగా 'ప్రబంధ కల్పవల్లి' అను పత్రికలో ప్రచురింపబడి—అనంతరము అనగా 1910 లో గుంటుపల్లి సోమయ్యగారిచే గుంటూరులో గ్రంథముగా ముద్రింపబడినది. ప్రస్తుత మీ గ్రంథ మలభ్యము. మా వద్ద ఒక వ్రాత ప్రతి గలదు. (దశరథ రాజనందన చరిత్ర అనుబంధములో ఇందలి కృత్యాది పద్యము లొసంగినాను.)

4. ఈ గ్రంథమును 1930 లో వావిళ్ల వారును, 1967 లో నోరి నరసింహశాస్త్రిగారి పరిష్కరణతో ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడెమీవారును ప్రచురించిరి. లోగా రాజమహేంద్రవరములో ముద్రింపబడినట్లు వావిళ్లవారి గ్రంథపీఠిక (పుట 8) తెల్పుచున్నది

నెమ్మెచ్చరో! యబ్బురంబనరో!
మేలనరో! కొనియాడరో! కదున్—
(1—22)

ఇరువురి పద్యములకును భేదములేదు. కాని సింగరాచార్యుల పద్యములందు కందములో క్రీగీత గీసిన భాగములో మాత్రము భేదమున్నది.

ఉభయుల కృతలయందు ఈ పద్యములు సమానముగా గలవుగదా? అయినచో ఎవరి పద్యములను జూచి యెవరు వ్రాసి రనునది యనుమానము — ఇది నిర్ధారణమైనచో మిగతా విషయము సుగమము. కావున మొదలు యయాతి చరిత్రలోని పద్యములను గూర్చి పరిశీలింతము. పై నుదాహరించిన 11, 12 సంఖ్యగల పద్యములు, ముఖ్యములైనవి — వీనికి ముందు రెండు పద్యములు గలవు. మరింగంటి అప్పలాచార్యులవారు తెలగన్ననుపిలిచి అమీనుఖానునకు యయాతిచరిత్రము నంకిత మీయవలసినదిగా కోరుచూ అనిన పద్యములు—

మ॥ తనకు న్నిచ్చలు మ్రొక్కువారిని
సిరుల్ దైవారగాఁ జల్లచూ
పున నెల్లప్పుడు చూచి మన్పగల
పెంపొప్పెడన్ మఱింగంటి య
ప్పనగారిన్ మదిలోనిమాటదెలియం
బాటించుచుం గాంచినన్
గని యామేటి తలంపెఱింగి పొసగంగా
నన్ను మన్నించుచున్— (1—9)

ఆ॥ పిలిచి పొన్నికంటి తెలగన్న, నీ చేయు
నచ్చతెనుఁగుఁ గబ్బ మన్నియెడల
మించి వెలయఁగా నమీనుఖానున కిచ్చి
పుడమిలోన సిరులుఁ బొగడ గనుము!—
(1—10)

ఇందు పేర్కొనబడిన మఱింగంటి యప్పనగారు సింగరాచార్యుల కగ్రజుడైన అప్పలాచార్యులు. ఈయన ముగురురాజులచేత మొక్కులు గొన్నట్టి భగవత్సమానుడని దశరథరాజనందనచరిత్రలోనేగాక, సీతాకల్యాణములోనూ, 1770 ప్రాంతమువాడైన మరింగంటి వెంకట నరసింహాచార్యుల 'చిలువ పడిగరేని పేరణము'[5] నందును 'గోదావధూటీ పరిణయము'[6] నందును, వారణాసి అచ్యుతరామకవి 'సురతాణీ పరిణయము' నందును పేర్కొనఁ బడినాడు. మల్కిభరాం ఆస్థానములో ఉన్న కవులయందు అప్పలాచార్యు లొకడు. ఈయన రాజపూజితుడు, వేద శాస్త్ర ప్రవీణుడు, సరస సాహిత్య లక్షణ చక్రవర్తి, ఉభయభాషా కవిత్వధుర్యుడు. (దశరథ .. 1—8)

ఈయన సింగరాచార్యుల కృతిని చూచి దానిలోని పద్యములను గమనించినవాడు. అయినను రాజాశ్రయములేక ఏదో మారుమూలగ్రామములో ఉన్న సింగరాచార్యులు తన కృతిని నరాంకిత మొనర్చుటకు విముఖుడైనాడు. (ఈయన కృతులన్నియు దైవాంకితములే.) అప్పలాచార్యులు, తెలగన్నయు మిత్రులు. నరాంకిత విముఖుడైన తన తమ్ముని రచనను మహమ్మదీయ అధికారికి అంకిత మిప్పించుటలో కృతకృత్యుడు కాజాలని అప్పలాచార్యులవారు భాషాభిమానముతో తెలగన్న కృతిని అమీనుఖానునకు అంకిత మిప్పించి కృతకృత్యుడైనాడు. ఆ సందర్భములోనే తెలగన్నతో అప్పలాచార్యు లిట్లనెను.

'మున్నెవ్వరు నొడువని.........' అచ్చతెనుంగు బద్దె మొకటైనను.........' (1—11, 12.) ఈ పద్యములు అప్పలాచార్యులవారు స్వంతముగా చెప్పినవే. కాని తెలగన్న పద్యములు మాత్రముగావు. వీనిని తన వానివలెనే తెలగన్న తెల్పినాడు. తెలగన్న తెల్పినాడనుట కన్న ప్రప్రథమముగా ముద్రించినవారు ఈ రెండు పద్యములకు ఆద్యంతములలో అనువాదచిహ్నము (INVER-

5. 'యయాతి చరిత్ర' పీఠికలో శ్రీ నోరి నరసింహశాస్త్రిగారు 'చిలువపడిగరేని పేరణము'ను సింగరాచార్యుల కృతిగా తెల్పిరి. అది పొరపాటు. ఆ గ్రంథమునుగూర్చి శ్రీ ఆదిరాజు వీరభద్రరావుగారు 'మన తెలంగాణము' అను గ్రంథములో (1963 ము.) సంక్షిప్త పరిచయ మొనర్చిరి. (పుటలు—24—25).

6. ఈ గ్రంథము 1956 లో నల్లగొండ (రామగిరి) మహిళాసమాజమువారు ఆసూరి మరింగంటి శ్రీ రంగాచార్యులవారి సంపాదకత్వమున ప్రచురించిరి.

TED COMMA) '——' ఉంచకపోవుటతో ఏర్పడిన చిక్కు యిది. (ప్రప్రథమముగా రాజమహేంద్రవరములో ప్రచురింపబడిన ప్రతిని, సాహిత్యపరిషత్తు వారి వ్రాతప్రతిని పరిశీలించినచో ఈ పద్యముల స్థితి తెలియునేమో !) కొందరు కవులవలె కృతిభర్తయో మరెవ్వరో 'ఇట్లనిరి'—అని కవి వ్రాసిన పద్యములుగా వీనిని భావింపవీలులేదు. సరససాహిత్యలక్షణచక్రవర్తియైన అప్పలాచార్యులవారు సీతాకల్యాణములోని పద్యములను చూచినవారు కావున వానినే ఈ సందర్భమున ఉపయోగించిరని భావింపవలయును. ఇది తెలగన్న పద్యముల తీరు.

ఇక సింగరాచార్యుల శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకల్యాణ పద్యముల బరికింతము. 14 నుండి 18 నెంబర్లుగల పద్యములలో సింగరాచార్యులు తానే యే వయస్సునందు యేగ్రంథమును రచించినది తెల్పినాడు. వాని ప్రకారముగా 19 వ యేట దశరథరాజనందన చరిత్రయు, 20 వ ఏట శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకల్యాణమును వ్రాసెను. ఈ రెండు పుస్తకములపేర్లను కవి ప్రత్యేకముగా తెల్పక 18 వ పద్యములో 'ఎలమిగావించి తిరువదియేండ్లనాడు ఘన నిరోష్ఠ్యాది వింశతి కావ్యములను'—అని తెల్పెను. సీతాకల్యాణగద్యలో దశరథరాజనందన చరిత్ర పేర్కొనబడినది. అనఁగా సీతాకల్యాణ రచనవరకే దశరథరాజనందనచరిత్రను చేసెను. వీనివలన సింగరాచార్యులు 20—25 ఏండ్ల మధ్యవయస్సులోనే నిరోష్ఠ్య సీతాకల్యాణమును వ్రాసినట్లు నిశ్చయము. ఇదియేగాక నేబతి కృష్ణయామాత్యుఁడు తన రాజనీతి రత్నాకరములో—

'ఆంధ్రభాషా నిరోష్ఠ్య మహాప్రబంధ
రాజి రచనా ధురీణు— కర్ణాటరాయ
లబ్ధ కవిసార్వభౌమ కల్యాణ బిరుద
శాలి మరుకంటి శింగరాచార్యుఁ దలతు[7].

(9) ననినాడు. దీనివలన ఆంధ్రభాషయందు నిరోష్ఠ్య ప్రబంధమును సింగరాచార్యులు వ్రాసినట్లేగాక ఆయనకు 'కవిసార్వభౌమ' బిరుదము కలదనిగూడా తెల్పినాడు.

ఈ ఆధారములేగాక తనదే మొదటి అచ్చ తెనుగు కావ్యమని సింగరాచార్యులు ఇట్లు తెల్పుచున్నాడు—కర్పూరాద్రి నరసింహస్వామి ఈయనకు స్వప్నములో కనబడి—

'వత్స! నీ యెడ మత్కృప దనరు కతన
హెచ్చి భువిలోన నేరికి నెన్నరాని—
యచ్చతెనుఁగైన పదముల నమితకృతుల
నిచ్చ రచియించి యొసఁగితే యెలమివూకు—

(1—12)'—ననియును

'రాఘవ పాండవీయ కృతిరత్నము
పింగళి సూరనార్యుఁడే
శ్లాఘ సముద్ధరించె నది
సర్వబుధ ప్రతతుల్ గణింప నా
హా! ఘనమయ్యె దాని కెన
యంధ్ర నిరోష్ఠ్య మహాప్రబంధ మెం
తే ఘటియింపఁజేయ నలు
దిక్కులయందుఁ బ్రసిద్ధమయ్యెడున్'—

(1—20)

దీని తర్వాతగల 21, 22 నెంబరు పద్యములు లోగా నుదాహరింపబడినవి. 27 నుండి 34 వరకు గల పద్యములలో అచ్చతెనుగు అందులో నిరోష్ఠ్యము వీనితో రచన చేయుట యెంత శ్రమయో వ్యక్తపరచి— తన అచ్చతెనుగు కృతియయిన సీతాకల్యాణము నందలి నియమముల నిట్లు తెల్పెను—

క. 'తరమక ప్రతిపదములు ప
ల్మరు నరయుచు సముచితోక్తమార్గంబులనున్
దెఱగులఁ దెలియుచు నర్థం
బెఱుఁగగ దగునుభయ సంధు లెనయుట కతనన్'

(1—32)

గీ. అరయ కగవజటడతదనాయలసహ
రద్వయమెకాని యొండక్షరములుఁ జొరవు
మఱియు నొత్వోత్వములు కొమ్ము వూముడియును
వలవ దావీాద సురభాష నిలుపరాదు'

—(1—33)

---

7. కుతుబ్షాహీ సుల్తానులు — ఆంధ్ర సంస్కృతి—పుట—99.

క. 'ఇల సురభాషల కొన్నిటి
తిలకింపఁగ వికటమనుచు తిరమగు నామం
బులు కథలుఁ దెలియు కొఱకై
నిలిపితి కవిసమ్మతాన నిల్కడగాగన్'
—(1—34)

ఈ విధముగా సింగరాచార్యులు తెల్పుటను బట్టిచూడగా మొట్టమొదటి వారుగా అచ్చతెనుఁగులో రచన చేయుట ఇతనినుండియే ప్రారంభముకావున నీ పద్ధతు లన్నింటిని దెల్పెను.

ప్రపథమముగా ఒక వింతపద్ధతిలో అనగా చిత్రకవితాపథములో కావ్యరచనోద్యుక్తుడైన కవి తన రచనకు చేసికొనిన నియమములను తెల్పుకొనుట సామాన్యముగదా! కావున యయాతిచరిత్రమే మొదటి దైనచో రచనానియమములు ఏవియును లేకపోవుటకు కారణమేమి ?

'తెనుఁగునకు మాఱుపేర్లిడి
పెనచిన వినగూడదనుచు బిరుదులుఁ బేర్లున్
మునువేల్పుబాసవెంబడి
నునిచెద గాదనకుఁడయ్య యుల్లము లందున్'.
(1—14.)

ఈ ఒక్కపద్యమే తెలగన్న కృతి నియమము తెలిపెనని సమాధానించుకొన వలయునా ? లేక ఈ మధ్య కొన్ని పద్యములు నష్టము లైనవని భావింప వలయునా ? (తెలుగుకవుల గ్రంథములకు ఇదియొక సంప్రదాయము.) ఇదియును కుదురదు. మొట్ట మొదటి కృతియే తనదైనచో తెలగన్న మరికొన్ని విషయములు వ్రాసియుండెడివాడు. కావున సింగరాచార్యుల కృతియే మొదటిదనియు దానినిచూచి తెలగన్న యయాతిచరిత్రమును రసవంతముగా 5 ఆశ్వాసములలో వ్రాసినాడనియు గ్రహింపవలయును. తెనుగులో షష్ఠ్యంత సంప్రదాయము రానురాను ఎట్లు పరిణతిజెందెనో అట్లే యయాతిచరిత్రము గూడా.

తెలగన్న సింగరాచార్యుల కృతినిజూచి దానికన్న మెఱుగుగా నుండునట్లు యయాతి చరిత్రమును దిద్ది తీర్చినట్లు ఈ క్రింది యాధారములు గలవు. సింగరాచార్యులు కథాభాగమును మాత్రమే అచ్చతెనుగులో వ్రాయగా ఆ పద్ధతి తెలగన్నకు బాగనిపింపక కృత్యాద్యంతములు షష్ఠ్యంతములు మొదలైన వానినిగూడా అచ్చతెనుగులోనే వ్రాసెను. మఱియు సీతాకల్యాణము 300 పద్యములతో 3 ఆశ్వాసముల పరిమితితోనుండి రామకథను తెల్పుచుండగా యయాతిచరిత్ర పద్యసంఖ్యలోనే గాక ఆశ్వాససంఖ్యలోనూ, సీతాకల్యాణమును మించినది. యయాతిచరిత్రమను పేరున్నను రామకథాభాగమే హెచ్చుగాగలదు. ఈ భాగము కవితారీతిలో బాగున్నను అసందర్భముగా చేరిన దనవచ్చును. దీనికి కారణము తనకు పూర్వము అచ్చతెనుగులో రామకథాపరమైన కావ్యము వెలయుట కావచ్చును. ఈ సమకాలీన స్పర్థ ఎంతవరకు పోయినదనగా తనకృతిని రాజకీయోద్యోగికి అంకితమొనర్చి ప్రచార మొనరించుకొను నంతవరకు అవధి జూచినది. సింగరాచార్యుల రచన నరాంకితమైనచో వ్యాప్తిచెందెడి దేమో !

దశరథరాజనందన చరిత్రను వ్రాయుచు సింగరాచార్యులు తనకు పూర్వము సంస్కృతములో నిరోష్ఠ్య రామాయణమున్నట్లు ఈ పద్యములో తెల్పెను—

'మునురామాయణము న్నిరోష్ఠ్యముగ
నింపుల్మీర శాకల్లి మ
ల్లన, తా సంస్కృత భాషఁజేసెనన
నాలాగున్ జెవుల్ నిండఁగా
వినుటేగాని ధరిత్రిలో నిజముగా
వీక్షింప లేదట్టి దేఁ
దెనుఁగున్ జేసెద నెల్లడన్ గవులకున్
దృష్టాంతమై యేర్పడన్'— (1-32)

అని శాకల్యమల్లన నిరోష్ఠ్య రామాయణ మునుగూర్చి తెలిసినవాడు—తనకు ముందే యయాతి చరిత్ర ఉన్నచో తప్పక తెలిపియుండెడివాడు. దీనివలన గూడా సింగరాచార్యులదే మొదటి కృతియని యూహించుట కవకాశము ఉన్నది.

సింగరాచార్యులు తెలుగు సాహిత్యములో నిరోష్ఠ్యకావ్యరచనకేగాక అచ్చతెనుగు కావ్యరచనకును, త్ర్యర్థి, చతురర్థి కావ్యరచనలకుగూడా నితడే ఆద్యుడు.[8]

---

8. చూ : దశరథరాజనందన చరిత్ర—పీఠిక. సీతాకల్యాణము—కృత్యాది పద్యములు.

నేటివరకు అందరు భావించునట్లు అచ్చతెనుగు కృతికి ఆద్యుడు తెలగన్నకాక సింగరాచార్యులేయని నా యభిప్రాయము.

సింగరాచార్యులు ఏయేవయసులలో ఏయే గ్రంథములను వ్రాసినది సీతాకల్యాణ కృత్యాదిలో తెల్పెను. సుమారు ఇరువది పుస్తకముల పేర్లు తెలియుచున్నను వానిలో రెండుమాత్రమే ముద్రణమైనవి. మరింగంటి కవుల రచనలు ఎక్కువగా అముద్రితములు. అవియన్నియును సూర్యాలోకభాగ్యము నందిననాడు మరికొన్ని విశేషములు బయలుపడగలవు.

సంస్కృతాంధ్ర సారస్వతములలో నిరోష్ఠ్య రచనలో[9], అచ్చాంధ్ర సాహితీవికాసము మొదలైనవానిని గూర్చి సమగ్రమైన పరిశీలన మొనర్చుట ఆవశ్యకము. తెలుగులోని నిరోష్ఠ్య కృతులను—అచ్చతెనుగు కృతులను పఠించుచుండగా కలిగిన ఒక సంశయము ఈ వ్యాసరచనోద్దేశ్యము. యధార్థకథనము ఎందరకో బాధ కలిగించును. సాహిత్యములో పరిశోధనమునకు ఇట్టి సంశయములు తప్పనిసరి.

చ॥ 'తెనుఁగునఁ గొన్నికావ్యములు
దెల్లముగా రచియింపవచ్చుఁ బే
ర్కొనఁగ నిరోష్ఠ్యకావ్యములుఁ
గొన్ని యొనర్పఁగ వచ్చుఁగాక చ
క్కన నివి రెండు చందములు
గ్రచ్చుఱ గూఱిచి నేర్పుచేత నె
వ్వనికి రచింప శక్యమగు
వాంఛ యొనర్చితి దాని సేయఁగన్.'

[మరింగంటి సింగరాచార్యులు — శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకల్యాణం 1—27.]

9. చూ: 'చిత్రకవిత — నిరోష్ఠ్య సాహిత్యము'—అను నా వ్యాసము. 'పరీధావి' సంవత్సరాది సంచిక.



పండితరాయల ఖండన మండనలు

డా. మహీధర నళినీమోహన్

భర్తృహరి శృంగార వైరాగ్య శతకాలను పరిశీలిస్తే రెండూ ఒక్క కవి వ్రాసినవేనా అనిపిస్తుంది. శ్లేష యమక చక్రవర్తి అయిన వేంకటాధ్వరి వ్రాసిన విశ్వగుణాదర్శంలో ఒకే వస్తువును పొగడడమూ తెగడడమూ కూడా కనిపిస్తుంది. అందులో విశ్వావసువు, కృశానువు అనే ఇద్దరు గంధర్వులు ఆకాశయానం చేస్తూ తమకు కనిపించిన విశేషాల నన్నిటినీ చమత్కారంగా వర్ణిస్తూ పోతారు. విశ్వావసువుకి అంతటా మంచే కనిపిస్తుంది. కృశానువుకి అంతటా చెడుగే కనిపిస్తుంది. ఆ ఇద్దరి అభిభాషణలూ సయుక్తికమేని పఠితలకు తోపింప జేయడంలోనే ఉంది కవి యొక్క గొప్పతనం.

ఈ విధంగా పరస్పర వ్యతిరేక అభాసములైన వర్ణనలు సాహిత్యంలో అక్కడా అక్కడా కనిపిస్తూ ఉంటాయి. ఆలోచిస్తే వాటిని సమర్థించ గలగడం కవియొక్క బుద్ధి నైశిత్యానికి గీటురాయి అనిపిస్తుంది. వస్తువులలోని గుణదోషాలను వేరువేరుగా గ్రహించ గలగడానికి నిశితమైన పరిశీలన కావాలి. పరిశీలించిన దానిని తార్కికంగా విశ్లేషించగల నేర్పు కావాలి. ఆ తరవాత రసము, ధ్వని, చమత్కారము, ధార, శయ్యవంటి అంగోపాంగాలు కవిగారి సామర్థ్యాన్నిబట్టి తగిన పాళ్లల్లో ఉంటాయి. అప్పుడే కదా రసికజనశిరఃకంపం !

భాషమీదనే కాకుండా భావుకతమీదకూడా సార్వభౌమత్వం కవికి గలదని తోపింపజేసే ఇటువంటి స్వవచోవ్యాఘాతభ్రాంతిజనకములైన రసవత్తర ఘట్టాలు పండితరాయల భామినీవిలాసంలో అడుగడుగునా ఎదురు అవుతూఉంటాయి. అతగాడి కత్తికి రెండువైపులా పదును ఉన్నదనిపించే సన్నివేశాలు కొన్ని పరిశీలిద్దాం.

నెమలి

నెమలికి పాములను చంపగల శక్తి ఉంది. గరుత్మంతుని తరవాత ఇటువంటి శక్తిగల పక్షి ఇదే. పైగా గద్దకులేని అందచందాలు నెమలికి ఉన్నాయి. కనుక ఈ పక్షిని మెచ్చుకోవడంలో వింతఏమీ లేదు.

మలయపర్వతంమీద మంచిగంధపు చెట్లు ఉంటాయి. ఆ చెట్లని చుట్టబెట్టుకుని తాచు పాములు ఉంటాయిట. ఆ చెట్లని సేవిద్దామనివచ్చే జనం ఆ పాములకి భయపడి దూర దూరంగా పోతూ ఉంటారు. ఆ మలయపర్వతంమీద కాకులు, కపోతాలు, కోళ్లు, కొక్కిరాయిలువంటి చిల్లర మల్లర పక్షులు ఎన్నిలేవు ? వాటివల్ల ఆవగింజంత ఉపయోగం అయినా ఉందా ? అవి ఉన్నా ఒకటే, లేక పోయినా ఒకటే. మంచి గంధపుచెట్లని చుట్టబెట్టుకున్న తాచుపాములను తన కేకమాత్రంచేత హడలగొట్టి, తరిమివేసి, సర్వజనానందాన్ని కలిగించ గల నెమలి ఒక్కటంటేఒక్కటి ఉంటే చాలదూ ?

రాజాస్థానాల్లో మహావిద్వాంసుల్ని దగ్గరకు చేరనీయకుండా తిష్ఠవేసుకూర్చున్న దుర్మార్గులను తరిమివేయగల దక్షుడు ఒక్కడుఉన్నా చాలు గానీ, దోమల్లాంటి అల్పులు ఎంతమందిఉన్నా ఏం లాభం ? అని ధ్వని.

శార్దూల విక్రీడితం

ఏతస్మిన్ మలయాచలే బహువిధైః
కిం తైరకించిత్కరైః
కాకోలూకకపోతకుక్కుటగణై
రేకోపి పార్శ్వ స్థితః
కేకీ కూజతి చే త్తదా విగళిత
వ్యాళావళీ బంధనః

సేవ్యస్స్వ్య దిహసర్వలోకమనసా
మానందనశ్చందనః

శార్దూల విక్రీడితం

కా కోలూక కపోత కుక్కుట
ఖగస్కంధంబు లెన్నెన్నియో
లేకేమీ మలయాద్రి మీద?
ఫలమా? లేశంబు లేదాయెగా
కేకస్ సుందర చందన
ప్రకాండ సమాకీర్ణాహిజాలంబులన్
పోకార్పంగల నెమ్మి చాలును
జనామోదంబు సంధింపగన్.

ఈ విధంగా మెచ్చుకున్న నెమలినే మరో చోట నిందిస్తున్నాడు మరో కారణం చూపించి.

నెమలి చాలా అందమైన పక్షి. నెమలికన్నులను సార్వభౌములుకూడా తలమీద తురాయిగా పెట్టుకుంటారు. అందుకని ముచ్చటపడి ఒకడు నెమలి దగ్గరకువెళ్లి అర్థిస్తున్నాడు. 'తలలో పెట్టుకుంటాను. ఒక్కటంటే ఒక్క ఈక ఇవ్వవే నెమలీ! మంచి దానివికదూ!' అని. 'ససేమిరా ఇవ్వనుగాక ఇవ్వను' అని నెమలి పొగరుగా మెడ తిప్పుకుంటూ సాగిపోయింది. అడిగి అడిగి ప్రాణం విసిగిపోయి అతడు నెమలిని నిందిస్తున్నాడు. 'కాళ్లావేళ్లాపడి ఒక్కకన్ను ఇవ్వవే అని బతిమాలుతున్న నాకు ఎందుకు ఇస్తావు నెమలీ! ఏ కిరాతుడో ఉచ్చువేసి నిన్ను పట్టుగుని, నీ రొమ్ముమీద ఎడమకాలువేసి తొక్కిపట్టి, నీ పింఛం అంతా నిర్దాక్షిణ్యంగా ఊడలాక్కుపోతే కిక్కురుమనకుండా వాడికి ఇచ్చేస్తావుగాని నా బోటి వాడికి ఇస్తావా?'

బాబ్బాబు అని బతిమలాడే యాచకుడికి ఒక్కరాగి డబ్బు విదల్చని ధనికుడైన లోభిని మనస్సులో ఉంచుకుని చేసిన కల్పన ఇది. ఏ బందిపోటో నీ కొంపమీదపడి, నీ పెడరెక్కలు విరిచికట్టి, ఉన్నడబ్బు అంతా పూచికపుల్లతోసహా ఊడ్చుకుపోతే కుక్కినపేనులా కిక్కురు మనకుండా వాడికి అప్పచెప్తావుగానీ దీనుడైన యాచకుడికి గుప్పెడు గింజలు వేయడానికి నీకు మనసు ఒప్పుతుందా? అని ధ్వని.

వసంత తిలక

రేరే శిఖావళ! శిఖా భరణాయ బర్హ
మేకం దిశే త్యనునయా న్మమ కిం దదాసి?
భిల్లాయ వామచరణం హృదయే నిధాయ
నిర్లుంచతే దిశసి నిర్దయ మథ్యమానః

శార్దూల విక్రీడితం

ఈకన్నొక్కటి కొప్పులో తురుమగా
నిమ్మంచు నే వేడినన్
కేకీ! నా కిపుడేల యిచ్చెదవు ?
నీ గ్రీవమ్ము నే భిల్లుడో
డాకాలన్ బిగియంగ నొక్కి
మొదలంటన్ నిర్దయస్వాంతుడై
పీకంబూనిన వేళ నిచ్చెదవులే
పింఛంబు నవ్వానికిన్.

* * *

మంచిగంధపు చెట్టు

'అపకారికి నుపకారము, నెపమెన్నక సేయువాడు నేర్పరి' అనే సూక్తికి అమోఘోపమానంగా నిలువబడ గలిగినది చందనవృక్షమని పండితరాయలు దానిని అనేక విధాలుగా శ్లాఘించాడు. ఎంత పొగిడినా అతగాడికి తనివితీరదు.

తనని ముక్కలు ముక్కలుగా నరికిన గొడ్డలికికూడా తన అపురూపసౌరభాన్ని సమర్పిస్తుందట చందనం. అంతేకాని కించిత్తూ కోపగించదట. మంచితనానికి ఇది పరాకాష కాదూ ?

ఆర్యా

సుజనో హి యాతి శాంతిమ్
పరహితబుద్ధి ర్వినాశ కాలేఽపి
ఛిన్నోఽపి చందన తరుః
సురభయతి ముఖం కుఠారస్య.

ఆటవెలది

ఆత్మనాశకాల మందైన సుజనుండు
పరహితైకబుద్ధి వదలబోడు
పరశు ముఖమునైన సురభిళం బొనరించు
నరుక బడెడు చందనంపు తరువు.

ఇంతగా పొగిడిన మంచిగంధపు చెట్టునుకూడా నిందిస్తున్నాడు దోషం వెతికి పట్టుకుని.

మంచిగంధమా! నీ పరిమళం త్రిలోకముల యందూ ప్రసిద్ధమైనది. నీ శీతలత్వం లోకోత్తర మైనది. నీ కీర్తి దిగంగనల వాకిళ్లదాకా విస్తరించింది. నీవి అన్నీ మంచిగుణాలే. కాని ఏం లాభం ? నీ తొర్రలలో భయంకరమైన తాచుపాములకి ఆశ్రయం ఇచ్చావు. నీ గుణగణాలన్నీ ఈ ఒక్క దుశ్చర్యవల్లనూ వ్యర్థమై పోతున్నాయికదా !

మహాదాత, గొప్ప ధార్మికుడుఅయిన చక్రవర్తి ఉన్నాడు. అతడిని ఆశ్రయిద్దామని ఎందరెందరో విద్వాంసులు వస్తున్నారు. సార్వభౌముడి దగ్గర ఇవ్వడానికా బోలెడు సొమ్ముఉంది. ఇవ్వాలనే అభిలాషా పుష్కలంగా ఉంది. కాని ఏం లాభం ? అతడిచుట్టూ నల్లతాచుల్లాంటి దుర్మార్గులుజేరి యోగ్యులైనవారి నెవ్వరినీ దగ్గరకు చేరనియ్యకుండా ఉన్నారు అని ధ్వని.

శార్దూల వికీ్రడితం

సౌరభ్యం భువనత్రయేఽపి విదితం
శైత్యంతు లోకోత్తరమ్
కీర్తిః కించ దిగంగనాంగణ గతా
కిం త్వేతదేకం శృణు
సర్వానేవగుణానియం నిగరతి
శ్రీఖండ ! తే సుందరా
నుజ్ఝంతీ ఖలు కోటరేషు గరళ
జ్వాలాద్విజిహ్వావళీ.

చంపకమాల

పరిమళమా ? త్రిలోకముల వంద్య
మనందగు— శైత్యమా ? మనో
హరము—దిగంగనాంగణవిహారి
యశస్సు—సమస్త సద్గుణో
త్కరపరిభావివయ్యెను వృధా
గద నిత్యము నీదు తొర్రలన్
గరళమహాగ్ని గ్రక్కు భుజగంబుల
నిల్పుట మంచి గంధమా !

* * *

సముద్రం

మందరపర్వతం నీ గర్భంలోదూరి గిరగిరా తిరుగుతూ నీకు దుర్భరమైన వ్యథ కలిగిస్తున్నప్పటికీ పరోపకారార్థివైన నీవు ఆ బాధను కడుపులోనే దాచుకున్నావు. సుడిగాలులచేతను, తుఫానుల చేతనూ వ్యాకులపడుతూకూడా మర్యాదాతిక్రమణం (చెలియలికట్ట దాటిరావడం) చేయవు. మహాపర్వతాలకు ఆశ్రయం ఇచ్చావు. మూడు లోకములకూ పయస్సుల నిచ్చి పరిపోషిస్తున్నావు. నీ మహత్వాన్ని ఎల్లా కీర్తించగలను జలధీ !

శార్దూల విక్రీడితం

అన్యార్థం కియతీ రువాహ మహతీ
ర్మంథాన మర్మవ్యథా
మర్యాదా మతివర్తతే న
కతిభి ర్వాత్యాభి రత్యాకులః
కుక్షౌ క్షోణిభృతో బిభర్తి పయసా
పుష్ణాతి లోకత్రయమ్
తేనైవాంబునిధే ర్మహత్త్వ
మధికం వర్వర్తి సర్వోపరి.

మత్తేభ విక్రీడితం

మదిలోనన్ భరియించి తన్యులకునై
మంథానమర్మవ్యథన్
వదలంబోవు తుఫానుచే కలగినన్
మర్యాద నింతేని, నీ
యుదరం బున్నత శైలజాల భరితం,
బుర్విన్ పయఃపూర్తిచే
ఉదధీ ! ప్రోతువు; నీ మహత్త్వ
మది సర్వోత్కృష్టమై తోచెడిన్.

సముద్రుడిదగ్గర కావలసినంత జలం ఉంది. కాని, ఏంలాభం? అందులోని ఒక్కచుక్కకూడా మానవుల దాహశాంతికి ఉపయోగించకుండా ఉంది. లోభిదగ్గర భోషాణంనిండా డబ్బు మూలుగుతోంది. కాని, అది పరోపకారానికి వినియోగపడదు. ఈ భావాన్ని రకరకాలుగా తిప్పి చాలాచోట్ల సముద్రుణ్ణి నిందించాడు పండితరాయలు.

బ్రహ్మాండమైన జలరాశి ఎదర కనిపిస్తూ ఉంటే, ఎండిపోతున్న గొంతుకలో పోసుకోడానికి గుక్కెడు మంచినీళ్లు ఇచ్చే నుయ్యి ఏదైనా దొరుకు తుందేమోనని నీ తీరంలో బాటసారులు వెయ్యికళ్లతో, కళ్లనిండా ఆశతో వెతుక్కుంటున్నారు చూడు. నీకు సిగ్గులేదుటయ్యా సముద్రుడా! పైగా ఉత్తుంగ తరంగమాలికా ప్రౌఢిమ చూపిస్తూ అరుస్తావెందుకూ? నోరు మూసుకో!

అనుష్టుప్

తరంగమాలికాభీల
ధిక్ తే సాగర! గర్జితం
యస్య తీరే తృషాక్రాంతాః
పాంథాః పృచ్ఛంతి వాపికామ్.

ఆటవెలది

చాలు నీ తరంగమాలికాదుర్వార
గర్జనమ్ము లింక కడలిరేడ!
నోరులెండి నీదు తీరాన పథికాళి
దేవులాడుచుండు బావికొరకు.

* * *

మామిడిపండు

పండితరాయలకి మామిడిపళ్లు చాలా ఇష్టం కాబోలు. ఈ పండును పొగిడినట్లుగా మరేపండునీ పొగడలేదు.

మామిడిపండుకిగల ఫలరాజబిరుదాన్ని విని మిగిలిన పండ్లన్నీ అసూయతో ఎల్లా కుమిలి పోతున్నాయో వర్ణిస్తున్నాడు. (ఇదే ఇతివృత్తంతో 'పండితరాయల హాస్యం' అనే వ్యాసంలో మరో శ్లోకాన్ని లోగడ ఉదాహరించాను. కొద్ది భేదాలతో చెప్పిన వేరే శ్లోకం ఇది. ఇటువంటి పునరుక్తులు భామినీవిలాసంలో దండిగానే ఉన్నాయి. వరసగా ఆలోచించి ఏకబిగిని వ్రాసిన కావ్యం **కాదు** ఇది. అప్పుడూ అప్పుడూ సందర్భానుసారంగా, చాలాభాగం ఆశువుగా చెప్పిన శ్లోకాల సంపుటి ఇది. కనుక, చెప్పిన భావాన్నే మరో మాటల్లో మళ్లీ మళ్లీ చెప్పడం కనిపిస్తుంది)

మామిడిపండుకిగల కీర్తి ప్రతిష్ఠలు వినే సరికి—

కొబ్బరికాయకి గుండె చెరువై పోయిందట.

దోసకాయ రెండు ముక్కలుగా పగిలిందట. బాగా పక్వానికి వచ్చిన దోసపండు తీగను ఉండగానే విచ్చిపోవడం మామూలేకదా!

పనసపండుకి ఒళ్లంతా ముళ్లు అయాయిట.

అరటిపళ్లు సిగ్గుతో ముఖాలు వంచుకున్నాయిట. చెట్టుమీద గెలని వేలాడుతున్న అరటిపళ్ల నల్లని చివరలు క్రిందికి వాలి ఉండడం సహజమే కదా!

ద్రాక్షపండు క్షుద్రతని పొందిందట. క్షుద్రత అనే మాటకి నీచత్వం అనీ తియ్యదనం అనీ రెండు అర్థాలు ఉన్నాయి.

నేరేడుపండు సిగ్గుతో కమిలి నల్లబడిందిట.

శార్దూల విక్రీడితం

ఆకర్ణ్యామ్రఫలస్తుతిం జలమభూత్
తన్నారికేళాంతరమ్
ప్రాయః కంటకితస్తథైవ పనసః
జాతం ద్విధోర్వారుకమ్
ఆస్తే ఒధోముఖమేవ కాదలఫలం
ద్రాక్షాఫలం క్షుద్రతామ్
శ్యామత్వం బత జాంబవం
గత మహో మాత్సర్య దోషాదిహ.

మత్తేభ విక్రీడితం

చెరువయ్యెన్ హృదయంబు కొబ్బరికి—
విచ్చెన్ దోస రెండింటిగా
శిరసుల్ వంగె ననంటిపండ్లకు—
ముఖశ్రీమాడె నేరేళ్లకున్
ధరియించెన్ పలుముండ్లు మేన పనసల్—
ద్రాక్షల్ బహుక్షుద్రతన్
తరలెన్—నీ ఫలరాజ విశ్రుతికి
మాత్సర్యంబునన్ మామిడీ!

ఇంత గొప్పమామిడిపండులో కూడా పండిత రాయలకి దోషం కనిపించింది.

మామిడిపండూ! నువ్వు ఫలరాజువి. సరే. నేను కాదనడంలేదు. నీ పరిమళం దిఙ్మండలంఅంతనీ సురభిళం చేసేస్తోంది. నీ సౌందర్యం కళ్లు చెదర గొట్టేస్తోంది. అయితేమాత్రం ఏంలాభం? నీ గుండె కరుడు కట్టుకుపోయిందికదూ!

మామిడిపండులోపల గట్టిటెంక ఉంటుందనే విషయాన్ని ఎంత చమత్కారంగా వర్ణించాడో!

వసంతతిలక

దిఙ్మండలం పరిమళైః సురభీకరోషి
సౌందర్యమావహసి లోచనలోభనీయమ్
ఆహో రసాల ఫలవర్య! తథాపి దూయే
యద్గంధిలంచ కఠినం హృదయం బిభర్షి.

తేటగీతి

పరిమళంబుల నెల్లెడ బరపుచుందు
కన్నులకు విందుసేయు నీ వన్నెచిన్నె
అయిననేమి? రసాలఫలావతంస!
కఠినమయ్యెను నీ గుండె కరడుకట్టి.

*　　*　　*

పద్మం

కొలనిలో తామరతీగ అల్లుకునిఉంది. ఎర్రటి చారడేసి పువ్వులు కొలనుఅంతటా వికసించి కలకల లాడుతున్నాయి. హంస ఒకటే ఆ పువ్వులను చూచుకుని మురుసుకుంటున్నది. ఆ చెరువులో పద్మంలాంటి అందమైన మొహంగల ఓచిన్నది స్నానం చేస్తోంది. ఆ చెరువు పావంచాలమీద ఒక వృద్ధుడైన యోగీశ్వరుడు జపం చేసుకుంటున్నాడు. అప్పుడప్పుడు కళ్లు సగం తెరిచి, ఆ పిల్లకేసి దొంగచూపులు చూస్తున్నాడు. ఈ సన్నివేశాన్ని చూసేసరికి పండితరాయల మనస్సులో కొంటెతనం పొటమరించింది. ఈ రెండు విషయాలనూ శ్లేషచేత గుదిగుచ్చి, చిన్నశ్లోకంలో బహుచమత్కారంగా చెప్పేడు.

తేనెలు ఒలికించే ఓ పద్మినీ! వృద్ధుడు, శుచి అయిన ఈ హంస పుష్పవతివి అయినప్పటికీ నిన్ను విడిచిపెట్టి పోలేకుండా ఉన్నాడు. కనుక సుభగత్వం అంటే నీదేకదా!

పద్మిని అంటే తామరలత అనీ, పద్మినీజాతి స్త్రీ అనీ రెండు అర్థాలు. పుష్పవతి అంటే పువ్వొడి కలది అనీ, ఋతుమతిఅనీ అర్థద్వయం. హంస శబ్దానికి రాయంచ అనే పక్షిఅనీ, యోగిపుంగవుడనీ అర్థాలు. సుభగత్వం అంటే సరేసరికదా. మడి, ఆచారంగల వృద్ధుడే నిన్ను విడిచిపోలేకుండా ఉన్నాడు. కనుక నీ గొప్పతనం చెప్పేదేమిటి?

ఆర్యా

అయి మకరంద స్యందిని!
పద్మిని! మన్యే తవైవ సుభగత్వమ్
పుష్పవతీమపి భవతీం
త్యజతి న వృద్ధః శుచి ర్హంసః

తేటగీతి

తేనె లొలికించు పద్మినీ! తెలిసికొంటె
అనుపమంబైన సుభగత్వ మనగ నీదె
వృద్ధహంసమ్ము శుచియని పేరుగనియు
పుష్పవతివైన నినువీడి పోవడయ్యె.

ఇంత చక్కని తామరలలో ఒక లోపంఉంది. హంసలకీ పద్మాలకీ చుక్కెదురు. స్వచ్ఛమైన తెల్లని శరీరంగలవి హంసలు. వాటినిచూస్తే చాలు పద్మం మొగం చిట్లించుకుంటుంది. నల్లని మధుపాలను మాత్రం స్వేచ్ఛగా తనలోపలికిరమ్మని ఆహ్వానిస్తుంది. శ్రీమంతుల దుర్లక్షణాలన్నీ ఈ తామర పువ్వులకు పట్టుబడ్డాయని ఆక్షేపిస్తున్నాడు పండితరాయలు.

మధుప శబ్దానికి తుమ్మెదఅనీ, తాగుబోతు అనీ రెండు అర్థాలున్నాయికదా. హంసకి గల అర్థద్వయం తెలిసినదే. శ్రీ అనగా లక్ష్మి. పద్మంలో లక్ష్మీదేవి నివసిస్తుంది. కనుక పద్మం శ్రీమంతురాలు అయింది. తాగుబోతులను లోనికి ఆహ్వానించి, సజ్జనులనుచూచి కసురుకుని వీధి వాకిట్లోనే నిలువబెట్టడం వంటి శ్రీమంతుల లక్షణాలన్నీ పద్మం పుణికి పుచ్చుకున్నదని చమత్కారం.

అనుష్టుప్

హంసాః సర్వాంగ ధవళాః
పద్మేభ్యో బహిరాసతే

అంత ర్విశంతి మధుపాః
శ్రీమతా మీదృశీ గతిః.

కందం

నిలువంతయు తెలుపగు హం
సలు వెలుపల నిలిచియుండు సారసములకున్
నలుపగు మధుపంబులలో
చెలరేగెడు — నైజమిద్ది శ్రీమంతులకున్.

* * *

చాతకం

మేఘంనుంచి జారిపడుతున్న వాన చినుకులను మాత్రమే తాగి ప్రాణాలు నిలుపుకునే పరువుగల పక్షి చాతకం. వర్షం పడకపోతే, గొంతుపొడి ఆరిపోతున్నా సరే చావనైనా చస్తుందికాని నీచులని యాచించదు. అటువంటి గొప్పపక్షి చిరంజీవియై ఉండుగాక. చాలా అభిమానంగల యాచకునిగా చాతక పక్షినీ, దాని ఇబ్బందులను తొలగించేదాతగా మేఘుణ్ణి పండితరాయలు రకరకాలుగా వర్ణించాడు.

అనుష్టుప్

ఏక ఏవ ఖగో మానీ
చిరం జీవతు చాతకః
పిపాసయా వా మ్రియతే
యాచతేవా పురందరమ్.

ఆటవెలది

పరువు గలిగినట్టి పక్షి చాతక మొండె
వసుధనది చిరమ్ము బ్రదుకుగాక
దాహబాధచేత తనువు వీడిన వీడు
వేడబోదు దేవవిభునిదప్ప.

ఈ చాతకాన్ని పొగుడుతూ, దాని ప్రాణాలు కాపాడవలసిందని మేఘునికి నచ్చచెప్తూ సుమారు 50 శ్లోకాలు వ్రాశాడు పండితరాయలు. ఇంతమంచి పక్షిని నిందించే శ్లోకం ఒకే ఒక్కటి కనబడింది. అది అయినా శ్లేషచేత.

ఆషాఢమాసం ప్రవేశించింది. ఆకాశంలో మబ్బులు కనిపిస్తున్నాయి. ఎక్కడో ఓ మేఘం ఉరిమింది. ఆ చప్పుడు విని నెమలి ఒకటి మెడ పైకెత్తి మేఘుడితో మాట్లాడుతోంది.

ఏమయ్యోయ్! పయోధరా! ఆకాశంలో నువ్వు ఉరిమిన శబ్దం నా చెవులబడితే చాలు పరవశించిపోయి, పురివిప్పి మహదానందంతో నృత్యం చేస్తాను. నీ దగ్గరనుంచి అంతకన్న వేరే ఏదీ నేను ఆశించడం లేదు. ఆ పాడు చాతకపక్షిలాగ నీ జీవనాలు (ప్రాణాలు, నీళ్ళు) ఇమ్మని వెంటబడి వేపుకు తినే రకం కాదుసుమా నేను.

ఏదో ఒకటి ఇచ్చేదాకా ప్రాణాలు తోడేసే బంకపాషాణాల్లాంటి యాచకుల కోవలోకి చాతక పక్షిని చేర్చి నిందించాడు.

ఆర్యా

అహమస్మి నీలకంఠ
స్తవఖలు తుష్యామి శబ్దమాత్రేణ
నాహం జలధర ! భవత
శ్చాతక ఇవ జీవనం యాచే.

తేటగీతి

ఆకసమ్మున నీ శబ్ద మాలకించి
పరవశమ్మున నర్తించు బర్హి నేను
వనధరమ ! వానకోయిల పగిదినీదు
జీవనము లిమ్మటంచు యాచింపబోను.

* * *

మేఘం

మేఘుడు మహాదాత. అతడివల్లనే భూమిమీద సకలజీవరాశులూ మనగలుగుతున్నాయి. అతడు ఘనుడు. ఆ ఘనతకి తగ్గట్లుగానే అతడి యీవి కూడా బహుఘనంగా ఉంటుంది. దాహబాధ భరించలేక చాతకపక్షి మూడునాలుగునీటిబిందువులు దయ చేయించవలసిందని మేఘుణ్ణి అర్థించింది. అంత స్వల్ప దానం ఆ మహామహుడికి సాధ్యంఅవుతుందా? కుంభ వృష్టి కురిపించేశాడు విశ్వమంతటా.

'పిడికెడుగింజలు బిచ్చంవెయ్యండిబాబూ! అని యాచకుడొకడు మహాదాతను అర్థించగా, ఆ మహాత్ముడు ఊరందరికీ భూరిసంతర్పణ చేశాడు. దాన గుణం చాలా చిత్రమైనది.

రథోద్ధతా

చాతక స్త్రి చతురాన్ పయఃకణాన్
యాచతే జలధరం పిపాసయా

సోఽపి పూరయతి విశ్వ మంభసా
హంత! హంత! మహతా ముదారతా.

ఆటవెలది

మూడునాల్గు బిందువుల నీరు దప్పిచే
చాతకమ్ము వేడ జలధరమును
మొగిలు విశ్వమెల్ల పూరించె నీటిచే
ఎవని తరము ఘనుల యీవి నెన్న?

ఇటువంటి ఘనుడుకికూడా చివాట్లు తప్పలేదు. అడవిలో దావాగ్ని మహాభయంకరంగా ప్రజ్వరిల్లి చుమ్మలుచుట్టేస్తోంది. ఆ మంటలలో సమస్తమైన మహావృక్షాలూ, లతలూ మాడి బొగ్గైపోతున్నాయి. అయ్యయ్యో, అటువంటిచోట వర్షించకుండా ఎక్కడో దూరపు కొండకొమ్ములమీద కుండపోతగా వాన కురిపిస్తున్నావేమిటయ్యా జలధరుడా! నీ కింతపాటి యుక్తాయుక్తవివేకం లేకుండా పోయిందా ? ఐశ్వర్యంతో మదించిపోయావా ?

ధనగర్వాంధులు తిండిలేని దీనులకి ఒక్క గింజ విదపరు. తమ సొమ్ము అంతా వ్యసనాలపాలు, రాళ్లపాలు చేస్తారు అని ధ్వని.

మాలినీ

దవదహన జటాల జ్వాల జాలా హతానామ్
పరిగళిత లతానాం మ్లాయతాం భూరుహాణామ్
అయి జలధర! శైలశ్రేణి శృంగేషు తోయమ్
వితరసి బహు కోఽయం శ్రీమద స్తావకీనః

చంపకమాల

నలుదెసలన్ దవానలము నాల్కలు
సాచి మహీరుహమ్ములన్
లలితలతానికుంజముల నాశము
చేయుచు ప్రజ్వరిల్ల నో
జలధరమా! సుదూరగిరి
సాను తటంబుల కుండపోతగా
సలిలము గుమ్మరించుపని
చాలును— నీకిది శ్రీమదంబొకో!

* * *

చంద్రుడు

రాజశబ్దానికి చంద్రుడుఅనీ, నరపాలుడనీ రెండు అర్థాలున్నాయి. లోకంలోఉన్న అల్ప మనస్కులైన నృపాలురకు రాజశబ్దం అతకదనీ, చంద్రుడికొక్కడికే అది సరిపోతుందనీ పండితరాయలు ఢంకా బజాయించి చెప్తున్నాడు. ఏమంటే, తనకు దగ్గర వాళ్లనీ, ఆశ్రితులనీ, తనని పొగిడేవాళ్లనీ, వస్తాదుల్నీ పోషించే రాజులు లోకంలో చాలామందేఉన్నారు. అందులో ప్రత్యేకతగాని, విచిత్రంగానీ ఏమీలేదు. ఇంక ఆకాశంలోఉన్న ఆ రాజు ఎవరినిపోషిస్తున్నాడూ? మార్తాండ తేజస్సుకి కమిలి, దిక్కుతోచకుండా, దీనంగా, బహుదూరంగా ఉన్న చకోరపక్షులను చల్లని పండువెన్నెలలు తినిపించి పోషిస్తున్నాడు. ఓహోహో! అతడయ్యా అసలైన రాజు. ఈ నృపాలాధములను రాజులనడం ఏం సబబు ?

శార్దూల విక్రీడితం

రాజానః కతివా నసంతి జగతి
ఖ్యాతా నిజాభ్యాశగాన్
యే పుష్ణంతి బలీయసః
పరిచితాశ్చిత్రం నమన్యామహే
రాజారాజతి కేవలం హిమకరః
పుష్ణాతి దూరస్థితాన్
జ్యోత్స్నాభిర్గ్లపితాన్ దినేశ
మహసాలోఽసౌ చకోరా నిమాన్.

చంపకమాల

పరిచితులైన వాండ్ర, బలపంతుల,
దగ్గరవారలన్, చెవుల్
కొరికెడు వాండ్ర మేపుదురు
కొందరురాజులు వారు రాజులా?
ఖరకరభానుతేజపరిఖండిత
దూరచకోరపోషణా
దర కరమండలుండగు
సుధానిధి నొక్కని రాజనన్ వలెన్.

ఇంత ఉత్తముడైన చంద్రునిలో పండితరాయలకి సవాలక్ష దోషాలు కనిపించాయి. అన్నింటికన్న ముఖ్యమైనది అతడు దోషాకరుడు కావడం.

దోషశబ్దానికి రాత్రి అనీ దోసగు అనీ రెండు అర్థాలు. రాత్రిని చేయువాడు (దోషాం కరోతి ఇతి దోషాకరః) అని ఒక అర్థంలోనూ, గురు భార్యా సంగమదోషం కలవాడు (దోషాణాం ఆకరః దోషాకరః) అని రెండవ అర్థంలోనూ దోషాకర శబ్దాన్ని ప్రయోగించి నిందించాడు. పైగా చంద్రుడు కుటిలుడట. నిజమే వంకరగా ఉంటాడు కదా! అతడు కలంకితుడట. మచ్చలున్నాయికదా! మిత్రుని అవసాన సమయంలో ఆనందంగా ఉంటాడట. సూర్యాస్తమయం అయాకనే కదా చంద్రునికాంతి బయటపడేది? స్నేహితుని దుర్దశకు ఆనందించే నీచుడని రెండవ అర్థం. ఇన్ని లోపాలు ఉన్నప్పటికీ చంద్రుణ్ణి సర్వజ్ఞుడైన మహేశ్వరుడు నెత్తిమీద పెట్టుకున్నాడు. అవునులే, ఆశ్రితుల గుణదోషాలను విచారించేవాడు ఎవడు ఈ లోకంలో?

వసంతతిలక

దోషాకరోఽపి కుటిలోఽపి కలంకితోఽపి
మిత్రావసానసమయే విహితోదయోఽపి
చంద్రస్తథాపి హరవల్లభతా ముపైతి
నైవాశ్రితేషు గుణదోషవిచారణా స్యాత్.

శార్దూల విక్రీడితం

మేనన్ పెక్కుకళంకముల్ కలిగినన్,
మిత్రావసానంబునన్
సానందోదయుడైన, చాల
కుటిలుండైయున్న, దోషాకరుం
డైనన్ చంద్రుని నెత్తికెత్తుకొనె
లోకాధీశ్వరుండు — ఔనవున్
కానంజాలుదురే నిజాశ్రిత
గుణ స్థాలిత్య మెందేనియున్ ?

* * *

కో కి ల

కోయిలకూత విని పరవశించి పోనివాళ్లు అరుదు. దాని పంచమస్వరమాధుర్యాన్ని కవులు రకరకాలుగా శ్లాఘించారు. భామినీ విలాసంలో కోకిలను ప్రశంసిస్తూ పాతిక శ్లోకాలదాకా చెప్పేడు పండితరాయలు. అందులోనుంచి మచ్చుకి ఒక్కటి చూద్దాం.

కోకిల చిన్నతనంలో అపస్వరాలు పలకకుండా మౌనంగా ఉండిపోతుంది. తన కూత సర్వజనానందదాయకంగా ఉంటుందని గట్టి నమ్మకంతోచేదాకా నోరు మూసుకుని ఉండి, హఠాత్తుగా ఒకరోజున గొంతువిప్పి, జగత్తుఅంతా పులకరించిపోయేటట్లు అద్భుతంగా పాడడం మొదలు పెడుతుంది. పాడితే అమోఘంగా పాడడం, లేకపోతే మౌనంగా ఉండిపోవడమూ తప్పిస్తే, మధ్యస్థితి దానికిలేదు.

వచ్చీరాని అవకతవక కవిత్వాన్ని సభలో చదివి, నవ్వులపాలు అయిన ఓ అభాజనుణ్ణి వెక్కిరిస్తూ చెప్పిన శ్లోకం ఇది.

అనుష్టుప్

తావ న్మౌనేన నీయంతే
కోకిలైశ్చైవ వాసరాః
యావత్సర్వ జనానంద
దాయినీ వాక్ప్రవర్తతే.

ప్రియంవద

సరళ కోకిలము సర్వలోక హృ
త్సరసిజాళి తన శ్రావ్య వాక్సుధా
ఝరుల తేల్చగల ఝామదాక వా
సరములన్ గడుపసాగు మూగగా.

వసంతకాలంలో కూత మొదలుపెట్టిన కోకిల వర్షాలుపడడం మొదలుపెట్టేక హఠాత్తుగా పాడడం మానేస్తుంది. ఈ విషయాన్ని మనస్సులో ఉంచుకుని కోకిలని నిందిస్తున్నాడు.

జీవనప్రదాతలయిన మేఘుడు ఉన్నత స్థితికి వస్తే (ఆకాశంలో మబ్బులు పట్టేసరికి) మొగం ముడుచుకుని నోరు కుట్టేసుకుంటావా? కోకిలా! ఎంత కుళ్లుబోతువి !

ఆశ్రయదాత ఉచ్చస్థితికి వచ్చినప్పుడు, అతడి వల్ల లాభం పొందినవాళ్లు సంతోషించకుండా మొగాన గంటుపెట్టుకోవడం కుళ్లుబోతుల లక్షణం.

ఆర్యా

మలినాత్మనా విరాగః
ప్రకటీకృత ఏవ కోకిల ఖలేన

జీవనదానా మున్నతి
సమయే వాచంయమీ భవతా.

తేటగీతి

జీవనమ్ముల నిచ్చి పోషించునట్టి
ఘనుడు నేడున్నతస్థితిం గాంచినంత
మొగమునన్ గంటువెట్టుక మూలకొదిగి
కోకిలము మౌనమూనెడు కుళ్లుబోతు.

*　*　*

ఏనుగు

మేకలు, దున్నలు, ఎద్దులువంటి అల్పమృగాలు దరిద్రుల పూరిపాకలముందు ఏవో నాలుగు గడ్డిపరకలుమేసి, సంతోషంగా రోజులు వెళ్లబుచ్చేస్తాయి. కాని, మత్తేభములు అల్లా గడుపుకోగలవా? మదజలంచేత బురదలయిన వింధ్యారణ్యంలోనైనా ఉంటాయి, లేదా రాజమందిరాలలోనైనా ఉంటాయి. అంతేకాని, ఏదో బతికేంలంటేబతికేంలని క్షుద్రంగా జీవించడం వాటికి చేతకాదు. గొప్పవాళ్ల అవసరాలు కూడా గొప్పగానే ఉంటాయి.

శిఖరిణీ

నిషేవంతా మేతే వృషమహిషమేషాశ్చహరిణా
గృహాణి క్షుద్రాణాం కలిపయతృణైరేవ సుఖినః
గజానామాస్థానం మదసలిలజంబాలితభువాం
తదేకం వింధ్యాద్రేర్విపిన మథవా భూపసదనమ్.

శార్దూల విక్రీడితం

సంతోషించునుగాక రంకు వృష
మేషా ద్యల్పజంతువ్రజం
బింతింతల్ తృణశేషముల్
కరచుచున్ హీనప్రజా శుష్క గే
హాంతర్భూముల—వారణంబులకు
దానాంభఃప్రసిక్తస్థలుల్
గంతవ్యంబులు రాజమందిరములో
కాకున్న వింధ్యాద్రియో.

ఏనుగుని బహుచమత్కారంగా నిందించాడు మరోచోట. దాహంతో గొంతుఎండిపోయిన చాతక పక్షికి దూరాన నల్లని ఏనుగు ఒకటి కనిపించింది. అది కారుమేఘం అని భ్రమపడి, తాగడానికి నాలుగు చినుకులు రాలుస్తుందని ఆశపడి, ఉబ్బితబ్బిబ్బు అయిపోతోంది. దానినిచూచి జాలిపడి పండితరాయలు ఇల్లా అంటున్నాడు. ఎందుకే వృథాగా గంతులు వేస్తావు ? పిచ్చిచాతకీ! అది మేఘం అనుకుంటున్నావా ? కాదు కాదు. అది మదాంధమైన ఏనుగు సుమా. అది నీబోటివాళ్లకి ఏమీ ఇవ్వదు. మాతంగ దానం ఎంతసేపూ మధుపకులానికే తెలుసా?

ఏనుగుమీదకారే మదజలానికి దానం అని పేరు. ఆ దానజలాన్ని తుమ్మెదలు లొట్టలువేస్తూ తాగుతాయిట. ఏనుగులు ఎంతసేపూ తాగుబోతులైన మధుపాలకేగాని నీబోటివాళ్లకి దానం ఇవ్వవు అంటున్నాడు. మాతంగ, దాన, మధుప శబ్దాలకు గల శ్లేష వివరించడం ఉచితంకాదు కనుక వదిలేస్తున్నాను.

ఆత్మాభిమానంగల విద్వాంసు డొకడు రాజుని ఆశ్రయిద్దామని బయలుదేరేడు. 'ఆరాజు నీబోటివాళ్లకి ఏమీ విదల్చడయ్యా, అతగాడి దానం ఎంతసేపూ వేశ్యలకీ, జూదరులకీ, తాగుబోతులకీ మాత్రమే పరిమితం, వృథాగా ఎందుకు శ్రమపడతావు' అని వారిస్తున్నాడు పండితరాయలు.

ఉపజాతి

వృథా కథం నృత్యసి చాతక! త్వమ్
సకాలమేఘో ఽయ మిభోమదాంధః
స త్వాదృశేభ్యో న దదాతి కించి
న్మాతంగ దానం మధుపేభ్య ఏవ.

తేటగీతి

ఎందుకే చాతకంలు! నీ ఎగిరిపాటు?
అద్ది మేఘమ్ముకాదు—మదాంధదంతి
ఇంచుకయునది నీబోంట్ల కీయబోదు
మత్తమాతంగదానంబు మధుపతతికె

*　*　*

తుమ్మెద

మన సాహిత్యప్రపంచంలో తుమ్మెదలకి చాలా గొప్పస్థానముంది. నిగనిగమెరిసే నల్లనినలుపు, శ్రావ్యమైన ఝుంకారము, తేనెతాగడంలో వాటికిగల

మమత, ఇవి అన్నీ రసికులని బాగా ఆకర్షించాయి. సుందరీజనులవక్రాలకాసమూహానికీ, నల్లనికాటుక కళ చూపులకీ ఉపమలుగా ప్రసిద్ధికెక్కేయి. మన్మథుని వింటికి నారిగా ఏర్పడ్డాయి. పండితరాయలు వీటిని పొగడదలుచుకున్నప్పుడు మధువ్రత, షట్పద, భ్రమర ఇత్యాదిపదాలనూ, తిట్టదలుచుకున్నప్పుడు తాగుబోతులుఅనే అర్థంవచ్చే మధుపశబ్దాన్నీ ప్రయోగిస్తాడు.

తుమ్మెద ఒకటి మాలతీలతని సమీపించింది ఝు—మ్మని గానంచేస్తూ. ఆ మాలతి ఏకారణం చేతనో తుమ్మెదమీద అలిగి, మాటాడకుండా పెడ మొగం పెట్టుకునిఉంది. (బహుశా వెనుకటి మిళిందౌదాసీన్యం జ్ఞాపకం వచ్చిఉంటుంది.) పండితరాయలు రాయబారం నడుపుతున్నాడు.

ఓ మాలతీ! ఈ మధుకరుడు బహుప్రశాస్యంగా గానంచేస్తూ ముచ్చటగా నీదగ్గరకువస్తే అతడిని ఆహ్వానించకుండా ఇల్లా మౌనం వహిస్తావా? ఇది నీకు ఉచితమేనా? అతడు ఎటువంటివాడో నీకేమైనా తెలుసా? పరమ దాతలైన కల్పద్రుమాలు సైతమూ ఇతడిని తమ నెత్తిన పెట్టుకుంటాయి. నీదగ్గరకు వచ్చాడని అవజ్ఞ చేయడం తప్పుకదూ?

కల్పవృక్షాల చిటారికొమ్మలమీది పువ్వులమీద తుమ్మెద వాలడాన్ని ఆ మహావృక్షాలు శిరసా వహించడంగా చమత్కరించాడు.

ఆర్యా

గుంజతి మంజు మిళిందే
మా మాలతి! మౌన ముపయాసీః
శిరసా వదాన్య గురవః
సాదర మేనం వహంతి సురతరవః.

ఆటవెలది

మధుకరమ్ము లిట్లు మంజుల ధ్వనిసేయ
మాలతీ! యిదేమి మౌనముద్ర?
పరమదాతలైన సురభూజములు వీని
నౌదలను ధరించు నాదరమున.

ఇంతగొప్ప తుమ్మెదలని పడతిట్టిన సందర్భాలుకూడా భామినీవిలాసంలో ఎన్నెన్నో ఉన్నాయి. ఆరు కాళ్లున్నాయి కనుక తుమ్మెద పశువున్నర అని ఒకసారీ, దానిది మధుపజాతికనుక తాగుబోతులకి యుక్తాయుక్తవివేకం ఎక్కడ ఏడుస్తుందని మరొకసారీ తుమ్మెదలని ఘాటుగాతిట్టిన సందర్భాలు 'పండితరాయల బుజ్జగింపులు' అనే వ్యాసంలో చూచాం.

ఇక్కడ మరొక రకమైన నిందను చూద్దాం.

ఒకప్పుడు తుమ్మెద చాలా పరువుగా బతికింది. తీయమామిడిచెట్లమీద యథేచ్ఛావిహారం చేసింది. పద్మినీవనంలో దాగుడుమూత లాడింది. కదంబవృక్షాలమీద తూగుటుయ్యాల లూగింది. చెంగలువలతో రకరకాలుగా ఆటలాడింది. అటువంటి మధువ్రతం ఈనాడు వసంతోదయ సమయంలో ఇప్పకల్లు పీకలమొయ్యాతాగి దొర్లుతోంది. ఛీ ఛీ ఏమి పతనం!

ఒకప్పుడు బాగా బతికి, ప్రస్తుతం దుర్వ్యసనాలకు లోనై బొత్తిగా దిగజారిపోయిన వ్యక్తి నెవరినో మనస్సులో ఉంచుకుని చేసినకల్పన ఇది.

శార్దూల విక్రీడితం

మాకందే మధుపాన మంబుజకులే క్రీడా
కదంబద్రుమే
దోలాఖేలనకౌతుకం కువలయే
కః కో నవో విభ్రమః
యేనాకారిమధువ్రతేన సహసా
సోఽయం మాధూకే మధౌ
మాధ్వీకం పరిపీయ పీవరతను
ర్జీవత్యహో జీవనమ్.

శార్దూల విక్రీడితం

మాకందంబుల తేనె త్రాగి, నలినీ
మధ్యంబులం దాగి, డో
లాకేళీకుతుకంబునన్ కడిమి
చెట్లందూగి, చెంగల్వ పూ
రేకుం బాన్పుల జోగి, మాధవమునన్
భృంగంబిపీ! ఇప్పకల్
పీకల్ మొయ్యగ్రతాగి క్రొవ్వినదయా
వ్రీడావిహీనాత్మయై.

* * *

రాజహంస

వికసించిన బంగారుతామరపువ్వులలోని పుప్పొడి రాలి గుబాళిస్తున్న మానససరఃపయస్సులలో తన యౌవనమునంతనూ యథేచ్ఛగా గడిపిన ఒకానొక రాజహంస కాలం ఖర్మం కలిసిరాక, అక్కడినుంచి లేచి వచ్చి, ఒక పాడుపడ్డ చెరువును సమీపించింది. అందులోని నీళ్లు మురికిగా ఉన్నాయి. చెవులు చిల్లులు పడేలా బెకబెకమని అరుస్తున్నాయి కప్పలు. అంతటి మహాదశను అనుభవించిన మరాళనాయకుడు ఇటువంటిచోట ఈ కప్పలమధ్య ఎల్లా బతుకుతాడోకదా అని జాలిపడుతున్నాడు పండితరాయలు.

దేవేంద్రసభను పోలిన షాజహాను చక్రవర్తిగారి దర్బారులో అసాధారణ గౌరవాదరాలతో, సకలసంపదలతో జగన్నాథుడు తన యౌవనమునంతా గడిపేడు. 'ఢిల్లీవల్లభపాణిపల్లవతలే నీతం నవీనం వయః' అని గొప్పగా చెప్పుకున్నాడు. పండితరాజపదవీవిరాజితుడయాడు. గానశాస్త్రకోవిదుడుగా కనకాభిషేకాలు చేయించుకున్నాడు. యువరాజు దారాషకోకి ఆంతరంగిక మిత్రుడు, గురువు అయాడు. అంతలో ఔరంగజేబు షాజహానుని బంధించడమూ, దారాషకోను హత్య చేయడమూ హఠాత్తుగా జరిగిపోయాయి. ఇంక ఢిల్లీ దర్బారులో ఉండలేక, ఆచోటు వదిలేసి పండితరాయలు సంచారంచేస్తూ చిల్లరసంస్థానాలు చాలానే చూశాడు. రాజుని చూసినకళ్లు మొగుణ్ణిచూస్తే మొత్తుకోబుద్ధిఅయినట్లు ఆ అపండితులమధ్య అతడికి వెలపరం అనిపించింది. 'అరసికేషు కవిత్వ నివేదనం' అసహ్యమనిపించింది. ఇల్లాంటి బురదగుంటల్లో ఎల్లా బతకనూఅని దిగులుపడిపోయాడు.

పృథ్వి

పురా సరసి మానసే వికచసారసాళిస్ఖలత్
పరాగసురభీకృతే పయసి యస్యయాతంవయః
సపల్వలజలేఽధునా మిళదనేకభేకాకులే
మరాళకులనాయకః కథయ రే కథం వర్తతాం.

పంచచామరం

నిరంతర ప్రఫుల్ల దివ్యనీరజవ్రజస్ఖలత్
పరాగసౌరభప్రపూతభవ్యమానసంబునన్
మరాళనాయకుండుయౌవనమ్ము పుచ్చి యేగతిన్
చరింపగల్గునేడు భేకసంచరద్దదంబునన్?

ఇటువంటి రాజహంసకి కృతజ్ఞతా విహీనతను అంటగట్టి నిందిస్తున్నాడు.

ఓ మరాళనాయకా! ఈ సరస్సులో పెరిగిన కమ్మని తామరతూడులు కడుపునిండా మెక్కేవు. తియ్యనిచల్లనినీళ్లు తాగేవు. స్వేచ్ఛావిహారాలు చేసేవు. నీకు ఇన్నిసౌకర్యాలు కలుగజేసిన ఈ సరోవరానికి నీవు చేసిన ప్రత్యుపకారం ఏమిటి? మాటా పలుకూ లేకుండా ఏమీ ఎరగనట్లు అల్లా లేచిపోతావేమిటి?

వసంతతిలక

భుక్తా మృణాళపటలీ భవతా నిపీతా
న్యంబూని యత్ర నలినాని నిషేవితాని
రే రాజహంస! వద తస్య సరోవరస్య
కృత్యేన కేన భవితాసి కృతోపకారః

చంపకమాల

పరువపు తమ్మితూండ్లు కడుపార
భుజించితి, మూడు ప్రొద్దులన్
సరసిజసేవనమ్ము మనసారగ
జేసితి, తేటనీటిలో
తిరిగి యథేచ్ఛ దావితివి,
దీనికి ప్రత్యుపకార మీ సరో
వరమున కేమిచేసితివో
పల్కవదేమి మరాళనాయకా!

(ఇందులో ఉదాహరించిన తెలుగు పద్యాలు డాక్టర్ మహీధరనళినీమోహన్ అనువదించిన భామినీ విలాసం లోనివి.)

ఆవాహన

శ్రీ మాదిరాజు రంగారావు

బూదిచేసి సర్వం
ఆశించకు చూచేవని వసంతం
ఏ దిక్కునుంచి ఐనా
భావించకు వచ్చేనని నభోమణి.

మండేను క్షణాలు మంటలతో
చిత్రిస్తూ సంస్కృతీ దర్పణం
ఎగిరేను క్షణాలు రెక్కలతో
కొలుస్తూ జీవిత గగనం.

కళ్ళలో అంగార శిఖలతో
ఊహలో కంకాళ మాలతో
తలలో విప్పిన పడగలతో
గతిలో తూగే మృత్యువుతో
నాల్కనుండి జారే సూదులతో
వచ్చేవా? వీధిలోబడి శిశిరమ్మా.

చెట్టుపై గుట్టపై నీటిపై
నింగిపై అవనిపై సూర్యతేజం వలె
ఊహలో మాటలో వర్తనలో
రావాలి జడత్వం పోయే నవత్వం.

గాలి వెలుగు నీరు
అయినట్లు శక్తిరూపాలు
మాట ఊహ వర్తన
గుర్తించి శక్తి రూపాలుగా.

బ్రతుకులో మరుగునబడి
ఇంతకాలం దాగిన ఆనందం
రావాలి పొంగి ఎదనుండి
మనసులో అట్టడుగునబడి
ఇంతకాలం దాగిన సత్యం
రావాలి చీల్చుకొని తిమిరం

వినేవా? సంగీతం విన్నదే
చూచేవా? దృశ్యం చూచిందే
విను, సంగీతం వినంది
కను, దృశ్యం చూడంది
అంతర్ముఖుడవై, హృదయంలో,
శాంత మనస్కుడవై, ముఖంలో.

వాన జల్లు మంచు తెరలు
ఆకు రాల్పూ, చివురు తాల్పూ,
ఊహాసృష్టి, కార్యరూపం
ఆగదేదీ స్థితి చలనంలో.

సంసిద్ధుడవుకా ప్రతిబింబుతువుకూ
నీలోని గాఢశక్తికి ప్రతీకగా.

ఉంది చలనం ప్రకృతిలో
ఉంది మరణం అంతటా
జీవితానికి ముందు రూపం
పరివర్తనకు ముందు వికృతి

బూదిచేసి సర్వమూ
ఆశించేవా వసంతం ?

తూరుపు దిశనుండే సూర్యుడు
తక్కిన దిక్కుల్లో ఆతని రాగం
ఆవాహన చేసుకో నీలోకి
శిశిర నాశన సూర్యతేజం !

మాండలిక భేదములు - ఒక పరిశీలన

శ్రీ నేతి అనంతరావు శాస్త్రి

దక్షిణ ఆసియా భాషల మాండలిక భేదముల యనుశీలనము విషయమై యింతవరకు జరిగిన కృషి తక్కువయే యని చెప్పవచ్చును. భారతదేశము, పాకిస్తాన్, సిలోన్‌లలో అధిక ప్రజానీకము మాట్లాడుకొనుభాషలలో ప్రాంతీయమైనటి యు, సాంఘికస్థితిగతులలో పరస్పరసంబంధము కల్గి నట్టియు మాండలిక భేదములు (Dialects) కలవు. అయా భాషలు లోకమున వ్యవహారసిద్ధములైన భాషకంటె తమకుగల విశిష్ట సాహిత్యరూపముల మూలముగా కొలదిగనో గొప్పగనో వేఱై యున్నవి.

భాషాశాస్త్రమున ప్రధాన సమస్యలలో చర్చింప దగినది యొకటి యున్నది. అది యేమనగా భాషను శాస్త్రీయముగా విభజించి, వర్గీకరించి యిది యీ ప్రాంతమునకు చెందినదని నియమించుట (కట్టు బాటు వేయుట) ఎట్లు అనునది: తెలుగునుగాని తమిళమునుగాని ఒక ప్రత్యేక భాషగా గుర్తుపట్టుట ఎట్లు ? తెలంగాణాలోని మాండలికమైన (Dialect) తెలుగును, రాయలసీమమాండలికమైన తెలుగును వేర్వేరు భాషలుగా ఏల పరిగణింపరాదు ? ఈ ప్రశ్నకు సమాధానము చెప్పవలెనన్న భాష యనగా నేమో మనము నిర్వచింపవలసి యున్నది. భాష యనగా—కొన్ని ప్రధాన లక్షణముల నాధారముగ జేసి కొని కొన్నికట్టుబాట్లకు లోనై యుండు మనుష్య సమూహము పరస్పరము సహకరించుకొనుట కను వుగా చేసికొను శాబ్దిక సంకేతముల వ్యవస్థ అని యొక నిర్వచనము. పరిశీలించి చూడగా ఇందులో నంత సామంజస్యము కన్పించుట లేదు. ఒక సంఘమునకు చెందిన మానవ సమూహము రెండు భాషలు మాట్లాడరనిగాని, రెండు వేర్వేరు సంఘము లకు చెందిన మానవసమూహము ఒక్కభాషను మాత్రమే మాట్లాడరనిగాని మనము ఖండితముగా చెప్పలేము. దీనినిబట్టి వేర్వేరు గ్రంథకర్తలు దీని విషయమై చేసిన నిర్వచనములను మనము విచారింప వలసియుండును.

ఒక భాషలో అనేక మాండలికములు ఉండ వచ్చును. ఆధునిక వర్ణనాత్మకవిధానము (Modern Descriptive Techniques) ననుబట్టి ఒక భాష నంతను మనము ఇదమిత్థమని నిర్ధారణ చేయలేము. కాబట్టి ఈ సందర్భముననే హారిస్ (Harris) అను నతడు ఇట్లు చెప్పుచున్నాడు. వర్ణనాత్మక మైన భాషాపరిశోధనకు అనువైన రంగములు ఒక భాషగాని, ఒక మాండలికముగాని కావచ్చును. ఈ అభిప్రాయము బ్లాక్ Block) అను నాతనికి అంత సంతృప్తి కల్గింపలేదు. అతడు దీనిని వ్యక్తిగత మాండలికము (Idiolect) అనుపేరులో వ్యవహ రించెను. ఒక వ్యక్తి ఉచ్చరించుటకు వీలైన సర్వ శబ్దరాశియు భాషయే. ఈ నిర్వచనములన్నియు, వానిని రూపొందించిన గ్రంథకర్తలకుకూడ అనుగత మైనట్లుగానే, లోపరహితములైనవని కావు. వైయక్తిక వైలక్షణ్యములను కలియగలుపుకొని భావవ్యక్తీ కరణమునకు సామాజికముగ సహకరించు సాధనము భాషయని చెప్పవచ్చును. ఇద్దరు వ్యక్తుల మాట తీరులలో ఒకే విధముగా నుండవచ్చును. ఒకే వ్యక్తి మాటతీరులు (styles) భిన్నభిన్నకాలములలో వేర్వేరుగా నుండవచ్చును. ఒక వ్యక్తిమాట తీరు గాని, అనేక వ్యక్తుల మాటలతీరులుగాని ఇదే విధముగా ఉండును మఱొక విధముగా ఉండదు అని నిర్ధారణచేసి చెప్పుటకు వీలులేదు.

తెగ లేక ప్రభేదము (Variety) అనగా ప్రస్తుతము ఉపలభ్యమానములగు ఐకకాలిక వర్ణనా విధానములనుబట్టి విషయవిభజనచేయగా సజాతీయమని తేలిన వాగ్రూపముల సంపుటి. మానవుల యా వాగ్రూపము--అందలి మూలభూతమైన యంశములు (Elements) వాని వ్యవస్థలు లేక ప్రక్రియలు, సామాన్యభావప్రకటనమునకు అనుగుణములగు సందర్భము లన్నింటిలో—వ్యవహరించుటకు తగిన యర్థపరిణామసంపద కల్గియుండవలెను. భాషలోని విభేదముల నంగీకరించునపుడు, ఏదోయొకహద్దు లేక కట్టుబాటు (ఒకదానినుండి మఱియొకటి వేఱుచేయునది) ఉండవలయును. రెండువిధములైన మానవ భాషలు—ఒకవిధమైన భాషను మాట్లాడు వ్యక్తి మఱొకవిధమైన భాషను మాట్లాడు వ్యక్తితో మాట్లాడునపుడు ఒకరిమాట మఱియొకరికి పూర్తిగా అర్థమైనచో ఆ రెండుభాషలు అభిన్నములే (ఒకటే) యని చెప్పవచ్చును. దీనిని ఒక్కసమాసములో పరస్పరావగాహనావకాశము అని చెప్పవచ్చును.

ఈ పరస్పరావగాహనావకాశమును నిర్దేశించుటలో మనకు కొన్ని చిక్కులు వచ్చును. ఒకవంక ఒక భాషకు సంబంధించిన ధ్వని సంబంధమైనట్టియు (Phonological), వ్యాకరణప్రక్రియ లేక భాషానిర్మాణ వైఖరికి చెందినట్టియు సాదృశ్యమునకు (Similarity), పరస్పరావగాహనావకాశమునకును (Mutual intelligiblity) ప్రత్యక్షముగా (Direct) పరస్పరసంబంధమున్నట్లు కన్పించదు. పరస్పరావగాహనావకాశము లేకున్నను రెండు తెగలకుచెందిన భాషలను ఇతర కారణములను పురస్కరించుకొని వానిని ఒకేభాషగా పరిగణించుటకూడ కలదు. ఇందులకు విపరీతములగు నిదర్శనములుకూడ లభింపకపోవు. జర్మనీలో ఒక కోనలో మాట్లాడు భాషకును, మఱొకమూలకోనలో మాట్లాడు భాషకును పరస్పరావగాహనావకాశము తక్కువ. అయినను ఆ రెండింటిని ఒకే జర్మనుభాషగానే పరిగణన కలదు. అన్ని భేదము లున్నప్పటికిని వానికి ఒకే భాషగా పరిగణన యెట్లు?—ఇది యిట్లుండగా దీనికి విరుద్ధమైన నిదర్శనముగూడ కన్పించుచున్నది. రెండుభాషలమధ్య పరస్పరావగాహనావకాశము ఎక్కువగా ఉన్నను వానిని వేర్వేరు తెగల క్రింద పరిగణించుట సంభవించుచున్నది. డచ్, జర్మన్ భాషలే యిందుల కనువగు నుదాహరణములు. మఱి వేర్వేరు భాషలను వర్గీకరించుట వేనినిబట్టి చేయవలయును? ఒకభాష, మఱియొకభాషనుంచి పునర్నిర్మితమైన మూలభాషకు చెందిన కొన్ని ధ్వనిసంబంధమైనట్టియు (Phonological), రూపాత్మకమైన (Morphological) లక్షణములను ప్రతిపాదించుటలో విశేషముగ భేదించుచో—చారిత్రిక పరిణతి (Historical Development) లోని విభేదమును బట్టి ఒక భాషను మఱియొక భాషనుంచి వేఱుపఱచి చెప్పవచ్చును. రెండుభాషలమధ్యగల చారిత్రక సంబంధమును పరిశోధించునప్పుడు—ఆ రెండు భాషావర్గముల (Language Communities) నడుమగల సాంస్కృతికసంబంధమునకు చెందిన కొన్ని యంశములను మనము గ్రహింప గలము.

ఒకభాషలో పెక్కు తెగలు లేక ప్రభేదములు (Varieties) ఇమిడి యుండవచ్చును. అవి ఆరోపితమైన (Superposed) ప్రభేదములుగను, ధ్వనిసంబంధమైన, వ్యాకరణసంబంధమైన లక్షణములతో సమిత సాదృశ్యమును కలిగినవిగను, పరస్పరావగాహనావకాశముతో కూడిన ప్రభేదముగను ఉండవచ్చును. ఈ నిర్వచనమున ఒకభాష అనేకములైన విభేదములను కలిగినటుల గుర్తించుచున్నాము. ఈ ప్రభేదము లేక తెగ (Variety) అనగానేమి? మాండలికములును (Dialects) ఇవియు (varieties) ఒకటేనని యనవచ్చునా? మాండలికము అనుపదమును విస్తృతార్థమున వాడుటకలదు. మాండలికమనగా నిట్లు నిర్వచింపవచ్చును. ఒకభాషకు చెందిన తెగగాని అనేకములైన తెగలుకాని కలసియున్నసంపుటియే (set) మాండలికమని చెప్పవచ్చును. భాషలకు చెందిన సమూహములలోగాని (Linguistic groups) భాషలకు చెందని సమూహ

ములలోగాని (Non-Linguistic groups) ఈ మాండలికమొక భాగమై యుండును. ఈ మాండలిక పదమునకు సంబంధించిన భావన ఒక తీరుగా లేకపోవుటవలన భాషాశాస్త్రవేత్తలు, మాండలికమును ఒక ప్రత్యేకభాష యను దృష్టిలో వ్యవహరించుచు ఆ భాషలోవాని వర్గీకరణము నిమిత్తమై యుపయోగించిన చిహ్నములను విశదీకరించి వర్గీకరించు బాధ్యత కల్గియున్నారు. కాబట్టి భాషలోని ఈ ప్రభేదములన్నింటిని మనము మాండలికములని చెప్పలేము. ఒక ప్రత్యేకమైన భాషాలక్షణమునకు వినియోగించుట కనువగు పరిమితులు గల్గియున్న అవధియే మాండలికవిభాజకరేఖ (Isogloss) అను పేరుతో వ్యవహరింపబడుచున్నది. ఈ మాండలికములు, భాషను మాట్లాడు ప్రదేశమును విభజించునట్టి మాండలిక విభాజకరేఖ (Isogloss) ల సంపుటుల ననుసరించి వర్గీకరింపబడును. ఆయా భాషలు మాట్లాడు దేశముల విభజనకును, భౌగోళిక విభజనకును సంబంధము ఏర్పడినట్లు చెప్పవచ్చును.

భౌగోళిక పరిస్థితులు :

(Geographical conditions)

భాషలోని మాండలికభేదముయొక్క విస్తృతి స్వభావమును రెండు ప్రధానములైన యంశములను బట్టి చెప్పవచ్చును 1. భావప్రకటనలోని గాఢత్వము 2. వక్తయొక్క ఆంతరంగిక వైఖరులు. భాషలోని ప్రభేదములకు ఈ రెండే ప్రధాన హేతువులని చెప్పవచ్చును. తక్కిన విషయముల సంగతి యటుంచి భావప్రకటనలోని గాఢత్వమునకు సంబంధించినంత వరకు, ఈ భావప్రకటనలోని గాఢత్వ మెంతహెచ్చుగా నున్న; ఆ భాషలోని ప్రభేదములు అంతతక్కువగా నుండును. ఈ గాఢత్వము తక్కువగాఉన్నప్రదేశమున మాండలిక విభాజికరేఖ (Isogloss) ప్రసరించును. ఉదాహరణకు : 'పంటలు పండనిభూమి'అను నర్థమున వాడబడు 'దుబ్బ'అను శబ్దమునకు మాండలిక విభాజికరేఖను మనము తీసికొందము. ఈ పదము ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణాప్రాంతములో వ్యవహారములో ఉన్నది. తక్కిన దేశభాగములో ఈ పదమునకు 'తువ్వ'అనుపేరుతో మార్పుపొంది వ్యవహారములో నున్నది. 'దుబ్బ'అను పదమునకు మాండలిక విభాజిక రేఖ, మహబూబ్‌నగర్‌జిల్లాలో 'కొసిగి'ప్రాంతమునుండి మొదలగును. ఇది తెలంగాణా ప్రాంతములోనిది. నల్గొండజిల్లాలోని 'ముంగొల్లు' ప్రాంతముమీదుగా, ఖమ్మంజిల్లాలోని 'లంకపల్లి'ప్రాంతముమీదుగా పోవును. ఈ గీతకు సంబంధించిన ఉత్తరభాగము 'దుబ్బ'అని మాట్లాడబడు భాగమనియు, ఇంకొక భాగములో పైమాటకు బదులుగా 'తువ్వ'అని ప్రయోగములో నున్నదనియు ఈ మాండలిక విభాజికరేఖ నిరూపించును. ఈ మాండలిక విభాజికరేఖద్వారా మ్యాపులో (పటము) భాషలోని మార్పులు సూచింపబడును. భాషలోని మార్పులు ఒకేతీరున ఉండవు. ప్రతిస్థాయిలోను, సమానముగా యీ మాండలిక విభాజికరేఖ ప్రసరింపదు. దీని ప్రసరణములో కొన్నిసంపులు మధ్య మధ్యలో నుండవచ్చును. మహబూబ్‌నగర్‌లోని 'కొసిగి' ప్రాంతమునుంచి వెనుకటి మాండలిక విభాజికరేఖ బయలుదేరినట్లు గమనించితిమి. మరొక ఉదాహరణను గైకొందము. 'అనుపేడ' తెలంగాణా ప్రాంతములో వ్యవహారములోనుండి, తక్కిన ఆంధ్రదేశములో 'పేడ' అని వ్యవహరింపబడు మఱొక పదమునకు మాండలిక విభాజికరేఖను గమనింతము. 'పెండ'కు సంబంధించిన మాండలిక విభాజికరేఖ కర్నూలుజిల్లాకు చెందిన 'పుచ్చకాయలమాడ' అను ప్రాంతమునుండి బయలుదేరును. దుబ్బ అను పదమునకు చెందిన మాండలిక విభాజికరేఖ ఎక్కడ ప్రారంభమైనదో ఆ 'కొసిగి' ప్రాంతమునకు దక్షిణమున 100 మైళ్ల దూరమున నీ ప్రదేశము ఉన్నది. అనేక మాండలిక విభాజికరేఖలు కలిసి ప్రసరించు భాషాప్రాంతమును మనము విభజింపవలసి యుండును. ఒక భాషను మాట్లాడు ప్రాంతమునందలి భాషలోని మాండలికములకు చెందిన భౌగోళిక విభాగమును చూపునది మాండలిక పద విస్తృతి ప్రదర్శకపటము (Dialect-Atlas).

ప్రపంచమున నితర భాగములలో మాండలిక ములను సూచించు అట్లాసులను తయారు చేయుటలో విస్తృతీకరింపబడిన విధానములన్నియు దక్షిణ ఆసియాలోని మాండలిక శాస్త్ర పరిశీలనములో ఉపకరించుటకై లభ్యమగును.

సాంఘిక మాండలికములు :

(Social Dialects)

ఒక భాషలోని భౌగోళికభేదము లట్లుండగా మన మింకొక తెగకుచెందిన మాండలికములను చూచుచున్నాము. సాంఘికములైన మానవ సమూహముల ననుసరించి కొన్ని ప్రభేదములు కలవు. ఒక వర్ణమునకు చెందిన ప్రజలు మాట్లాడు తీరునకును, మఱొక వర్ణమునకు చెందినవారు మాట్లాడు తీరునకును భేదము కలదు. ఆధునికమైన భాషాశాస్త్రపరిజ్ఞానము లేని వెనుకటితరములవారుకూడ ఈ మాటల తీరులలోని భేదములను బాగుగా గుర్తించిరి. మన్నారుదాస విలాస మను యక్షగాన నాటకములో 18వ శతాబ్దమున వేత్వేరు కులములవారు వ్యవహరించిన మాటలలోని భేదములు యీ విధముగ గుర్తింపవచ్చును.

1. బ్రాహ్మణులు మాట్లాడుతీరు : 'హోయి వుండరోయి, యిషుబడి ఉషుబడి యిటువంటి మాటలు నగర బడె. నాయునా' (అగు, అగు-- మన నోరుదాటి యీ మాటలు నలుగురి నోళ్లలోపడినవి.) 'ఇషుబడి, ఉషుబడి'—అనుమాటలలోని తేడాను గమనింపవచ్చును. బ్రాహ్మలకంటె వేఱైన వర్గమువారు ఈ మాటలనే 'ఇటుబడి— అటుబడి'— అని వ్యవహరింతురు. బ్రాహ్మణేతరుల మాండలికములోని 'ట' కారమునకు, బ్రాహ్మణుల మాండలికములోని 'ష' కారమునకునుగల భేదమును మనము గుర్తింపకపోము.

2. గొల్లకాపరి మాట్లాడుతీరు:—'హారెహారె ఆ బాపణ్ణీ యేల వాకిలి విడిస్తివిరా; ఆ ముచ్చు బాపండురాని కాళ్లె యిరగ్గొట్టిగాని' (ఆ బ్రాహ్మణుని ఎందుకు వాకిలిలోనికి రానిచ్చితివి? ఆ దొంగబ్రాహ్మణుని యీసారి రానిమ్ము. కాళ్లు విరగగొట్టెదను) ఇక్కడ 'ఇరగ్గొట్టి' అన్నది 'విరగగొట్టి' అన్నదానికి బదులుగా వాడబడినది. ఇక్కడ 'వి' అను అక్షరమునకు 'ఇ' అని గొల్లకాపరి వాడిన అక్షరము గుర్తింపవచ్చును.

3. బ్రాహ్మణుల భాషకు మఱొక యుదాహరణము:—'హోరి వృద్ధగార్దభమా, నోవగలదంచున్న నెత్తినోరుబెట్టుక కూయవచ్చినాండవు. కపోలతాడనం శేతువో, త్వమేవగార్ధభః, త్వమేవశునకః; త్వమేవ సూకరః, తాళ రోయి యేల కూశేరు' (ఓరె గాడిదా! నీకొక్కనికే నోరున్నట్లు వాగుచున్నావు. నీ చెంపమీద కొట్టనా, నీవే గాడిదవు, కుక్కవు, పందివి, ఓపిక పట్టు—వదరుబోతుకాబోకు) —. ఒక బ్రాహ్మణుడు మఱొక బ్రాహ్మణుని నిందించు విధానమిందు గోచరించుచున్నది. ఇది సంస్కృతవాక్యరూపములతో నిండియుండును. ఒక్కొక్కప్పుడు సంస్కృత ఉపసర్గాదులతో కూడియుండును. తెలుగులో లోకవ్యవహారమున నటువంటి మాటలతీరు ఉండదు.

బ్రైట్ (Bright) అను నాతడు కన్నడదేశమునందలి బ్రాహ్మణుల మాటతీరునకును, బ్రాహ్మణేతరుల మాటతీరునకునుగల భేదమును ఎత్తిచూపును. ఆ బ్రాహ్మణుడు, బ్రాహ్మణేతరుడు ఇద్దరూ పాశ్చాత్యవిద్యను కళాశాలలలో చదివినవారే అయినను భాషావిషయకముగా ఆ భేదము తొలగిపోలేదు. బాహ్యావాతావరణ ప్రాభవమునకు కొందఱు లొంగిపోవుట, కొందఱు లొంగకపోవుట అనునది కలదు. బ్రాహ్మణేతరుల ప్రభేదము కన్నడ వ్యాకరణమున ననేకమైన మార్పులను తెచ్చినది. అట్లుగాక, బ్రాహ్మణుల ప్రభేదము, సాహిత్య భాషా ప్రాభవము వలన కన్నడ ప్రజల భాషాపద్ధతిపై ఎక్కువ మార్పులను తేలేకపోయినది. కన్నడ ప్రజల భాష సంస్కృతము వలన, ఆంగ్లభాషవలన, విశేషముగ మార్పుపొందినది. కన్నడ దేశమున ధార్వార్ జిల్లాలోని మాండలికమును

పరిశీలించుటలో 'మెకార్మెక్' (Mecormack) స్పృశ్య – బ్రాహ్మణేతర—అస్పృశ్య — వర్ణముల మాటల తీరులలోగల మూడు తెగల భేదములను గమనించినాడు. ఈ మాండలిక భేదములను కుల ప్రభేదములని యనవచ్చును.

<u>శబ్దవిన్యాసవైఖరి, ఆరోపిత విభేదములు :</u>

(Style and Superposed varieties)

పై విభేదములు సాంఘిక, భౌగోళిక విభాగములకు చెందినవి. కాని ఒకే వ్యక్తి ఒక పరిస్థితిలో మాట్లాడు తీరునకును, మఱొక స్థితిలో మాట్లాడు తీరునకును భేదము కలదు. తన బంధువులతో మాట్లాడునప్పుడు ఒక తీరున మాట్లాడును, అదే బహిరంగోపన్యాసమున కుపక్రమించునపుడు భాష మఱొక తీరున ఉండును. దక్షిణ ఆసియా భాషలలో నీ భేదములు విశేషముగా కన్పించును. రాజకీయవాది ఉపన్యాసము చెప్పునపుడు తెచ్చిపెట్టుకొన్న గాంభీర్యములో ఆలంకారికముగా మాటాడుటకు ప్రయత్నించును. దక్షిణదేశభాషలలో ఈ తీరు విభేదములు అధికముగా కాన్పించును.



శాస్త్రీయ విజ్ఞాన ప్రచారం

శ్రీ పెమ్మరాజు వేణుగోపాలరావు

1. నిర్వచనం

అనుక్షణము వృద్ధిచెందుతూ పెంపొందుతూన్న శాస్త్రీయ విజ్ఞానాన్ని సామాన్యప్రజలలో ప్రచారం చెయ్యటం నేటి సమస్యలలో ఒకటి. ఇది ప్రపంచంలో అన్నిదేశాలలోను పరిష్కరించవలసిన సమస్య. ఆధునిక విజ్ఞానరంగంలో ముందడుగువేసి అత్యద్భుత రోదసీ విహార యాత్రలతో నూతన విజ్ఞానము చేపట్టుచున్న అమెరికా రష్యాలవంటి దేశాలలోనూ, మొన్న మొన్ననే ఈ విజ్ఞాన వీధుల వెలుగుచూసి ముందడుగు వేయ డానికి ఉవ్విళ్లూరుతూ, అభివృద్ధికయి ఆశయాలను అమర్చుకొని క్రొత్తపంథాలను తొక్కడానికి తహతహ లాడుతున్న ఆశియా, ఆఫ్రికాలలోని అనేక దేశాల లోనూ—ఈ సమస్య వుంది. కాని ఈ సమస్యయొక్క స్వరూపము, పరిష్కారమార్గము—ఆయాదేశాల అభి వృద్ధిదశనుబట్టీ, ముఖ్యంగా అక్షరాస్యత, పారిశ్రామి కత, సాంఘికవాతావరణాలనుబట్టి ఉంటాయి. 'శాస్త్రీయ విజ్ఞాన ప్రచారము' అనే పదజాలాన్ని ఏదో ఎలక్షను రోజులలో గోడలమీదవ్రాసే స్లోగను లాగ వాడకుండా, ఒక నిర్దిష్టమయిన అర్థాన్ని ఆపా దించటానికి ముందు ప్రయత్నిద్దాం.

సాంకేతిక, శాస్త్రీయ విద్యలు

తెలియని విషయాలు తెలుసుకోవడం, లేక జిజ్ఞాస, మానవునికి సహజమయినది అని గుర్తిస్తే విజ్ఞానసాధన ప్రతివ్యక్తికీగల అభిలాషలలో ఒకటి అనడం అతిశయోక్తికాదు. కాని జీవితావసరాలకి అవసరమయిన విజ్ఞానం గణించటం అభిలాషమాత్రమే కాదు, తప్పనిసరి. 'నాలుగురాళ్లు సంపాదించి పొట్ట పోసుకోవటానికి' ప్లైపిష్టుగా ఉద్యోగంచేసే వ్యక్తికి 'ప్లైవుమిషనుల వృత్తాంతము' అనక్తితో చూడగానే విద్యకాకపోయినా తప్పనిసరిగా నేర్చుకోవలసిన సాంకేతిక విద్య (Technical Knowledge). మెకానిక్ మెషినుల వివరాలు నేర్చుకుంటాడు. వాస్తుశాస్త్రజ్ఞుడు భవన నిర్మాణ వివరాలను నేర్చుకుంటాడు. ఈ సాంకేతిక విద్యలు వృత్తిసంబంధమయిన విద్యలు. ఆయావృత్తు లలో నిపుణత సాధించదలచినవారు ఆ వృత్తులకు సంబంధించిన సాంకేతిక విద్యలు అభ్యసిస్తారు. నాగరి కత నేర్చిన ప్రతిసంఘంలోనూ సాంకేతిక విజ్ఞానం సరఫరా కావటానికి సంస్థలున్నాయి. సమాజవ్యవస్థను నిలబెట్టి పోషించే వృత్తులలో అనేకమంది పాల్గొనాలి. అందుకనే ఈ అత్యవసర విజ్ఞానాన్ని నేర్పటానికి విద్యావిధాన పద్ధతులు కల్పించి నడిపించటానికి సమాజం చారిత్రకంగా బాధ్యత వహిస్తోంది. కాని చరిత్రలో ఎన్నడూ ఈ సాంకేతికవిద్యలు అందరూ అభ్యసించవలసినవిగా పరిగణింపబడలేదు. నేటి ప్రజా స్వామికయుగంలోకూడా ఈ సాంకేతికవిద్యల సాధన, అభ్యాసము సంఘపు అవసరాలనుబట్టి నిర్ణయింప బడుతున్నాయి.

అయితే మానవునికి ఈ సాంకేతికవిద్యలు సుల భంగా అబ్బలేదు. ప్రకృతిని మలచి తనకు కావలసిన తీరులో పరిసరములను సరిదిద్దుకోటానికి ఉపయోగ పడుతున్న ఈ సాంకేతికవిద్యలు—ప్రకృతి రహస్యాలను క్రోడీకరించి, ప్రకృతి వ్యాపారాలను సూత్రబద్ధంగా వర్ణించడానికి నిత్యం జరుగుతున్న అపారమయిన కృషి ఆధారంగా—పెరిగాయి. ఈ సూత్రీకరించబడిన ప్రకృతి స్థితిగతుల వర్ణనయే శాస్త్రీయ విజ్ఞానము. ఇది సాంకేతికవిద్యల పెంపుకి మూలాధారము.

శాస్త్రీయత - సాంకేతిక

శాస్త్రీయవిజ్ఞానంయొక్క ప్రభావాలలో ముఖ్యమయినది మానవునకు అది కలిగించే నూతన మనస్తత్వము. మూఢనమ్మకాలను మరపించి, మానస జడత్వాన్ని సడలించి, మనోభావపరంపరలకి స్వేచ్ఛను రుచిచూపించి నూతనదృక్పథానికి దారితీస్తుంది. ప్రకృతిపై ఊహలకందిన ప్రతిప్రమేయమును (Hypothesis) ప్రయోగాత్మకమయిన పరిశోధన ఆధారంగా నిరూపిస్తేనేగాని సిద్ధాంతంగా పరిగణింప

రాదన్న ఆంక్షకు బద్ధుడై ప్రవర్తించేవాడే శాస్త్రజ్ఞుడు. అంతేకాదు. కొత్తపరిశోధనల ఫలితంగా సేకరించిన సంగతులు పాతసిద్ధాంతముల ముప్పుకు దారితీసినా అనుమానించక మరొక ప్రమేయమును ప్రతిపాదించి సిద్ధాంతీకరించడానికి శాస్త్రజ్ఞుడు వెనుదీయడు. ఇట్టి శాస్త్రీయదృక్పథము (Scientific Perspective) శాస్త్రీయ విధానము (Scientific Procedure), శాస్త్రీయ వైఖరు (Scientific Attitude) లను ఒక్కమాటలో 'శాస్త్రీయత' అందాం. ఈ శాస్త్రీయత, శాస్త్రీయ విజ్ఞానములు ఒకదానినొకటి పెంపొందించుకుని నూతన విజ్ఞానమునకు దారితీస్తూవున్నవి.

మనము నేర్చిన ఈ శాస్త్రీయ విజ్ఞానమును మన నిత్యజీవితంలో ప్రయోజనకారిగా మార్చుటకు కావలసిన విద్యలు సాంకేతికవిద్యలు. ఉదాహరణకు కార్యసాధకములగు పనిముట్లు తయారుచేయుట, రోగనివారకమగు మంచిమందులు కనిపెట్టుట, ప్రకృతిసిద్ధవస్తువులను పోషకములగు ఆహారపదార్థాలుగా మార్చుట, వినాశనకరమగు యుద్ధసామగ్రిని నిర్మించుట మొదలగునవి. ఇట్టి 'ఉపకరణ విద్యలు' (Applied Sciences) నేర్వనిదే ఏసమాజమునకు 'సాంకేతికత' (Technology) లబ్బదు. కాని సాంకేతికత యొక్క స్థాయి లేక హెచ్చుతగ్గులు సమకాలిక శాస్త్రీయ విజ్ఞానముపై ఆధారపడిఉంటాయి. అంతేకాక పరిశోధనకై చేయుప్రయోగములు మనకు లభ్యమగు పనిముట్లు వస్తుసామగ్రిమీద ఆధారపడి ఉంటాయి. కనుక సాంకేతికత పెరిగినకొలది శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధికి సులువయిన పద్ధతులు లభిస్తాయి. శాస్త్రీయ, సాంకేతికవిజ్ఞానముల మధ్యగల భేదాలు,1 వాటి పరస్పరసంబంధం గుర్తుంచుకొనవలసిన విషయం. లేనిఎడల అభివృద్ధి కార్యక్రమములు సరియైనదారిని పడకపోవటమేగాక, లేనిపోని నిరాశ నిరుత్సాహాలకు దారితీయవచ్చు.

సమాజపు అవసరాలు, ఆర్థిక స్తోమతలను బట్టి ప్రభుత్వాలు, సంఘాలు సాంకేతిక విద్యలను నేర్పటానికి ఏర్పాటులు చెయ్యటమేకాక, సాంకేతికతను ఎంత తొందరగావీలయితే అంత తొందరగా సాధించడానికి ప్రయత్నిస్తాయి. శాస్త్రీయత ఉన్నా లేకపోయినా, ఆధునికత నిదివరకే సాధించిన దేశాల కృషి ఫలితంగా లభ్యమవుతున్న 'రడీమేడ్' సాంకేతిక పద్ధతులను డాక్టరుగారిచ్చిన మందులాగ వాడటంకూడ జరుగుతుంది. సాంకేతికతముందా, శాస్త్రీయతముందా అన్న ప్రశ్న అనవసరం. సాంకేతికత ఎటువంటి వాతావరణంలోనైనా ప్రబలుతుందన్నది చారిత్రక వాస్తవమే గదా. ఫారోవాల పిరమిడ్లు, రోమనుల రోడ్లులు మొగలాయీల తాజ్‌మహలు, సోవియట్ల స్ఫుత్నికులు—సామాన్యప్రజలకు స్వేచ్ఛావాతావరణం కల్పించనవసరం లేకుండానే నిర్మింపబడ్డాయి. నేడు ఆధునికతకై ఆశిస్తున్న దేశాలన్నిటిలోనూ సాంకేతికత సాధించడాని కవసరమయినంతమట్టుకు శాస్త్రీయ విజ్ఞానం సరఫరా చెయ్యటానికి నిర్విరామంగా జరుగుతోంది కృషి. కాని ఈ ప్రయత్నాలు, ఏర్పాటులు కొద్దిమంది చదువు కోరినవారి నుద్దేశింపబడినవి. ప్రత్యేకశ్రద్ధతో కృషిచేస్తేనేగాని సామాన్యప్రజలకు ఈ శాస్త్రీయ విజ్ఞానము చేరే మార్గాలు లేవు. ఈ ప్రత్యేక కృషినే మనం 'శాస్త్రీయవిజ్ఞానప్రచారం' (Popularisation of Science) అని నిర్వచిద్దాం.

2. సామాన్యుని కెందుకీ శాస్త్రీయ విజ్ఞానం?

శాస్త్రీయవిజ్ఞానం సామాన్యప్రజల కవసరమా అన్న ప్రశ్నకి ముందుగానే నాలుగు మాటల్లో సమాధానం యిచ్చి ఆ సందేహమున్నవారిని సంతృప్తిపరచడం మంచిది.

ప్రజాస్వామిక పద్ధతులను అవలంబించిన ప్రతి సంఘంలోను సామాన్యుల సమ్మతి, ఆసక్తులను చూరగొనలేని ఏఅభివృద్ధి కార్యక్రమము సరిగా నడువదు కదా. అభివృద్ధి కార్యక్రమాలకు పునాదులయిన శాస్త్రీయ, సాంకేతికవిద్యలయందు సామాన్యప్రజలకు మక్కువ, అభిమానము కల్పించుటకు ఒక్కటే మంచిమార్గము.

సంఘపు అవసరాలకు సరిపడ పదిమందికే ఈ విద్యలు నేర్పి ఊరుకున్నఎడల వచ్చేముప్పు తీవ్రమయినది. ఈ కొద్దిమంది శాస్త్రజ్ఞులకు మిగిలిన ప్రజానీకానికిమధ్యగల వైజ్ఞానికము మానసికము అయిన

దూరాలు పెరిగి కుల, మత భేదములకంటె తీవ్రమయిన తారతమ్యాలకు దారి తీయవచ్చును. పై పెచ్చు ఈ శాస్త్రజ్ఞులు సామాన్యులకందని పండితబృందమై, వీరి ఆధిక్యతకు సామాన్యులు తలవొగ్గి భావదాసులవటంకూడ సంభవిస్తుంది. నేటి 'సాంకేతికత'కు మూలకారణమయిన శాస్త్రజ్ఞుడుకూడా అందరిలాంటి మామూలు మనిషే. కొండనించి దిగివచ్చిన దైవాంశ సంభూతుడుకాదు; మాయామాంత్రికుడూకాదు; తెలివితేటలు సూక్ష్మదృష్టిగల ప్రతివానికి శాస్త్రజ్ఞుడు కాగల అవకాశమున్నదని సామాన్యులు గుర్తించిననాడే శాస్త్రీయవిజ్ఞానాభివృద్ధికి కృషి సర్వవ్యాపకమయి అందుకు తగిన వాతావరణం ప్రబలుతుంది.

సామాన్యప్రజల ఆదరాభిమానాలు శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధికి తోడ్పడినవనడానికి చరిత్రక దృష్టాంతాలు చాలా ఉన్నాయి. మధ్యయుగపు యూరపులో పునరుద్ధరణ మార్గాలు వెతకబడుతున్న రోజుల్లో—అంటే రినైజాన్సు యూరపులో— శాస్త్రజ్ఞులు తమ విజ్ఞానాన్ని నాటి పండితభాష అయిన లాటినులోకాక, సామాన్యుల భాషలో పలికి, వ్రాసి, చర్చించడానికి ప్రయత్నించి, సామాన్యులకు వారి విజ్ఞాన పరిశోధనలయందు గౌరవాభిమానాలు కలిగేటట్లు చేశారు. టోలెమి, కోపర్నికసుల ప్రపంచ క్రమ, నిర్మాణ పద్ధతులు చర్చిస్తూ గలీలియో వ్రాసిన ముఖ్య గ్రంథము నాటి వ్యవహారికభాషయైన ఇటాలియను భాషలో మామూలు బాతాఖానీతీరులో వ్రాయబడింది.[2] సామాన్యుల దోహదంతో, విజ్ఞానుల పరిశ్రమతో మధ్యయుగపు సాంఘిక వాతావరణంనుంచి బయటపడిన యూరపు సాధించిన గొప్ప మార్పును అందుకనే 'శాస్త్రీయవిప్లవం' (Scientific Revolution) అన్నారు. ఈ శతాబ్దంలో అమెరికా, పశ్చిమ యూరపు దేశాలలో శాస్త్రీయ విజ్ఞానము పలువిధాలుగా సామాన్యుల కందజేయుటచేతనే ఆయాదేశాల ప్రభుత్వ యంత్రాంగములయిన కాంగ్రెసులు, అసెంబ్లీలు, పార్లమెంటులలో శాస్త్రీయ సాంకేతిక విజ్ఞానాభివృద్ధికి పెట్టుబడిపెట్టుటకు ముందు అనేకమయిన చర్చలు, అజమాయిషీలు, నిశిత పరిశోధనలు జరుగుతున్నాయి.

అసలు 'శాస్త్రీయత' శాస్త్రజ్ఞునికేకాదు ప్రతి మానవునకు ఉండవలసిన ప్రవృత్తి. స్వేచ్ఛాభావ తరంగాలు నిత్యసమృద్ధిగా ప్రజానీకమున ప్రవహించటం కంటె ప్రజాస్వామ్యానికి కావలసినది వేరొకటేమున్నది ? అంతేకాదు శాస్త్రీయతలేని సాంకేతికాభివృద్ధి మానవత్వపు విలువలపై ఆదరణ నెరుగని సాంకేతికనిపుణులను తయారుచేసి ప్రమాదములకు దారి తీయగలదు.

3. ప్రచార మార్గములు

విజ్ఞానప్రచారపు ఆవశ్యకతను అందరు గుర్తించినట్లయితే సమస్యాపరిష్కారమార్గంలో కొంత ముందడుగు వేసినట్లే. కాని, అపారమయిన ఈ శాస్త్రీయ విజ్ఞానాన్నిఅంతా సామాన్యుల కెలా అందజేయ్యటం ? ఒక శాస్త్రజ్ఞుని భాష మరొకనికి అర్థంకాని ఈ రోజులలో మామూలు మనుష్యులకి ఈ లేనిపోని ఆదర్శాలు కల్పించి వారిజీవితం కష్టాలపాలు చెయ్యటం ఎందుకు ?—అని నిరాశావాదులు వేసే ప్రశ్నలు చొప్పదంటు ప్రశ్నలుకావు; పరిశీలించి జవాబులివ్వ వలసిన ముఖ్యప్రశ్నలు.

ముఖ్యమయిన విషయం, సంఘంలోని అక్షరాస్యత విద్యాసంపదలనుబట్టి తగిన ప్రచార పద్ధతులను అవలంబించటం. ఇదివరకే అభివృద్ధిచెందిన దేశాలలో (Developed Countries) విద్యావంతుల సంఖ్య ఎక్కువయేగాక సామాన్యప్రజలలో నూటికి నూరుపాళ్లు చదువనేర్చిన వారుండటం సత్యదూరముకాదు. కాని అభివృద్ధి చెందుతున్న దేశాలలోను (Developing Countries), అభివృద్ధి నసలు ఎరుగని దేశాలలోను (Undeveloped Countries) విద్యావంతుల సంఖ్య చాల తక్కువయేగాక, నిరక్షరాస్యత ఎక్కువ. గమనించవలసిన తేడా మరొకటి వుంది. అభివృద్ధిచెందిన చాలాదేశాలలో శాస్త్రీయ విజ్ఞానపు సరఫరాకు ఉపయోగించే భాష ఆయా దేశాలలోని వాడుకభాషయే. మిగిలిన దేశాలలో వాడుక భాషలు శాస్త్రీయవిజ్ఞానమునకు ఉపయోగించుటకు ముందు మార్పులు చెందవలసిన అవసరం ఉంది. కనుక అమెరికా, జర్మనీలవంటి దేశాలలోని ప్రచార పద్ధతులకు ఇండియా, నైజీరియాలవంటి దేశాలలో అవలంబించవలసిన పద్ధతులకు తేడాలుండటం

సహజం. ముందు అభివృద్ధి చెందుతూన్న దేశాల విషయమై, ముఖ్యంగా మన భారతదేశాన్ని దృష్టిలో వుంచుకుని, చర్చిద్దాం.

శాస్త్రీయ విజ్ఞానము నాలుగు ముక్కలలో పిట్టకథలతో హరికథ బుర్రకథలలాగ టూకీగా చెప్పటానికి వీలయినట్లయితే యింతసమస్యే కాకపోవును. పదహారవశతాబ్దంలో యూరపులోని శాస్త్రీయ విప్లవంతో ప్రారంభమయి నేటివరకూ సేకరించబడిన ఈ విజ్ఞానం అపారమయినది. శాస్త్రజ్ఞులు తమ తమ ప్రత్యేకనిపుణతలతో నిత్యము సేకరిస్తున్న యీ విజ్ఞానము వివిధశాఖలుగా రూపొంది ప్రతిశాఖ ఒక ప్రత్యేకశాస్త్రంగా పరిణమించి వృద్ధిచెందుతున్నది. ఒక ప్రత్యేక శాస్త్రజ్ఞుడు ఉపయోగించే మాటలు (ఒకే భాషలో వున్నప్పటికి), కృషిచేసి నేర్చుకొనినగాని మరొకనికి అర్థం కాకపోవుట మామూలు అయిపోయినది. ఒక్క భౌతిక శాస్త్రములోనే నేడు డజనుకుపైబడి ప్రత్యేకభాగము లున్నాయి. ఈ ప్రత్యేక శాస్త్రజ్ఞులు ఒకరు చేస్తూవున్న పని మరొకరికి తెలియజేయడానికి తమలో తాము సంఘములుగా ఏర్పడి సమావేశములు జరుపుకొనటంకూడ నేడు ఆచారమయినది. అనేక పరిభాష (Technical Jargon) లతో కూడిన శాస్త్రీయ విజ్ఞానంయొక్క విస్తారత(Extent)యే దీని ప్రచారమునకు మొదటి యిబ్బంది. ఈ విజ్ఞానమంతటిని అందరికి తెలియజెప్పడం కఠినమయిన పనియేకాదు; ఒకతరంలో సాధించలేని పని ఆదర్శవాదులు దీనిని గుర్తించి కార్యక్రమాలను మొదలుపెట్టటం మంచిది. వీరిలో కార్యవాదులు నిరాశచెందక సాధ్యమయినంతవరకు సాధించడానికి సంసిద్ధులవటం సహజము. అయితే ఎంతవరకు సాధించగలము అన్న ప్రశ్నకు వీరందరు సమాధానం సాధించగలిగిననాడు వీరికృషి కొంత సఫలము కాగలదు. నిర్మాణాత్మకమయిన దృష్టితో ఈ ప్రశ్ననే మరొక రూపంలో అడుగుదాం. ఎవరికి ఏ స్థాయిలో కనీసం ఎంతవిజ్ఞానం సరపరా చెయ్యగలం ?

చదువనేర్చిన వారందరు ఈ విజ్ఞానమును స్వీకరించుటకు తగిన మేధాసంపత్తి గలవారు కాదు గదా. మన దేశంలో చాలమంది హైస్కూలుతో చదువులు ముగించినవారే. స్త్రీలలో అనేకులు బహుశః ప్రాథమిక పాఠశాలను దాటివుండక పోవచ్చును. సామాన్య ప్రజలల్లో చదువు సంస్కారములు ఒక స్థాయిలోకాక అనేకస్థాయిలలో ఉండటం మనదేశములోనే కాక యితర దేశాలలోకూడ కనిపిస్తూ వుంటుంది. ఈ ప్రజా బాహుళ్యమునందున్న విద్యా సంస్కారముల వివిధదశలను గుర్తించి ప్రచార మార్గము లవలంబించవలసి వుంటుంది.

ఉన్నతవిద్యల నభ్యసించినవారికి వారి కందుబాటులోలేని ప్రత్యేక శాస్త్రములను తెలియజెప్పుటకు సులభసరళిలో ఆంగ్లమందు రచనలు వ్రాసిన చాలును. ఆంగ్లభాషను వాడుతున్న పాశ్చాత్యదేశాలలో ఇట్టి రచనలు నిత్యము జరుగుతూన్నవి. కాని మన వాతావరణమునకు, సంస్కారమునకు అనుగుణంగా మనదేశీయులు వ్రాయుటం చాల అవసరం.

అధిక సంఖ్యాకులు ఆంగ్లభాష నెరుగరు కదా. హైస్కూలు చదువులు ముగించిన వారికికూడా ఆంగ్లభాషయందు ప్రవేశ ముండునేమోగాని ప్రావీణ్యత ఉండదు. కనుక ప్రాంతీయభాషలలో సులభమయిన వ్యావహారిక శైలిలో శాస్త్రీయ విజ్ఞానమునుగూర్చి వ్రాయుట ముఖ్య కార్యక్రమంగా పరిగణించవలెను. 'ప్రాంతీయ భాషలలోనే విద్యాబోధన జరుగుట ఉత్తమము, అత్యవసరమ'ని అందరు విశ్వసిస్తున్న యీ రోజులలో ఇట్టి కార్యక్రమమునకు అత్యధిక ప్రాధాన్యత గలదు.

చదువురానివారికికూడ ఈ విజ్ఞానమును రుచి చూపించుటకు ప్రత్యేక మార్గములు అవలంబించవలెను. చలనచిత్రములు, టెలివిజనులద్వారా ప్రకృతి రహస్య పరిశోధన మార్గములను, ప్రకృతి యందలి వింతలను సామాన్యులకు ముచ్చటగా, మనోల్లాస పూర్వకముగా తెలియచేయుటకు ప్రయత్నములు జరుగవలెను. కార్టూనుచిత్రము ఈ మార్గములో ఎక్కువ ఉపయోగపడు ననుట అతిశయోక్తి కాదు. ఇట్టి పద్ధతులను కనిపెట్టుటకు ప్రభుత్వములు, ప్రత్యేక సంఘములు తోడ్పడి ప్రోత్సాహము నివ్వవలెను,

పాఠశాలలో విద్యార్థులకు చదువు నేర్పునపుడు ఏ తరగతి స్థాయికి వీలుగా ఆ స్థాయిలో ప్రత్యేకముగా నిర్ణయింపబడిన సిలబసును అనుసరించుట మన మెరిగివున్న విషయమే. కాని సిలబసుబద్ధమైన పద్ధతులు సామాన్యప్రజలలో ప్రచారానికి పనికిరావు. సామాన్యుని ఉత్సాహము, ఆసక్తి చూరగొనే విషయాలను ప్రచారము ప్రారంభించాలి. ప్రతిసామాన్యుడు బి. ఏ. పట్టభద్రుడు నేర్చుకునే విషయాలన్నీ తేలుసుకోవాలనుకోవడం ప్రమాదం. సౌరకుటుంబగ్రహముల పరిభ్రమణం గురించి, వాటి పరిధులలోని వ్యత్యాసముల గురించి, ఆ వ్యత్యాసాలకు కారకమయిన సూక్ష్మ రహస్యాల గురించి సవిస్తరంగా వర్ణించడం ఖగోళ శాస్త్రంలో ఉత్సాహంగలవారు శ్రద్ధతో వినగలరు కాని సామాన్యునికి ఆ సంగతులపై విపులమయిన ఉపన్యాసం విసుగెత్తించవచ్చు. వ్యవసాయదారులందరకి వృక్షసామ్రాజ్య వర్గీకరణం (Classification) అంతనీ కుణ్ణంగా తెలియజెప్పడంకూడ సబబు కాదు.

సమకాలిక సంఘంలో ఉత్పన్నమయిన సమస్యలకు సంబంధించిన విజ్ఞానాన్ని ముందు అందజేయటానికి ప్రయత్నించాలి చంద్రమండలయాత్ర జరుగుతున్న రోజులలో తత్సంబంధమయిన విషయాలయందు సామాన్యుడు ఆసక్తి చూపవచ్చునుగనుక ఆ విషయాలను ముచ్చటించటం మంచిది. ఫెర్టిలైజరు ఫ్యాక్టరీ కడుతున్న ప్రాంతంలో దానికి సంబంధించిన బాగోగులు తెలియజేయటానికి ప్రయత్నించడం ఉపయోగం. స్టీలు మిల్లు కట్టడానికి మంచిచెడ్డలు ఆలోచించి రిపోర్టులు వ్రాయటంతోబాటు ఆ పరిశ్రమకి సంబంధించిన విషయాలనుగురించి సామాన్యునికి తెలియజెప్పటం మంచిది. అవసరం వచ్చినప్పుడల్లా వార్తాపత్రికల్లో ఈ విషయాలగురించి వ్యాసాలు పడుతున్నాయిగదండీ అనవచ్చు. కాని ఈ న్యూస్‌పేపర్ల రచనలు సాధారణంగా రాజకీయాలతో ముడిపడిపోతాయి. మనకు కావలసినది ఈ వంకన వీలయినంత ప్రాథమిక విజ్ఞానం అండ చెయ్యటం. ఈ ప్రాథమిక విజ్ఞానంవల్ల సామాన్యుని మనఃప్రవృత్తిలో 'శాస్త్రీయత'కి స్థానం దొరుకుతుందని మన ఆశ. అంతేకాని చిట్టాఆవర్జాలు వేసినట్లు, చరిత్ర పాఠాలలో రాజవంశాల వర్ణన చేసినట్లు బోలెడు సంగతులు సామాన్యుని వళ్లో వలకరించడంకాదు మన ఆదర్శం.

అపరిచితములైన శాస్త్రీయ భావాలు

ఈ ప్రచారమార్గాలలో మనం ఎదుర్కొనే సమస్య మరొకటుంది. తన వాతావరణానికీ, సంస్కృతికీ అపరిచితమయిన భావాలను అవగాహన చేసుకోవటంలో సామాన్యుడుపడే కష్టసుఖాలను జాగ్రత్తగా పరిశీలించవలసిన అవసరం చాలా ఉంది. ప్రపంచంలో ఎక్కడ ఏమిజరిగినా ప్రతివిషయం వెనువెంటనే అందరికి తెలిసే ఈ రోజుల్లోకూడా తన సంస్కృతికి అపరిచితములు, విరుద్ధములుఅయిన శాస్త్రీయ భావాలను విడమరిచి సామాన్యుని కందజేయగలమా అన్న ప్రశ్న మేధావులను బాధిస్తున్నది. పాశ్చాత్య సంప్రదాయములో పుట్టిపెరిగిన శాస్త్రీయభావాలు ప్రాచ్య దేశాల సంస్కృతితో సంకర్షించినపుడు కలిగే యిబ్బందులనుగూర్చి సవిమర్శకంగా ఆలోచనలు జరగాలి. నేపాలుదేశంలోని కొన్నిజాతులలో బడిపిల్లల శాస్త్రీయభావాల అవగాహనపై వారి సాంప్రదాయ బద్ధమయిన మనస్తత్వాల ప్రభావాన్ని గురించి డాక్టర్లు ఎఫ్ ఇ. డార్టు, పన్నాలాల్ ప్రధాన్ గార్లు పరిశోధనలు జరిపారు.[3] విద్యార్థుల సంప్రదాయము, సంస్కృతులకు వింతయైన క్రొత్తభావములను వారికి నేర్పేటప్పుడు జాగ్రత్తపడవలసి వుంటుందని వీరిలభిప్రాయము. అసలు భావసంకల్పన (Concept Formation) చిన్నతనమునుండి ఏవిధంగా జరుగుతుందో, ఎటువంటి భావములు (Concepts) ఏవయస్సులలో సులువుగా అవగాహన చేసుకోబడతవో—వాటిని గురించి మనస్తత్వశాస్త్రజ్ఞులు పరిశోధనలు జరిపారు. స్విస్ శాస్త్రవేత్త జీన్ పియాజె[4] (Jean Piaget) చిన్నపిల్లలలో భావసేకరణ(Abstraction)పద్ధతులను గురించి పరిశోధించి, తర్కబద్ధమై, గణితసూత్ర పరిమితమై క్రమబద్ధమయిన భావసేకరణ (Aquisition of Logico—Mathematical Concepts), పిల్లలలో మాటలు నేర్వకపూర్వమే ప్రారంభమవుతాయని నిరూపించివున్నారు. రష్యను శాస్త్రజ్ఞుడు వైగోట్‌స్కీ చిన

పిల్లలలో నిత్యజీవితానుభవంతోకూడిన దైనందిన భావాలు (Everyday Concepts) సేకరించుటకు, కృత్రిమమై రెడీమేడ్‌గా సరఫరా చెయ్యబడే శాస్త్రీయభావాల సేకరణకు మధ్యగల పరస్పర సంబంధాన్ని నిర్వచించి విద్యావిధానపద్ధతులలో ఈ విషయాలను గుర్తించుకొనవలయునని నిర్ధారణ చేశారు. అయితే శాస్త్రజ్ఞులు వయస్సువచ్చిన పెద్దలలో ఈ భావసేకరణ పద్ధతులను గమనించి పరిశోధనలు సలిపినట్లు కనిపించదు. నూతనమైన భావములను ఆకళింపుచేసుకొనడానికి కావలసిన మానసిక ప్రవృత్తి, ఆశ, ఆతురత, కుతూహలము అందరికీ సమంగా ఉంటాయనుకోవడం సమంజసం కాదు. ఈ విషయమై విద్యావేత్తలు పరిశోధనలు జరుపటం అవసరం.

4. ప్రచారకులు

ఇంతవరకు శాస్త్రీయవిజ్ఞానంయొక్క స్వభావము, దాని ఆవశ్యకత, దాన్ని ప్రచారము చేయటంలో గమనించవలసిన విషయాలు చర్చించాం. మరొక ముఖ్యవిషయాన్నికూడ చర్చించినగాని పరిష్కారమార్గము సులువుకాదు;—అది యీ విజ్ఞానమును సరఫరాచేయడానికి పూనుకొనే ప్రచారకుల సంగతి. న్యాయంగా ప్రచారానికి తగినవారు శాస్త్రజ్ఞులే. తాము నిపుణతతో పరిశోధనలు చేయుచున్న శాస్త్రవిభాగం గురించి శాస్త్రజ్ఞులుగాక మరెవ్వరు వ్రాయ్యాడుటకు సమర్థులు? చాలవరకు ప్రాంతీయ భాషలయందు సరఫరా కావలెనుకాబట్టి—వీరు కనీసము రెండు భాషలలో ప్రావీణ్యత పొందిఉండాలి: ఒక ప్రాంతీయ భాష, మరొకటి ఆధునికభాష ఏదయిన. ఈ శాస్త్రజ్ఞుల మనఃప్రవృత్తి, నడవడిక, ఆశయాలు, ఆదర్శాలు—ఒక మాటలో 'శాస్త్రజ్ఞుల సాంఘిక ప్రవర్తన' (Sociology of Scientists) ను గురించి తెలుసుకోవటం మంచిది. భారతదేశపు శాస్త్రజ్ఞులపై ప్రత్యేకముగా సాంఘికవేత్తలు పరిశోధనలు జరిపినట్లు కనిపించదు. అమెరికా, యూరపులలోని శాస్త్రజ్ఞుల సాంఘికప్రవర్తనగురించి జరిపిన పరిశోధనల ఫలితంగా అందరు శాస్త్రజ్ఞులకు వర్తించే కొన్ని సామాన్యలక్షణాలు మనకు తెలుసు.[6] శాస్త్రజ్ఞులు కూడా మామూలు మనుష్యులేకదా. అందుచేత సంఘపు సరిహద్దులు, పరిసరవాతావరణం వారి నడతపైకూడా తమ ప్రభావాన్ని చూపిస్తాయి. శాస్త్రీయ విజ్ఞానాన్వేషణలోగల ఒకసాంఘికనీతిని గుర్తించటం ముందు అవసరం. ముక్కుమూసుకుని, ఒంటరిగా తనకు తోచిన ఒక విషయాన్ని పరిశోధిస్తూ జీవితం గడిపే మనిషికాడు శాస్త్రజ్ఞుడు (కల్పిత కథలలో అలాంటి శాస్త్రజ్ఞులు కనిపించినప్పటికీ). ఒంటరితనానికి శాస్త్రప్రపంచానికి పడదు. శాస్త్రజ్ఞులమధ్య సంబంధాలు జాతిమత వర్ణ విభేదాలు లేకుండా ఒక అంతర్జాతీయతతో నిండి ఉంటాయి. మరొకనితో సన్నిహితత్వం, స్నేహబాంధవ్యం, ఉత్తర ప్రత్యుత్తరాలు లేకపోయిన ప్రతి శాస్త్రజ్ఞుడు, యితర శాస్త్రజ్ఞులు చేసే కృషిని నిత్యము గమనించడమే కాకుండా, నిరంతరము తన పనిలో, యీ కనిపించని యితర 'శాస్త్రజ్ఞుల కుటుంబము' యొక్క మెప్పుదలను పొందటానికి, ఆశిస్తూ ఉంటాడు. మరొక రకంగా చెప్పాలంటే ఈశాస్త్రజ్ఞుల కుటుంబం (Scientific Commuuity) శాస్త్రజ్ఞుల నడవడికపై తన ప్రభావాన్ని చూపిస్తూ ఉంటుంది.

ఈ శాస్త్రజ్ఞుల వర్గాలు అనేక తరహాలకు చెందినవి కావచ్చును. అంతర్జాతీయ సంస్థలు, స్వదేశ శాస్త్రజ్ఞుల సంఘాలు, ప్రత్యేక నిపుణుల సంఘాలు, ప్రభుత్వ యంత్రాంగాలు మొదలగునవి—యిట్టి కుటుంబాలు. ఈ కుటుంబాలలో చందాకట్టి సంపాదించిన సభ్యత్వం లేకపోయినా, యిది తగినది, మంచిది, ప్రోత్సహించదగినది—అని వీరుఒప్పుకున్న పని చెయ్యటానికి శాస్త్రజ్ఞుడు ప్రయత్నిస్తాడు. ఈ కుటుంబాలేగాక ఉద్యోగరీత్యా తనపై ప్రభావముగల సంస్థల ఆదర్శాలుకూడా అతని ప్రవర్తనకి కట్టుబాట్లు ఏర్పరుస్తాయి. శాస్త్రజ్ఞులకి, శాస్త్రజ్ఞుల కుటుంబాలకిగల అన్యోన్య సంబంధం దాని పర్యవసానాల గురించి విపులంగా మరొక చోట చర్చించబడింది.[7]

'శాస్త్రీయ విజ్ఞాన ప్రచారము' శాస్త్రజ్ఞుని ధర్మాలలో ఒకటి అని గుర్తించి, ఈ కృషిలో పేరెన్నికగన్నవారు ప్రత్యేకాదరణకు పాత్రులు అని శాస్త్రీయ కుటుంబం ఒప్పుకున్ననాడు సమర్థు

అయిన శాస్త్రజ్ఞులు ఈ పనికి సిద్ధులవుతారనటంలో అతిశయోక్తి లేదు. రష్యను యకాడమీ ఇటువంటి ఆదర్శమును అవలంబించటం కారణంగా 19 వ శతాబ్దం ప్రారంభంనుంచి రష్యాలో అనేక మంది శాస్త్రజ్ఞులు విజ్ఞానప్రచారంలో పాల్గొంటూ వున్నారు. నేడు ప్రపంచంలో మరి ఏ యితర దేశం లోను అంత భారీఎత్తున విజ్ఞానప్రచారం జరగటం లేదు. రష్యను ప్రజలలో శాస్త్రజ్ఞులయందు, వారి పరిశోధనలయందు గల గౌరవాభిమానాలకు ఈ ప్రచారమే కారణం. ఈ మధ్య జరిగిన అమెరికను భౌతికశాస్త్ర సంఘం సమావేశంలో ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త డాక్టరు వి. వైస్కాఫ్ మాట్లాడుతూ తాము చేస్తున్న పరిశోధనలు యితరులకు అర్థం అయ్యేటట్లు చెప్పటం శాస్త్రజ్ఞుల కర్తవ్యం. లేక పోతే రేపు కాంగ్రెసులో మన పరిశోధనలకి కావలసిన డబ్బు ఎలా వస్తుంది'—అని హెచ్చరించారు. మన దేశంలో ఎస్. ఎన్. బోసు బెంగాలీభాషలో శాస్త్ర విజ్ఞానాన్ని ప్రచారం చెయ్యటానికి చేస్తున్న కృషి శ్లాఘనీయమైంది. ఇటువంటి కృషి అత్యవసరమని, దేశాభివృద్ధికి దారితీస్తుందని, గౌరవప్రతిష్టలు తేగలదని, మనదేశంలోని కేంద్రరాష్ట్రప్రభుత్వాలే గాక విశ్వవిద్యాలయాలు మొదలుగాగల విద్యాబోధన సంస్థలు, శాస్త్రజ్ఞులసంఘాలు గుర్తించి తగు కార్యక్రమాలను అమలు జరుపేందుకు ప్రయత్నించటం చాలా అవసరము.

ప్రస్తుతం శాస్త్రపరిశోధన, బోధనా వృత్తులయందున్న నిపుణులు ఈ కృషికి నడుము కట్టుకొని తయారుకావడం అవసరము. తోటి ప్రజల విజ్ఞానాభివృద్ధికి తోడ్పడటం గౌరవపూర్వకమయిన పని అని గుర్తించి తమ పరిశోధనలతో బాటు విజ్ఞానప్రచారం చేయుటంకోసం తమ కాలమును వ్యయపరచడానికి సంసిద్ధులు కావడం చాల అవసరం. సంస్థల ఆదరాభిమానములు ప్రారంభదశలో లభించక పోయినను నిరుత్సాహపడక కార్యదీక్షతో కృషిచేయటం అత్యవసరము. దీనికి ముఖ్యము మన దేశపు శాస్త్రజ్ఞులలో సరియైన నాయకత్వము లభించుట.

మన దేశమందలి శాస్త్రజ్ఞులు చారిత్రక కారణాలవల్ల సాంఘికంగా ఒక వింతపరిస్థితిలో వుండటం యిచ్చట గమనించతగ్గ విషయం. శాస్త్రజ్ఞులొక్కరే కాదు; మనదేశంలో మేధావులు (Intellectuals) అందరూ ఈ పరిస్థితిలోనే ఉన్నారు. చారిత్రకంగా మన ఉన్నతవిద్యాభ్యాసము, రాజ్యాంగతంత్రము మనను పరిపాలించిన ఆంగ్లదేశీయుల భాషలో నడవటం జరిగింది. అందుచేత ఈ మేధావులు తమ తమ ఊహలను తోటి సామాన్య ప్రజలకు తెలియజెప్పటానికి వీలుపొందకపోవటం ఒక్కటేగాక సాంఘికంగా ఈ రెండు తెగలకు మధ్య (సామాన్యులు, మేధావులు) తారతమ్యభేదాలకు దారితీయటం జరిగింది. మేధావులు సామాన్యులకు చాలా దూరంలో వుండటం ప్రతి సంఘంలోనూ మనం ఏదోరకంగా చూస్తున్న విషయమే. కాని మనదేశపు మేధావులు భాషరీత్యాకూడా సామాన్యులకు చాలాదూరంలో ఉండిపోయారు. ఈ ఇరు వర్గాల మధ్య భేదం ఎంత తొందరగా తగ్గితే ప్రజాస్వామ్యమునకు అంతమంచిది. మన సమస్యను గురించిన చర్చ ముగించేముందు మేధావుల విషయమై క్లుప్తంగా పరిశీలిద్దాం.

బుద్ధికుశలతతో ప్రతివిషయాన్ని పరిశీలించగలిగి తమ వ్రాతలతోను పలుకులతోను తోటివారిపైన సంఘముపైన ప్రభావాన్ని చూపగలిగిన విద్యావంతులందరిని 'మేధావులు' అందాం. ఈ నిర్వచనంతో అందరూ ఏకీభవించక పోవచ్చు. అది వేరే సమస్య. మనం ప్రస్తుతం ఎవర్నిగురించి ప్రస్తావిస్తున్నామో స్పష్టపరచడం ముఖ్యం. ఈ నిర్వచనం ప్రకారం శాస్త్రజ్ఞులేకాదు యితరవృత్తులలో వున్న వారనేకులు ఈ మేధావుల తరగతికి చెందుతారు.

భారతదేశపు మేధావులనుగూర్చి విపులంగా చర్చించడానికి యిది సమయంకాదు—కొన్ని ముఖ్యవిషయాల సమీక్ష తప్ప. పరదేశీయుల పరిపాలన తొలగించటం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గడించటం ముఖ్యాదర్శాలని యావద్భారతమందు చాటించి ప్రజాబలమును కార్యసాధనకై వినియోగించుటంలో వీరు ప్రముఖమైన పాత్రను వహించురనటం 'మరువరాని చారిత్రక సత్యం.' స్వాతంత్ర సాధనలో వీరు నాయకత్వాన్ని చేపట్టి నాయకత్వంతోపాటు సంక్ర

మించిన అధికారాన్ని బాధ్యతతో నిర్వహించా రన టంలో అతిశయోక్తిలేదు. కాని స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గడచిన రెండుదశాబ్దములలోను సంఘంలో వీరి స్థానమందు కలిగిన మార్పులు గమనించతగ్గవి. నాయకత్వం, అధికారం వీరి చేతులనుండి సడలినవి. కొద్దిమంది మేధావులుమాత్రము ప్రభుత్వ సంస్థల, ప్రజాసంస్థల యంత్రాంగములలో సలహాదార్లుగా మనగలుగుతున్నారు. అధిక సంఖ్యాకులు, సంఘంలో ఒకవర్గంగా ఏర్పడకపోయినా, అటు సామాన్యులకు యిటు అధికారవర్గాలకు దూరమై, పరిస్థితులపై ప్రభావం చూపలేక విరక్తితోకూడిన మనః స్వభావ మునకు లోనవుతున్నారు. మేధావుల ఈ మానసిక స్థితిని సాంఘిక శాస్త్రవేత్తలు Alienation లేక 'వేరిడితనం' అంటారు. ఇదే మనదేశంలో చాలామంది మేధావుల 'బహుదూరత్వం' 'పానిస్మాయిజం', 'పట్టించుకోనితనా'లకి మూలము.

మేధావులు సంఘంలో తమపాత్రని, తమ బాధ్యతలని తమకుతామే నిర్వచించుకోవలసిన రోజు లివి. స్వాతంత్ర సాధనలాంటి మహదాశయాలు నేడు లేవు. —కొంగుపట్టుకు వేలాడడానికి. దేశాభివృద్ధికై తాము చేయగలిగినపని మేధాశక్తి నుపయోగించి తామే గ్రహించి మేధావులమని నిరూపించుకోవలసిన సమయ మిది. ఈ మేధావుల వేరిడితనం తగ్గించటానికి శాస్త్రీయ విజ్ఞాన ప్రచారంవంటి కార్యక్రమాలు మార్గదర్శకాలు కాగలవేమో !

5 అభివృద్ధిచెందిన దేశాలు

(Developed Countries)

ఇక అభివృద్ధిచెందిన దేశాలగురించి ఏచా రిద్దాం. గత రెండుమూడు సంవత్సరాలనుంచి ఈ దేశాలలో ఒక వింతధోరణి బయలుదేరింది. శాస్త్రీయ విజ్ఞానం అంటే మక్కువ తగ్గుతోంది. అమెరికా లోని కళాశాలల్లో సైన్సు సబ్జెక్టులను (రిగ్యులరుగా గాని, ఆప్షనల్‌గాగాని) తీసుకునేవాళ్లసంఖ్య క్రమంగా తగ్గుతూండటం విద్యావేత్తలను కలవర పెడుతోంది. శాస్త్రీయ విజ్ఞానంయొక్క ఉపయోగం ఏమిటి ? అనే ప్రశ్న ప్రజలనూ, కొందరు శాస్త్రజ్ఞులనూ కూడా, బాధించటం ప్రారంభం అయింది. ప్రపంచం లోని చెడుసమస్యలన్నిటికీ శాస్త్రీయ విజ్ఞానమే కారణమన్నట్లు పలురకాల విమర్శలు బయలుదేరాయి. నిజంగా ఈ పరిస్థితి రావటానికి కారణం శాస్త్రీయ విజ్ఞానం ప్రాతిపదికగా వృద్ధిచెందిన సాంకేతిక విద్య లన్నీ మానవాళికి ప్రయోజనకారులు కాకపోవటమే. విజ్ఞానాన్ని ఉపయోగకరంగా హానికలుగకుండా వాడు కొనక పోవటం వల్ల కలిగే నష్టాన్నిచూసి శాస్త్రీయ విజ్ఞానమే వద్దనేవారు శాస్త్రీయ విజ్ఞానానికి, సాంకే తిక విద్యలకి మధ్యగల సంబంధం గ్రహించలేదన్న మాట. దీనికి కారణం బహుశః విజ్ఞానం రాను రాను కొంతమంది శాస్త్రజ్ఞుల ప్రత్యేకవిద్యగా ఉండిపోవటం కావచ్చును. శాస్త్రీయవిజ్ఞానంఅంటే ఏమిటి? దీని లక్ష్యాలేమిటి? దీని విలువ ఎంత? ఇది ఎంతవరకు మన ఆశలు తీర్చగలదు?—అనే ప్రశ్నలకి జవాబు లిచ్చే వారు అరుదయ్యారు. నిత్యం అనేకరకాల సాంకేతిక సాధనాలను ఉపయోగించుకుంటున్న ప్రజల సంస్కృతిలో శాస్త్రీయవిజ్ఞానపు విలువల పరిచయం సమ పాళ్లలో లేకపోవటానికి శాస్త్రజ్ఞులు, విద్యావేత్తలు కొంతవరకు కారణంఅని గ్రహించాలి! ఈ విషయం గుర్తించిన ప్రభుత్వసంఘాలు, విజ్ఞానసంస్థలు శాస్త్రీయవిజ్ఞాన ప్రచారానికి అనేకపథకాలు తయారు చేసి ఆచరణలో పెడుతున్నాయి.

6. సారాంశము

'శాస్త్రీయత' (అనగా శాస్త్రీయ దృక్పథము, శాస్త్రీయ విధానము, శాస్త్రీయ వైఖరి కలిగిన మనఃప్రవృత్తి) శాస్త్రజ్ఞులకే కాదు సామాన్యులంద రికి అవసరమని, శాస్త్రీయతలేని సాంకేతికత ప్రజా స్వామ్యమునకే విరుద్ధమని గమనించాము. దీనిని పెంపొందించుటకు తగుపాళ్లలో శాస్త్రీయ విజ్ఞా నాన్ని సామాన్యునికి రుచి చూపించేందుకై చేయ వలసిన, ప్రత్యేక శ్రద్ధతోకూడిన ప్రచార కార క్రమమును 'శాస్త్రీయ విజ్ఞాన ప్రచారము' అని

నిర్వచించాం. ఈ ప్రచార పద్ధతులు సామాన్య ప్రజలయొక్క విద్యా సంస్కారాల వివిధ దశలను దృష్టిలో పెట్టుకొని అవలంబించవలెనని, నిరక్ష రాస్యులనుకూడ ఈ విజ్ఞాన వీధుల్లో నడిపించగల నూతనకార్యక్రమములను కనిపెట్టడానికి పరిశోధ నలు చేయవలయునని గుర్తించాము. శాస్త్రజ్ఞులే ఈ ప్రచారంలో ప్రముఖపాత్ర వహించడానికి తగిన సమర్థులని, శాస్త్రజ్ఞులకుటుంబము — ఇట్టిపని గౌరవప్రతిష లలో కూడినది, దేశాభివృద్ధికి అవసర మైనది అని శాస్త్రజ్ఞుల కాదేశించవలెనని నిర్ణ యించినాము.

(అమెరికాలో వెలువడుతున్న తెలుగుభాషా పత్రిక నుండి.)

సంప్రతించబడిన ప్రచురణలు

1. The Social Reality of Scientific Myth". సంపాదకులు : Kalman H. Silvert (ప్రకాశకులు : American Universities field staff Inc, New York, 1969.)

2. "Two New Sciences" Galileo Galilei. ఆంగ్లానువాదం H. Chew & A. De Salvio (ప్రకాశకులు : Macmillan, New York 1914)


3. F. D. Dart & P. L Pradhan, "Cross-Cultural Teaching of Science". Science Vol. 155, 649 (1967.)

4. "The Psychology of the Child" J. Piaget & B. Inhelder (ప్రకాశకులు: Basic Books INC. N. Y, 1969.)

5. "Thought and Language" L. S. Vygotsky. [ప్రకాశకులు: MIT. Cambridge, Mass. (1962)]

6. Stephen Cotgrove, "The Sociology of Science and Technology"; British Journal of Sociology Vol. 21, 1—15 (March 1970)

7. Michael Polanyi, "The Republic of Science" Minerva Vol. 1, 54—73, 1962.



చూడటం - చదవటం

శ్రీ కొండిపర్తి శేషగిరిరావు

సామాన్యంగా మనం రూపాలను చదవం. చూస్తాం.

సాహిత్యాన్ని చూడం. చదువుతాం.

కానీ ఒకోసారి రూపాలను చదువుతాం. సాహిత్యాన్ని చూస్తాం.

అప్పుడు శబ్దం చూపిస్తుంది కొన్ని కొన్ని రూపాలను. రూపం వినిపిస్తుంది కొన్ని కొన్ని భావాలను.

అలా రూపాలలోని భావాలను చదవాలంటే, ముందు రూపరచనలోని రూపాలను విశ్లేషించుకొంటూ చూడాలి. ఆ తరువాత, ఆ విశ్లేషణ రూపాలు ఇచ్చిన భావాలను సంశ్లేషించుకొంటూ చదవాలి. అప్పుడు రూపరచనలోని రూపాలను చూడటమూ ఔతుంది, చదవటమూ ఔతుంది.

అంటే—

చిత్రంలోఉన్న రూపాలను విడగొట్టుకొని, విడివిడిగా ఒకోదానినీ చూడాలి. ఆ తరువాత ఆ విడి రూపాలు ఇచ్చే భావాలను, ఒకోదానినీ సూత్రబద్ధం చేసుకొంటూ చదవాలి. అప్పుడుగానీ, ఆ రూపగత భావాలు సంయోగమై, రూపరచనలోని పూర్ణభావమును ఆవిష్కరించవు.

చిత్రమును ఇలా బహిర్గతంగా విశ్లేషించుకొంటూ, అంతర్గతంగా సంశ్లేషించుకొంటూ పోయినప్పుడు, ఆ రూపరచనలోని రూపాలు రూపసాహిత్యంలోకి కరిగిపోయి, భావంలోకి రూపాంతరం చెందుతాయి. అప్పుడు చిత్రరచనలోగల రూపసాహిత్యం మనకు హృదయగతమౌతుంది; మన రసజ్ఞతలో రసం ఆవిష్కరింపబడుతుంది.

ఈ విధంగా రూపకృతులలోని రూపాలను వాని అనుషంగిక రూపాలనూ వియోగించుకొంటూ; అవి అందించే భావాలను సంయోగించుకొంటూ పోయినప్పుడు, రూపాలలోని భావాలూ అనుషంగికభావాలూ వాటిని అంటిపెట్టుకొనిఉన్న విభావ అనుభావ వ్యభిచారీ భావాలూ మనలో స్పందించి రసాన్ని ఆవిష్కరించి గతిని పొందుతాయి. ఇలా రూపజన్యభావాలు గతిని పొందుతున్నప్పుడు మనలో ఎన్నో రససంవేదనలు కలుగుతాయి. అప్పుడు మనముందున్న చిత్రం స్తబ్ధశీలీ, జడస్వభావీ ఐనా; అందులోని రూపాలను ఇలా చదువుకొంటూ పోవటంవలన అవి రసచేతనతో స్పందింపబడి గతిని పొందుతాయి.

నిజానికి చిత్రంలోని రూపం గతినిపొందదు. కానీ ఆ రూపరచనలోని రూపాలు ఇచ్చే భావాలు గతిని పొందుతాయి. ఆ భావగతిలో రూపరచనను చదువుకొంటూ పోతున్నప్పుడు రూపాలు గతిని పొందినట్లుంటాయి.

కనుక రూపరచనలోని రూపాలను వియోగించుకోవటంలో గతిపుట్టుతుంది. ఆ రూపగతిని సంయోగించుకోవటంలో రూపాలు చేతనత్వాన్ని పొందుతాయి.

అందుకనే *సమూహా రూపరచన (Group Composition) లో ఎన్నోభావాలు గర్భితాలై, విభిన్నముఖవ్యంజనాలై, రూపబద్ధమై ఉంటాయి.

---

* సమూహా రూపరచన (Group Composition) అంటే—

ఎక్కువ మానవరూపాలు (చిత్రములో పాత్రలు) కలిగి, ఒక సంఘటనను తెలిపే చిత్రమూ లేక శిల్పమూ అని అర్థం.

బౌద్ధ శిల్పాలలోని 'శిశు బహూకరణా'; అజంతాలోని Flaying Apsaras; రూబిన్స్‌యొక్క 'The dead Christ'; దామెర్ల రామారావుయొక్క 'సిద్ధార్థ రాగోదయమూ' మొదలైనవీ. ఇవన్నీ 'సమూహా రూపరచనకి (Group Composition) కోవకు చెందినవే ఔతాయి.

వాటిని అవగతం చేసుకోటానికి ద్రష్టలమైన మనం సమూహరూపరచనను(Group Composition) విశ్లేషించుకొంటూ చూడాలి, ఆ తరువాత సంశ్లేషించు కొంటూ చదవాలి.

అందుకనే ఈ రూపవియోగదృష్టీ ; ఈ భావ సంయోగదృష్టీ అన్నవి, రూపరచనలోని రసాన్ని ఆస్వాదించటానికి సాధనాలు ఔతున్నాయి.

*　　*　　*

చిత్రాలలోని రూపరచనను ఇలా విడగొట్టు కొనీ, తిరిగి కలుపుకొనీ ఎందుకు చూడాలీ, ఎందుకు చదవాలీ అని అంటే—

రూపకారుడు తాను రూపరచన చేస్తున్నప్పుడు ఒకోభావాన్ని ఒకోరూపంలో పొదుగుతాడు. అలాంటి భావమయ రూపాలను ఎన్నింటినో ఒకోసమూహరూప రచన (Group Composition)లో భావయుక్తంగా రసస్ఫూర్తితో పొందుపరుస్తాడు. అలా పొందుపరచిన ఒకోరూపంలోని భావం, ప్రక్కరూపంలోని భావానికి సూత్రబద్ధం చేయబడుతుంది. అలా సూత్రబద్ధం చేయటంవలన, రూపజగత్తులోని సమూహరూపరచన ఏకత్వాన్నిపొంది అఖండంగా భాసిస్తూ ఉంటుంది.

అలా భాసించే ఆ సమూహరూపరచనను ఆస్వాదించాలంటే కొంచెం కష్టమే మరి.

అది వైతాలగాలంటే --

ఓ సాహితీరచనను ఆస్వాదించేప్పుడు మనకున్న భాషాపరిజ్ఞానంతో ఎలా శబ్దాలను విడగొట్టుకొంటూ వానిని అవగతంచేసుకొంటూ, ఆ శబ్దాలలో గల భావాన్ని సంధానం చేసుకొంటూ ఆస్వాదిస్తామో—అలానే మన కున్న రూపపరిజ్ఞానంతో రూపసంధాన టంకంతో అతకబడి అఖండంగా భాసిస్తున్న సమూహరూపరచ నలో గల రూపాల్ని, వియోగదృష్టితో బయటకులాగి, అందులోని భావాన్నీ దానివెనుకవున్న రసాన్నీ గ్రహించి; తిరిగి ఆ రూపాన్ని ఆ రూపరచనలోనే బిగించివేయాలి. అలా ఆ రూపాలనుండి గ్రహించిన ఆ రూపజన్యభావా ళను రూపరచనాక్రమంలో సంయోగించుకొంటూ సాహిత్యంవలె చదువుకొంటూ, భావాన్ని సంభావించు కొంటూపోవాలి. అప్పుడుగానీ రూపరచనలోగల రూపాలు పదాలై గతిస్వభావాన్నిపొంది అనేకభావాలనూ రసా లనూ మనలో ఆవిష్కరింపవు.

ఇలాంటి రూపరచనల్లో—

రూపకారుడు భావాలను రూపాలలో పొదిగి పొందుపరిస్తే, ద్రష్టలమైన మనం భావాలకొరకు ఆ రూపాలను వియోగపరచుకోవాలి.

తాను ఈ విశాలరూపజగత్తులో చదువుకొన్న భావాలను మనం చూచేలా చూపిస్తే; మనం ఆ రూపాలనుచూచి, ఆ తరువాత చదువుకోవాలి.

అందుకనే రూపజగత్తులో రూపకారుడు ముందు రూపాలను చదువుతాడూ; ఆ తరువాత చూపిస్తాడు. మనం ముందురూపాలను చూస్తాం, ఆ తరువాత చదువుతాం.

*　　*　　*

ఇలాంటి స్వభావంగల సమూహరూపరచనను విశ్లేషించుకొంటూ చూడటంలో, కొంత రూపపరి జ్ఞానం ఉంటుంది. అందుకని రూపరచన దృశ్యం ఔతోంది. ఆ రూపవిశ్లేషణలో అందిన ఒకోరూపగత భావాన్ని సంశ్లేషించుకొంటూ చదువుకోవటంలో, కొంత భావపరిజ్ఞానం ఉంటుంది. కనుక రూపరచన శ్రవ్యస్వభావి కూడా ఔతోంది.

ఇక్కడ రూపం శ్రవ్యస్వభావిఅంటే, రూపం పలుకుతుందిఅనికాదు. రూపం తనలో నిక్షిప్తపరచు కొన్న ఓ భావాన్నీ, దాని వెనుకనున్న మాటనూ, తన బాహ్యస్వరూపంద్వారా మనచేతనకు వినిపిస్తుందీ, లేక అందిస్తుందీ అని మాత్రమే అర్థం.

కనుక సమూహ రూపరచనలో ఇలా శ్రవ్య స్వభావంకూడా దాగిఉంది. కాకపోతే రూపంయొక్క ధాతువునుబట్టి ఆ శ్రవ్యస్వభావం ఇందులో అతి సూక్ష్మరూపంలో పరోక్షంగాఉంది.

అందుకని సమూహరూపరచనలోని ఒకో

రూపం కొన్నికొన్ని భావాలా మాటలా సంక్షిప్త స్వరూపంగా భాసిస్తూ ఉంటుంది.

అలా భాసించే సమూహరూపరచనలోని రూపాలు మనలో ఎన్నో ఎన్నెన్నో భావాలను రేకెత్తిస్తూ రసాలను అందిస్తూ ఉంటాయి. అప్పుడా సమూహ రూపకృతి రూపకవితలా భాసిస్తూ ఉంటుంది.

అందుకనే ఒకోసమూహ రూపరచనను అస్వాదించి మరో రూపరచనను ఆస్వాదించటానికి మన దృష్టి మరలినప్పుడు మొదటి రూపరచనలోని అనుభూతులకు యవనిక వేయబడి మరో రూపరచనకు యవనిక లేపబడినట్లుంటుంది. అంతేకాదు. ఓ కమ్మని కవితను చదివి మూసేసి మరో కవితను తెరచినట్లుకూడా ఉంటుంది.

కనుకనే సమూహరూపరచన (Group Composition) ఓ రూపకవితగా, ఓ రూపకృతిగా భాసిస్తూ ఉంటుంది—

రసతత్వంలో
మన రసజ్ఞతలో.



అముద్రిత యక్షగాన ప్రబంధము-
"చూతపురీ విలాసము"

ఇది యొక యముద్రిత యక్షగాన ప్రబంధము. యక్షగానము ప్రబంధశాఖయం దొకటియైనను తామర తంపరగా వెలసిన యా శాఖయందు ప్రబంధనామము వటయక్షన్యాయమున నే కొన్నింటికి మాత్రమో సరి పోవును. అట్టివానిలో నిది యొకటి.

ఈ కృతి ప్రేరకుడు తెలకపల్లి నివాసియగు వెలమదొర సురభి నరసరాయడు. కర్త తరణికంటె నివాసి ఎల్లూరి నరసింగకవి. అతడు సింగపట్టణ నరసింహదేవప్రసాదకవితాలబ్ధప్రవీణుడు. కృతిభర్త చూతపురి నృసింహస్వామి. ఇటు లిది సర్వము నృసింహ మయము.

చూతపురికి 'చూతఘోషపురి' యనియు నామాంతర మున్నటుల శ్రీ గంగాపురం హనుమచ్ఛర్మ గారు తమ 'దుందుభి'యందు పేర్కొనినారు. దాని కిపుడు 'మామిళ్లపల్లి'యని వ్యవహారము. అదియొక ప్రాచీన నృసింహక్షేత్రము. మా గ్రామమున కనతి దూరమున నుండును.

ఈ కావ్యమందలి కథ విప్రనారాయణ చరిత్రము. ఆంధ్రమున నాళ్వారుల చరితల కారంభ మొనరించిన పరమయోగి తాళ్లపాక చిన్నన్న. ఆ పిమ్మట సిద్దరాజు తిమ్మన, చెదలువాడ మల్లన, సారంగు తమ్మయ్య, విజయరాఘవభూపాలుడు మున్నగువా రీ భక్తాంఘిరేణువు చరిత్రమును రచించిరి. అట్టివారిలో నీ కవి యొకడు.

మానవజీవితమున బాల్యకౌమారాదిదశలవలె, సంఘము మరియు సాహిత్యజీవితములందును వివిధ దశలు గన్పట్టును. సంఘముచే సాహిత్య మితివృత్తములను, సాహిత్యముచే సంఘమాదర్శములను గ్రహించుచు, నవి యొకదానిపై యొకటి యాధార పడి వికాసదోహదము లందుచున్నవి.

సంఘము నిరంతర పరివర్తనశీలమైనదగుటచే దాని నెప్పటికప్పు డుదాత్తీకరించవలసిన బాధ్యత సాహిత్యముపై నున్నది. ఆ కారణమున సాహిత్య మాయాకాలములకు దగినట్లు వేషము మార్చుకొనుచు సంఘమునకు హితోపదేశ మొనరించినది. అందుచే మన వాఙ్మయమున పురాణ, కావ్య, ప్రబంధములవంటి మార్పు లుప్పతిల్లినవి. ప్రబంధయుగమునాటికి ప్రభువుల మరియు ప్రజల యభిరుచులందు పెద్దమార్పు వచ్చినది. వారు శృంగారప్రియులైనారు. అందువలన వ్యవహారవిదుత్వము ప్రధానమైన కావ్యమానంద ప్రధానమైనదై యవతరించి, శృంగారరూపము ధరించి సంఘమునకు నీతి బోధింపవలసివచ్చినది.

ఇక దక్షిణాంధ్ర యుగమునాటి కందరు దక్షిణ నాయకులైనారు. ఆ కాలమున విలసిల్లిన యతి నేలమగు శృంగారము వాత్స్యాయన మహర్షి ప్రోక్త మార్గముననే నడచినది. కవులు నల దమయంతి సీతారాముల యితివృత్తములతో నుదాత్తశృంగారమును బోధించినటులే, తారాశశాంకా హల్యాసంక్రందనములను చేపట్టి పారదారిక ప్రకరణమును, వైజయంతీవిలాసాజామీలోపాఖ్యానములను గ్రహించి వైశికప్రకరణమును దెలిపి యందలి కష్ట నష్ట నికృష్టతలు ప్రదర్శించి, శృంగార ప్రణవమైన సమాజము నుత్తమపథము వైపునకు ప్రవృత్తము జేయవలసి వచ్చినది. అందువలన నాడట్టి కథ లవసరమైనవి. అం దేవేని కాలాంతరమున మరల మరల చిగురించిన అది వానియందునుగల చేవ బల

మనక తప్పదు. అట్టి బలముగల యితివృత్తములం దీ విప్రనారాయణచరిత్ర మొకటి. ఇక దానిని కవి రూపించిన తీరు పరిశీలింపుదు.

'మండగుడి యను కావేరీతీరాగ్రహారమున లక్ష్మీదేవి నారాయణులను బ్రాహ్మణ దంపతు లున్నారు. దొడ్డ యిల్లాలగు నా లక్ష్మీదేవి రంగము నకువచ్చి సభాసదులకు పతివ్రతాధర్మము లుపన్య సించినది. అపుడు వారింటికొక సన్యాసివచ్చి వా రన పత్యులని తెలిసి భిక్ష గ్రహింపకుండ వెళ్లినాడు. ఆమె చింతాక్రాంతురాలై భర్తరాగనే యా విషయము నివే దించినది. అందుల కతడు శ్రీ మహావిష్ణువు కరుణ లేక దేనిని బడయ సాధ్యముగాదని పత్ని నోదార్చినాడు. వారు సంతతికై — చూతపురి — నరసింహుని గొలువ మొదలిడినారు.

ఆ సర్వేశ్వరునకు వారిపై దయగలిగినది. అతడు—
...............ఎఱుకజెప్పగా దలచి
సొంపుగా నుదుట చక్కగ చుక్కబెట్టి
జంపులు బొగిడీలు నపరపుకుప్పె
అందమైనట్టి ముత్యాల కమ్మలును
సందిదండలు బన్నసరము రాకిణియు,
పచ్చలు డాపిన పాపెటబొట్టు

మున్నగు భూషణములు ధరించి సోదకత్తె యైనాడు. అపుడా సౌందర్యమేమి చెప్పట—

దరహాస యుక్తమౌ తరుణీముఖంబును
దలచగా నొక్క పద్మంబుసేయు,
శుభరేఖలను చాల సొంపొందు భామినీ
కంఠంబునొక్క శంఖంబు సేయు
కనకరత్నప్రభాకలితమై తగు జుట్టు
కొమరెంచగా నొక్క కోటిసేయు
....
తరుణి యవలగ్నమొక్క ఖర్వంబుసేయు
లలన పలుకుల చందంబు లక్షసేయు.

ఇటుల సౌందర్యరాసియై వచ్చి, నూటెనిమిది తిరుపతులను, అందుగల దేవతలను, అష్టాదశ పీఠ ములం దష్టాదశనామములతో వెలసిన చూతపురీ నరసింహుని సోదరియగు శ్యామలాంబను గొలిచి, లక్ష్మీదేవికి విప్రనారాయణుడు బుట్టుట మొదలు బ్రహ్మరథముపట్టుటవరకు నెఱుకజెప్పి వెళ్లినాడు. అనంతర మా యిల్లాలు చూలాలై శ్రీ మహావిష్ణువు వనమాలికాంశమున నొక బాలుని గనినది. అతడు

'అంబుజాక్షుడెగాని యఖిలలోకములందు
నన్యదైవంబు లే డనెడువాడు
శ్రీ భాగవతసేవ జేసినవారలు
ధన్యులయ్యెదరని దలచువాడు
హరిచింతలేని మర్త్యశ్రేణితోడుత
చెలిమి నెల్లపుడు వర్జించువాడు
అన్యమతంబుల ననుసరించుచునుండు
వారిచెంతకు జేరనీనివాడు
ఇంద్రియంబుల నెల్ల జయించి శాంత
శమదమంబులు గల్గు వైష్ణవు డితండె
యనుచు జనులెన్న విప్రనారాయణుండు—'

అను పేరున బరగి రంగమునకు వచ్చిన పిదప తనతో పాటు వెలసిన యాళ్వారు లందరిని గురించి తెలిపి, కావేరీతీరమందలి శ్రీరంగనికి మాలికాకైంకర్యమునకు మనసు వొడమి, సభాపతుల నడిగి యొక పొలము గొని పూదోటను బెంచుచు నిష్ఠగా జీవించసాగినాడు.

ఒకనాడు చోళరాజ దర్శనమునకై మధురవాణి దేవదేవి యను నిరువురు వేశ్యలు వచ్చినారు. అందు మధురవాణి,

సూనౌఘ మకరందపాన తుందిల మత్త
మధుకరనిభవేణి మధురవాణి
కాంచన నవరత్న కంకణముఖదివ్య
మండనశ్రేణి శ్రీ మధురవాణి
జలధిపరీవృత సర్వంసహాచక్ర
మహనీయ శుశ్రోణి మధురవాణి
మధుసమయోదిత మార్తాండకర భాస
మాన పల్లవపాణి మధురవాణి
మానసార్చిత శర్వాణి మధురవాణి
మంజువాగ్జిత గీర్వాణి మధురవాణి
మత్తసామజగామిని మధురవాణి
మానిహృద్భేదకకృపాణి మధురవాణి,

వారచ్చరకులమున బుట్టినవారుగనుక తెర వెళ్లగనే తమ పుట్టువునకు కారణమైన సముద్ర మథనకథ లక్ష్మీకల్యాణాంతమువరకుజెప్పి, దారిని వెళ్లుచు, విప్రనారాయణుని వనముగని దాని రామ ణీయత కచ్చెరువంది, లోనికరిగి, యట ధ్యానమగ్ను డైన యా భాగవతునకు నమస్కరింప, నతడు చంద్రునిగనిన తమ్మివలె మోము వాంచి లోనికి వెళ్లి నాడు. అపు డతనిని వలపించుటకా యక్కాచెల్లెండ్రిద్ద రకు పందెము వచ్చినది. అంత మధురవాణి దేవదేవితో—

ఒకతీరుగా నందరుందురే యైనను
తెలిపెద ప్రవరాఖ్య ధీవరుండు
అవని సిద్ధౌషధం బరయుటకై శత
గిరికేగి నచటది గరగిపోవ
తిరిగిపోవగనెంచి తెరువు జూచుచునుండ
నందు వరూథి మోహంబుజెంది
కులుకు గుబ్బలు నెదగ్రుచ్చి కౌగిలిజెర్చ
'హా వాసుదేశ శ్రీహరి' యటంచు
పలికి యంసద్వయంబు చేపట్టి ద్రోచె
గాక; మనసు చలించెనే ప్రాకటముగ
దానికంటెను నీ వెంత జాణ వహహ!
యేల యీపట్టు విడువవే బేలవగుచు

అని మందలించినది. అందులకు—

సరసోక్తుల చేతను మతి
గరగించగలేకయున్న కాంతామణి సుం
దరరూప మేమిటికి, చి
త్తరు బొమ్మకు లేదె చక్కదన మిలలోనన్

అని దేవదేవి బదులు జెప్పినది. దానికి మధురవాణి—

మును రంభ గాధిపుత్రుని
మనమును గరగించబోయి మరియేమాయెన్
విను దానికంటె యిల చ
క్కని దానవె దలచిచూడు కంజదళాక్షీ!

అని నయభయములు జూపినదిగాని యామె వినలేదు. పంతమాడి దాసురాలివేషమున రాగా శుభ శకునములైనవి. ఆమె శకున విషయములు కొన్ని వివరించి విప్రనారాయణునిజేరి నమస్కరించి, తాను వేశ్యనని, ఆ వృత్తిపై నేవగింపు గలిగినదని, వేశ్యా జీవన హైన్యమును దెలిపి, తనను పాదసేవకు దాసు రాలిగా నంగీకరింపుమని వేడినది. అతడంగీకరించి నాడు. పిదప తానెన్ని విలాసములు ప్రదర్శించినను నతడు చలించలేదు. అపుడు తా నక్కగారి మాట వినక పందెమున నోడుదునేమోయని బెంగగొని— చూతపురి — నరసింహస్వామిని ప్రార్థింపసాగినది. ఆ స్వామి దాని నంగీకరించి యొకనాటి తెలవారు జామున స్వప్నమున వైష్ణవవటువుగా దర్శనమిచ్చి నీ పంతమీడేరును, తత్తరము వలదని పలికినాడు.

పిమ్మట నాటినుండి యాభాగవతుని హృద యము మెత్తబడి మోహాయత్తమై, గుడి మొగ మైనవాడు నుడి మొగమై—

హల్లకపాణి ధమ్మిల్లంబుగాంచి శ్రీ
కృష్ణనామంబు కీర్తించ మరచె
శుకవాణి నడుము తప్పకజూచి శ్రీహరి
ధ్యానంబు మదిలోన దలచమరచె
వనజాక్షి నెమ్మేను గనుగొని హాటకాం
బర యని నొకసారి బలుకమరచె
చిల్కలకొల్కి పల్కుల సొంపు విని మధు
సూదనా యని పల్కుచుండ మరచె
నాతికన్నులుగని పద్మనాభు మరచె
మగువ నెమ్మోము గని విభు స్మరణమరచె
తరుణిపాలిండ్లు గని చక్రధరుని మరచె
తెరవయానంబు గని కరివరదు మరచె!

ఇటుల మనన ధ్యానములు మరచుటేగాక—

కలకంఠినూగారు గాంచిన జాలదే
శేషాచలంబు వీక్షింపనేల
ఘనవేణి యధరంబు గనుగొన్నజాలదే
అరుణాచలంబున కరుగనేల
జలజాక్షి మధ్యంబు తిలకించ జాలదే
సింహాచలంబు దర్శింపనేల
సుందరీ గమనంబు జూచిన జాలదే
ఇభగిరివరమున కరుగనేల
కంబుకంధర నెమ్మోము గనినచాలు
చంద్రపుష్కరిణీజలస్నాన మేల

కామినీమణి ఘనవేణి గనిన జాలు
నీలగిరులకు జననేల బేలనగుచు !

అని పుణ్యక్షేత్ర దర్శన కుతూహలముగూడ విరమించుకొని—

పువ్వులు గోయుచో పాలితిమోవి దలంచి
పల్లవంబులు చేతబట్టి త్రెంచు
చిగురాకులేల త్రెంచితినని యా చెలి
రదనాలి దలచి కోరకము దునుము
కోరకంబేలకో గోసితినని దాని
పలుకులు దలచి తేనెలను వడపు
పూదేనె వ్యర్థమైపోయె ననుచు దాని
పాలిండ్లు దలచియు పండ్లుగోయు
అవనిసురు డీ విధంబున నావిగాని
మోహవిభ్రాంతి తన మనంబున జనింప
నొకటి సేయుంగబోయి తా నొకటి జేయు--

చుండగా వర్షర్తు వేతెంచి జడిగట్టినది. ఒకనాటి రాత్రి వర్షమున దేవదేవి సంచాదియుండుండ నామెను లోపలికి బిలిచి తానిచ్చిన తిరుమంత్రోపదేశమునకు బదులు స్మరతంత్రోపదేశమందినాడు. ప్రతిన జెల్లిన దని దేవదేవి యాతని నింటికి గొనివెళ్లినది.

విప్రనారాయణుడు దేవదేవి యింటికిరాగా నతని వెనుక శరదృతువు వచ్చినది. దానివెనుక లక్ష్మీదేవి పండుగ వచ్చినది. ఆ పండుగవెనుక వేశ్యమాత వచ్చినది. అపుడు విటులందరు తమతమ వేశ్యలకు బహు విధములైన కానుకలు దెచ్చియిచ్చుచుండ, చేత గొంటు పోకైనలేని యా బోడబాపనితో పనియేమని వేశ్యమాత యాతని నిలువెడల నడచినది. అతడు వచ్చినదారిని బట్టి విధిని దూరుకొనుచు తోటజేరి విరహముపాలై

అతివతోడుత మాటలాడగల్గిన శౌరి
కెంచగా చక్కెర బంచిపెడుదు
బాలిక పాలిండ్లకేల నంటినజాలు
విష్ణున కర్పింతు విరుల చెండ్లు
కలికి నాగారును గనగల్గినను జాలు
శేషశాయికి నిత్యసేవ జేతు
కలకంఠనిభవాణి కనులగాంచినజాలు
రాజీవముల హరిపూజ సేతు
జలజదళనేత్రి చెక్కులు సరభసమున
చూడగల్గినచో జాలు సురుచిరముగ
ప్రేమతోడుత శ్రీరంగధాము నెదుట
నిలువుటద్దంబు నిలువుదు నెలమితోడ

అని రంగని దలచుకొన సాగినాడు.

భక్తుని వేదనకు భగవంతుని మనసు గరగి చూడజాలక వటురూపమును ధరించి యాలయము నందలి యొకగిన్నెను గొని దేవదేవి యింటికివెళ్లి, 'నేను విప్రనారాయణుని శిష్యుడను, నాపేరు రంగడు. మా యయ్యవారీగిన్నె మీ కంపినాడని' దానిని వేశ్య మాతకిచ్చి వెళ్లినాడు. ఆమె దానిని సొన్నారికిజూపించుకొని, పదార్వన్నెబంగారమగుట యెఱిగి, యటి వతనికడ నింక నెన్నియుండునో యని తలచి, వానిని రాబట్టుకొనుటకు, కావేరియను దూతిని బంపి యల్లునివి మరల బిలిపించుకొనినది.

అర్చకులు నాటి మధ్యాహ్న నివేదనావసరమున నాలయమున గిన్నె లేకుండుటవలన, జియ్యరునకు నివేదింప, నతడు గుడిపనివారిని విచారించి, యేకాంతమున కళాదుని బిలుచుకొని యడిగి, యది వేశ్య యింట నుండుట యెఱిగి, రక్షకభటులతో నేగి యామెయిల్లు శోధించి, గిన్నెను బట్టుకొని ఇది నీకెట్లు జేరినదని యడుగు వేశ్యమాత యింటనున్న విప్రనారాయణుని జూపినది.

తలవరు లతని బట్టుకొనివచ్చి సభాసముఖమున నిలిపినారు. అచట జేరిన ధర్మాధికారులాగిన్నె యాతడే దొంగిలించి యుండునని యేకగ్రీవముగా నంగీకరించినను, బాలబ్రాహ్మణుడు మీదు మిక్కిలి భక్తుడు నగుట యాతనికి శిక్ష నిర్ణయింపలేక ధర్మ సమ్మూఢులైరి. అంత ధర్మాధికారుల దశజూచి, జియ్యరాతనిని క్షమించి వదలెను. కాని యందులకు విప్రనారాయణునకు మనసొప్పలేదు. అపవాదుతో నచటినుండి వెళ్లలేక దానిని బాపుమని రంగని ప్రార్థించినాడు.

చిత్తశుద్ధితో గూడిన నాతని ప్రార్థనవిని విష్ణువు వెంటనే ప్రత్యక్షమై దేవదేవి విప్రనారాయణుల సమాగమము, స్వర్ణపాత్రాపహరణము తన చేతనే లీలార్థముగా గల్పింపబడినవని చెప్పి, యాతనికి

గలిగిన యపవాదుడిపి, నేటినుండి యీ కథ యాగమ తుల్యమై వెలయునని వరమిచ్చి తానాతని శరీరమున లీనమైనాడు. అదిగని జియ్యరు మున్నగువారు దేవదేవిని, ధన్యురాలవని గొనియాడి సువర్ణపాత్రతోపాటు జాంబూనదాంబరము లిచ్చి పూజించి విప్రనారాయణు నకు బ్రహ్మరథము బట్టినారు.

ఈ కథను మొమ్మొదట కావ్యీకరించినవాడు సారంగుతమ్మయ్య గనుక సారంగమైన యాతని రచన యనంతరీయు లనుకరింపకుండనుండుట కష్టము. అనుకర్త యప్రతిభుడైన మూలము నిర్మూల మగునుగాని లేకున్నదానికి గురుత్వము గలుగును. కథ జెప్పుటయం దీకవి తమ్మయ్య యడుగుజాడలందే నడచినను, నడుమనడుమ కడివెడుపాలకు కొణిదెడు చల్ల తోడుగా స్వకీయమైన లఘుకల్పనలచే కథను చక్కగా చిక్కగా జేసినాడు.

ఇతడు కవితామర్మము లెరిగిన కవి. నేటికి రెండువందల లోపువాడు. శైలి ప్రౌఢమై సరసముగా నున్నది. మచ్చులు స్థాలీపులాక న్యాయముగా కథ యందే జూపితినిగనుక విడిగా జూపుట సాధ్యముగాదు. ఈ కవి కృత్యాదిని సంస్కృత కవులతోపాటు నన్నయ భట్టు, అనంతుడు, శ్రీనాథుడు, పెద్దన, చిన్నన్నను స్మరించినను తనకు మార్గదర్శియైన తమ్మయ్య నేలనో స్మరింపలేరు.

కావ్యారంభమున నీతడు స్తుతులను నన్నయగారి వలె సంస్కృతవృత్తములలో రచించినాడు. వానిని మరల ప్రతిపాత్ర ప్రవేశావసరమున, అనగా—లక్ష్మీదేవి మరియు ఎఱుకత ప్రవేశించినప్పుడు, ఆమె చూలింతరాలిగా వచ్చినపుడు, విప్రనారాయణుడు మరియు వేశ్యలు ప్రవేశించినప్పుడు, దేవదేవి దాసురాలిగా వచ్చినపుడు, రంగడు, శ్రీరంగడు ప్రవేశించినపుడు, పునరావృత్త మొనరించుటద్వారా రూపకమున రంగ విభజన సాధించినాడు.

ఈ కృతికి ప్రేరకుడు సురభి నరసరాయడు. కవి అతని నామ మీ క్రింది పద్యమున పొదిగినాడు.

శ్రీ రమ్యముగ విప్రనారాయణు చరిత్ర
మెవరు జెప్పించిరి యిష్టముగను
తగ దెల్పుమనిన నా ధన్యుని నామంబు
నేర్పుతో వివరింతు నిక్కముగను,
నావ—హాలంబు—బాణంబుల పొది—నంటె
చూస్త్రిమి, కోరిక—జ్యోత్స్న—ఖడ్గ
మ...బును—వనజంబు—పకుల
గతియు—ని వెల్లను చతురమతిని
అక్షరముల మూడింట నమర వ్రాసి
నడిమి యక్షరములు దీయ నయముగాను
కర్త వేరగుచుండు నీక్ష్మతలమున
సూక్ష్మబుద్ధి గ్రహించుడీ సుజనులార!

—శివమ్మాజిపేట పాపిసెట్టి సీతారామునిచే రచింపబడినవి— ఈ తరగతికి చెందినవి సుమారొక ముప్పది పద్యములు నాకు లభించినవి, అందు పాల మూరు మండలమందలి దేవతలందరు స్తుతింప బడినారు.

ఈ నరసరాయని కోడలిపేరు జానమ్మగారు. వీరు చూతపురి నృసింహస్వామి కనన్య భక్తులు. అందువలన నరసరాయడా స్వామిపై కృతి రచింప జేయగా కోడలగు జానమ్మగా రా స్వామికి మండపము గట్టించి, శిల్పశోభితమైన గోపురమెత్తించి, నిత్య దీప నైవేద్యములకు దగు ప్రబంధమొనరించి, వైష్ణవులను గొనివచ్చి స్వామి కర్చకులనుగా నిలిపి, వారికి మడిమాన్యములనిచ్చి యిటు లాలయాభివృద్ధి కనేక విధముల పాటుబడుటేగాక, తమ మామగారి కీర్తి కవశేషముగానున్న యీ కృతిని తమ సమీపగ్రామ మగు రాకొండయందలి కిళాంబిదరూరు లక్ష్మణా చార్యులను కవి వరునిచే పరిశీలింపజేసినది. అతడీ గ్రంథమునకు పీఠికాప్రాయమైన సీసార్థములు ముఖ తిలకముగా రచించినాడు.

ఈ గ్రంథము రచన ననుసరించి యుత్తమము గనే యున్నను, యక్షగానమగుటచే కాలదోషముబటిన ప్రక్రియయైనది. సకాలమున ముద్రణా సౌకర్యము లేమినో, మరే కారణముననో, వెలుగునకు రాజాలక, సంఘమునకు, భాషకు, నొకప్పు డుపకరించిన నిట్టి తాళపత్రము లెన్నెన్ని దేశమునందలి యేయే మూల లందు మగ్గుచున్నవో, నెవరెరుగుదురు.

—శ్రీ కపిలవాయి లింగమూర్తి.

వడి : శబ్దార్థ విచారము

యతి'కిఁ బర్యాయ పదములుగా వ్యవహారమున నున్న 'వడి' 'వళి' యను శబ్దములు దేశ్యములు. విశేష్యములు.

యతి సంస్కృతీయము. పద విచ్ఛేద సంజ్ఞకము. నియమిత స్థానమున పదచ్ఛేదము సంస్కృతమున యతి. కానిచో యతిభంగము కలుగును. అక్షరమైత్రి లేదు.

తెనుఁగున యతిశబ్దము వ్యవహారరూఢమైనను లక్షణము సంస్కృతీయమునకు భిన్నము. ఇందు పదవిచ్ఛేదప్రసక్తి లేదు. పాదాద్యక్షరముతో నియమిత స్థానమున సావర్ణ్యసాజాత్యాది విశేష మైత్రికలవర్ణముల గూర్చుట ప్రధానము. ఇట్టిది తమిళమునుండి స్వీకరింపఁబడినది.

భిన్నలక్షణము, భిన్నార్థకము గలదగుటఁ దెనుఁగువారు యతికిఁ బ్రతిగా నొక సంజ్ఞను, దెలుఁగు లక్షణమునకు పరిపడు దానినిఁ గూర్చుకొనిరి. అదియే వడి లేక వళి.

ఆదిని 'యతి' 'వడి' యనునవి భిన్నార్థకములుగనే ప్రయుక్తములైనవి. 'యతి' పర్యాయ పదములలో 'వడి' 'వళి' చేర్పఁబడకఁ బోవుటయుఁ బాల్కురికి సోమనాథాదుల ప్రయోగములును నీ విషయమును సూచించుచున్నవి. అర్వాచీనులైన అనంతామాత్యుడు నప్పకవియు వీనిని సమానార్థకములుగా వాడుకొనినారు.

వడి శబ్దార్థమునుగూర్చి పూర్వలాక్షణికులు పట్టించుకొన్నట్లు లేదు. కాని, ఆధునిక వ్యాఖ్యాతలనేకులు దీని వ్యుత్పత్తిని విమర్శించిరి. ఒక్కటియు నంగీకారయోగ్యము కాకపోవుటచే మఱియును విమర్శింపవలసి వచ్చుచున్నది.

డాక్టరు గిడుగు సీతాపతిగారు తమిళములోని లోని 'వదు' శబ్దమునుండి తెనుఁగు 'వడి' వచ్చినదనిరి. తమిళమున 'వదు' యత్యర్థకముగాదు. యతిని వారు 'యోనై' యందురు. 'యోనై' 'యతి'కి భిన్నమైన యక్షరమైత్రిగలది. ఈ యక్షరమైత్రినే మనవారు బాటించిరి. కావున, యత్యర్థమున రూఢమైన 'యోనై'శబ్దమునో, సమానార్థకమునో, తద్వికృతినో కాక యసంబద్ధమైన 'వదు' శబ్దమును గ్రహించిరనుట సమంజసముగా లేదు.

'వదు'యనగా మార్గము. ఆద్యక్షరముతోడి మైత్రి పద్యపాదమునఁ ద్రోవఁజూపుటఁజేత 'వదు'ను 'వడి'గా స్వీకరించియుందురని డాక్టరుగారు భావించిరి. మార్గదర్శకత్వమే ప్రధానమైన మార్గార్థకములైన పదము లనేకములు దెలుఁగులో నుండగాఁ దమిళము నాశ్రయించిరనుటయు నసంగతమే.

శ్రీ వేదుల రామశాస్త్రిగారు తమ యప్పకవీయ వివరణమున నొక క్రొత్తపుంత ద్రొక్కిరి. 'వళి'యను సంస్కృత విశేష్యమున కుదర మందలి ముడుతయని యర్థమున్నది. ఇందుచేతఁ గాంతలకు కడుపుమీది వళి శోభాస్పదమైనట్లు పద్యపాదమున కలంకారమగుట వళి యనబడినదని వారూహించిరి. 'లడ లభేదము' లగుట వళి వడి యయ్యెననియుఁ జెప్పిరి. ఉదరస్థ వళులే ప్రసక్తములైన స్త్రీ పురుష వివక్ష యేల? ఇంతేకాక కాంతల యుదరముల దాగిన వళుల వెలికి దీయుట సరసముగా లేదు. ఇంతకును శ్రీ వేదులవారు 'వళి' శబ్దమును సంస్కృత విశేష్యముగను 'వడి' తద్భవముగను గ్రహించిరి. సంస్కృతమున వళి యత్యర్థమునలేదు. ప్రసక్తమగు వళి సంస్కృతమునుగాదు. వడికి వైకృతము. 'యతి'కి మాఱుగా గ్రహింపఁబడిన దేశ్య విశేష్యము వడి. ఇది సంజ్ఞయగుటను, 'లడయోర్నభేద'మనుటను జింతామణి 'ఆద్యోవళిః' యని సూత్రీకరించినది.

సంజ్ఞా పదములకు వ్యుత్పత్తుల నరయుట క్లిష్టతరమనుచు శ్రీ వేదులవారు — 'వ్యుత్పత్తులనవసరములే! కనుక వడి వళి అనువానితో పాటు తక్కిన ఇందలి పదములన్నియు అవ్యుత్పన్నములగు సంజ్ఞాపదములే అయి వాడఁబడినవనియు నెఱుంగునది', అని వ్రాసిరి. వారు 'అప్పకవీయ వివరణ' కర్తలు. కనుక 'ఇందలి' యనుటచే నప్పకవీయ మందలియని అర్థము చెప్పకొనవలసి యుండును. అప్పకవీయము కేవలము యతిప్రాస వివరణముకాదు.

వ్యాకరణ గ్రంథము. మనకది 'యప్పకవీయమే!' కాని అప్పకవికి నాంధ్రశబ్దచింతామణియును వ్యాకరణ శాస్త్రము. కాగా, 'ఇందలి' సంజ్ఞ 'లన్నియు', ఛందోవ్యాకరణములకుఁ జెందినవి, యవ్యుత్పన్నము లనుట సాహసమూలము.

'వడి—విభాజనే' యను ధాతుపాఠము నను సరించి విద్వాన్ శ్రీ రావూరి దొరస్వామి శర్మగారు విభజనార్థము గలదగుటచే యతికిఁ బర్యాయముగా తొలుత 'వడి' వచ్చి పిదప 'వళి' యయ్యెననిరి. వీరును 'వడి' సంస్కృతమనియే తలంచిరి. సంస్కృతమున యతికిఁ బర్యాయపదములు విరతి, విశ్రాంతి, విరామము లాదిగా మఱియు నెన్మిదియున్నవి. 'వడి' 'వళి' మాత్రము కనరావు. అందున్న తొమ్మిదింటిని వదలి క్రొత్తగా మరియొక శబ్దమును వెదకుటకుఁ గల కారణమును సైతము వెదుకవలసి యున్నది. వడి సంస్కృతమునుగాదు. విభజించుట లేక విచ్ఛేద మొనర్చుట తెలుఁగు 'వడి'కి లక్షణమును గాదు. అది యతి.

ఇది కాదని వారే మఱియు నొక వ్యుత్పత్తిని నిరూపించిరి. 'అనుప్రాస మను సంస్కృత సంజ్ఞకుఁ దమిళభాషలో 'వఱి యెదుగై' అనిపేరు. ఈ వఱి (ళి) యెదుగై శబ్దములోని 'వళి'నే తెనుఁగువారు సంగ్రహించిరేమో ? ఇది యొక యూహమాత్రమే'.

ఇది మరియు నసంగతముగా నున్నది. ఏమన అనుప్రాసమునకుఁ బర్యాయమైనది యతికిఁబర్యాయ మగుట యెట్లు ? మఱియు సంస్కృతానుప్రాస మునకుఁ దమిళులొక సంజ్ఞ నేర్పరచుకొనిరి. అందు కొంత భాగమును దెనుఁగువారు సంగ్రహించిరనుట భావ్యము కాదు. ద్రావిడ ప్రాణాయామ న్యాయమునఁ దమిళ 'వఱి' తొలుత 'వళి'యై ఆపైన 'వడి'యై తెనుఁగున సిద్ధించిన దనుటయు మిక్కిలి ప్రయాసావహము.

ఇట్లివి యేమియు సంగతములు కావు. మఱి 'వడి' శబ్ద వ్యుత్పత్తి యేది ? ఏదోయొకటి యుండి తీరవలెగదా? నిజమే ! శ్రమయనక వేగిరపడక వెమక వలయును.

'వడి' దేశ్య విశేష్యము. దీనికి వేగము, పురి, బిగువు, దారము పురి, శౌర్యము, కాల మను అర్థము లున్నవి. వడివేయుట, వడఁబెట్టుట వడి త్రిప్పుట మున్నగు ప్రయోగములు రూఢమై యున్నవి.

త్రాడుల వడి వేయుదుము. పద్యముల వడి వేయుదుము. వడివేయుటఁ జేత త్రాడులకుఁ బురి బిగువు కలుగును. ఇట్లే పద్యపాదమున నాద్యక్షర ముతో నియమితాక్షరమునకు వడివేయుటఁజేత నొక పురి బిగువు స్ఫూర్తి కలుగుచున్నది.

ఇంతేకాదు. త్రాడుల వడివేయుట యనగా సారూప్యసాజాత్యములుగల రెండు భిన్నపదార్థముల కేకత్వాభాసఁ గల్పించుట. ఇట్టి యేకత్వాభాసమును, దత్ఫలితముగా శ్రుతిరమ్యతయు భిన్నస్థానీయములైన రెండక్షరములను వడివేయుటఁజేత సాజాత్య సారూప్య మైత్రీ విశేషమున గలుగుచున్నవి.

కావుననే ఆంధ్ర లాక్షణికులు యతికన్న భిన్నమైన యర్థమున మెలివేయుటయను భావము దోప దేశ్య విశేష్యమైన 'వడి' శబ్దమును గ్రహించిరి. 'వడి' 'వళి'యైనది. 'ఆద్యోవళిః'యని చింతామణి రూపించినది 'వడి'కి నైకృతరూపము.

—శ్రీ ముదిగొండ ఈశ్వరచరణ్.

తెలుగు కావ్యావతారికలు కొన్ని విశేషములు

పై శీర్షికతో కొంతకాలము క్రిందట (నవంబరు 1971)భారతిలో ప్రచురించిన డా. జి. నాగయ్య గారి వ్యాసము ప్రశంసనీయము. ముఖ్యముగ నన్నయ భారతావతారికాభాగరచనలో కన్నడభాషా లక్షణముల ననుసరించినాడని వారు చక్కగా వివరించినారు. కాని వారి వ్యాసములోని కొన్ని విషయములు పరిశీలింపదగి యున్నవి.

బాణునకుముందు 'ప్రాచీన సంస్కృత కావ్యము లందు అవతారికా సంప్రదాయము మృగ్యము' అని నాగయ్యగారి అభిప్రాయము. కాని కాళిదాసుని రఘు వంశములోనే అవతారిక కలదు. దేవతాస్తుతిరూప మయిన 'వాగర్థావివసంపృక్తౌ' ఇత్యాది ప్రథమ

శ్లోకము, కావ్యప్రశస్తి, కవివినయశీలము, పండితాభ్యర్థన ఇత్యాదులుగల తరువాతి తొమ్మిది శ్లోకములును కావ్యావతారికకు సంబంధించినవే. అడియును గాక సముద్రగుప్త చక్రవర్తి (క్రీ. శ. 335–375) విరచితమగు 'కృష్ణచరితము'న విస్తారమగు అవతారిక కలదు. అతడు పూర్వకవులను త్రివిధములుగా విభజించి కీర్తించియున్నాడు. (చూ. భారతి 1967 ఫిబ్రవరి; మార్చి). కనుక కావ్యావతారికా రచనకు బాణు డాద్యుడుకాడు.

డా. నాగయ్యగారు 'తిక్కనకు పిమ్మట కావ్యావతారికలేని కావ్యము తెలుగునందు లేదనిన అతిశయోక్తి కాదు'అని వ్రాసియున్నారు. కాని తిమ్మయ ద్విపద భాగవతమున ఆదిపర్వమును ప్రారంభించుచు కృతి నాయకుడగు శ్రీరాముని అధికముగా కీర్తించి 'నీకు నేఁ జెప్పఁబూనిన కథాక్రమము చేకొని విన్నవించెదఁ జిత్తగింపు'మని సూటిగ కథ ప్రారంభించినాడు. ఇట్లే సభాపర్వము రచియించిన బాలసరస్వతి, కర్ణపర్వము మొదలు తుదివరకు విరచించిన ఆతుకూరి సోమనలుకూడా అవతారిక లేకుండనే రచియించిరి. పద్యకావ్యములలో పిడుపర్తి బసువప్పకవి 'నిరోష్ఠ్య సీతాకళ్యాణము' అవతారికాశూన్యమై కన్పడుచున్నది. (చూ. తంజావూరు సరస్వతీమహలు Descriptive Catalogue.)

ఇక శ్రీ కృష్ణదేవరాయల ఆముక్తమాల్యద కృత్యాదిని వివరిస్తూ నాగయ్యగారు 'ఇట్లు ఇష్టదేవతా స్తుతి పది పద్యములలో విపులముగ నున్నను ఇతర కావ్యావతారికలలో తరువాత కానవచ్చెడి గురుస్తుతి, సుకవిప్రశంస, కుకవినింద ఇత్యాదులు ఆముక్తమాల్యదలో కానరాకుండుట ఒక అపూర్వవిశేషము' అని తెల్పియున్నారు. కాని యిది అపూర్వవిశేషమేమీకాదు. శ్రీనాథుని హరవిలాస అవతారికలో సుకవిస్తుతి, కుకవి నింద, గురుస్తుతి ఇత్యాదులు లేవు. నందితిమ్మన పారిజాతాపహరణములోను, ధూర్జటి కాళహస్తి మాహాత్మ్యములోను ఇవి కానరావు. ఆముక్తమాల్యద యనంతర రచనలయిన పొన్నగంటి తెలగనార్యుని 'యయాతి చరిత్ర' ఘట్టుప్రభుని 'యాజ్ఞవల్క్య చరిత్ర' ఇత్యాది గ్రంథములలోను ఇవి కన్పట్టవు.

విజయవిలాస మందలి: మొదటి మూడు పద్యములు శ్రీకారముతోనే ప్రారంభ మగుచున్నవని తెల్పుచు డా. నాగయ్యగారు ఇల' వ్రాసియున్నారు. 'కృత్యారంభమునందే గాక ప్రతి ఆశ్వాసాదిపద్యమును శ్రీతో ప్రారంభించు సంప్రదాయము తెలుగు కావ్యములందు నియతముగా కలదు' అని.

తన కావ్యారంభములోని మొదటి మూడు పద్యములను శ్రీకారముతో ప్రారంభించిన విజయవిలాస కర్త హరిశ్చంద్రనలోపాఖ్యానకర్తను అనుసరించినాడు. ఇక, నాగయ్యగారి పై వాక్యమునకు తాళ్లపాక చిన్నన్నగారి కృతులు తీవ్ర ప్రతిబంధకములుగ నున్నవి. అష్టమహిషీకళ్యాణమున ప్రథమ, తృతీయ ఆశ్వాసములు మాత్రమే శ్రీకారముతో ప్రారంభముకాగా పరమయోగివిలాసమున ప్రథమాశ్వాసము మాత్రమే శ్రీకారముతో ప్రారంభమగుచున్నది. ఇవి యిట్లుండ, ఉషాకళ్యాణమున కృత్యాదిని శ్రీకారమే కొరవడినది. ఈ మూడును ద్విపదకావ్యములే. చంపూకావ్యములలో మొల్లరామాయణమున ప్రథమాశ్వాస ఆదిపద్యము మాత్రమే శ్రీకారముతో ప్రారంభమయినది.

డా. నాగయ్యగారు పేర్కొనినట్లు తెలుగు కావ్యావతారికలలో పరిశీలించదగిన విశేషాంశము లెన్నియో కలవు.

—శ్రీ సూర్యదేవర రవికుమార్.

సాహిత్యంలో ధ్వన్యనుకరణ శబ్దాలు

ఒకానొక ధ్వనిని అనుకరించేవి ధ్వన్యనుకరణాలు. ఉదాహరణకి 'వాడు బుడుంగుమని మునిగాడు'అనే వాక్యాన్ని తీసుకొందాం. ఇక్కడ బుడుంగుమనేది నీటిలో మునిగేటప్పుడు వచ్చే ధ్వనిని అనుకరిస్తోంది. కాబట్టి బుడుంగుమనేది ధ్వన్యనుకరణశబ్దం. ధ్వన్యనుకరణ శబ్దాల్ని ఉపయోగించి చెప్పాల్సిన విషయాన్ని ఒక్కముక్కలో హృదయానికి హత్తుకొనేలా చెప్పవచ్చు. ధ్వన్యనుకరణశబ్దాలు 'ఇవిగో, ఇన్ని'అని చెప్ప

టానికి వీలుపడదు. అటు సాహిత్యాన్ని, ఇటు వ్యావహారికాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే ఒక దారీతెన్ను కనబడుతుందేమో! వ్యావహారికంలో ధ్వన్యనుకరణ శబ్దాల వాడుక అందరికీ తెలిసిందే—ఉదా: వాడు దభేలున పడ్డాడు, చెంప ఛెళ్‌మంది మొదలైనవి. సాహిత్యంలో ఈ ధ్వన్యనుకరణ శబ్దాల్ని వాడని కవులు అరుదనే చెప్పాలి. దాదాపు ప్రతికవీ వాడినవాడే. అందుచేత అందరి కవుల్నీ తీసుకొని వ్రాయటంఅనేది తలకు మించినభారం అవుతుంది. నా యీ వ్యాసంలో కొద్ది మంది కవులు వాడిన ధ్వన్యనుకరణ శబ్దాల్నిమాత్రం వివరిస్తాను!

భారతము – ఆదిపర్వము

ఇంతవరకుఉన్న ఆధారాలనిబట్టి ఆదికవిగా పేరొందిన నన్నయగారి ప్రయోగం తీసుకొందాం. ద్వితీయాశ్వాసంలోని గజకచ్ఛప వృత్తాంతంలో ఈ క్రింది పద్యం చూడండి:

'పాదంబులు పెట్టుడుఁ ద
త్పాదపఘనశాఖ విఱిగి బల్లన నుచ్చై
ర్నాదమున దిక్కు లద్రువఁగ
భేదిల్లె విహంగతతులు భీతిం బఱవన్'

'రోహిణింబను పాదపోత్తమంబు గరుడనిం గని.........గజకచ్ఛపములను భక్షించి పొమ్మనిన' పిదప గరుడుని చేష్టను వర్ణించిన ఈ పద్యంలో 'బల్లు'అనేది ధ్వన్యనుకరణం. 'బల్లున తెల్లవాఱె'అనే ప్రయోగం మనకి సుపరిచితమే. అయితే పై పద్యంలో 'బల్లు'అనేది విఱుగుటలో ధ్వన్యనుకరణం. ఒకేశబ్దం అనేకధ్వనుల్ని అనుకరిస్తుంది. దీని విషయం తరువాత చూద్దాం.

భారతము—ఆరణ్యపర్వము

'ఆయత కుంత కార్ముక గదాసి
పరశ్వధశూలపట్టిసా
ద్యాయుధ ఘోరహస్తులు
....
......ఆ వియచ్చరులు శూరతమై
నడతెంచి బల్విడిం
గోయని తాకి రుగ్రరణకోవిదులై
కురురాజసైన్యమున్' (5 వ ఆశ్వాసం:)

ఈ పద్యం దుర్యోధనుడు ఘోషయాత్రకి వెళ్లిన సందర్భంలోనిది. దేవేంద్రుని సైన్యం కౌరవ సైన్యంపై యుద్ధానికి వెళ్లటం ఈ పద్యంలో చిత్రితమైంది. ఇందులో 'కో' అనేది ధ్వన్యనుకరణం. దీర్ఘసమాసాలు వేస్తేనేగాని సామాన్యంగా యుద్ధ సంరంభం పాఠకుడి మనస్సులో కలగదు. కాని ప్రబంధ పరమేశ్వరుడైన ఎఱ్ఱన 'కో' అని ప్రయోగించి ఆ యుద్ధ సంరభాన్ని పాఠకుడి ఎదుట సాక్షాత్కరించేలా చేయుగలిగాడు. యుద్ధసమయాల్లో ఒకరిపైకి ఇంకొకరు అఱచుకుంటూ వెళ్లడం సహజం.

భారతము ఉద్యోగపర్వము

తృతీయాశ్వాసంలో శ్రీకృష్ణుడు భీమసేనుణ్ణి యుద్ధానికి పురికొల్పుతున్న సమయంలోని ఈ క్రింది పద్యాన్ని పరిశీలించండి—

'వెఱపెట్టిదియో యెన్నఁడు
నెఱుగని నీ యట్టివాని కెవ్వరొకో యీ
పిఱికితన మింత యలవడఁ
గఱపినవా' రనుచు శౌరి కలకల నవ్వెన్.

భీముడు లోగడ తానుజేసిన ప్రతిజ్ఞలన్నీ మరిచి సంధికి ఒప్పుకొనేలా చెయ్యమని కృష్ణుడితో అన్నాడు. కృష్ణుడికి ఆశ్చర్యం వేసింది. భీముణ్ణి యుద్ధానికి పురికొల్పాలి. ఇదే అతని ప్రయత్నం. అందుకు భీముణ్ణి పిఱికివాడికింద జమకట్టాడు. అంతటితో ఊరుకోలేదు. నవ్వాడట. ఎట్లా నవ్వాడో చూశారా? 'కలకల' నవ్వాడట. తిక్కనార్యునికి సూక్ష్మపరిశీలన ఎంత ఉందో మన కీ నవ్వుల్ని బట్టి ఇట్టే తెలుస్తుంది. ఈ 'కలకల' నవ్వుతో భీముడు సిగ్గుపడాలి. కోపం రావాలి. ఇదే ఇక్కడ కలకల నవ్వుయొక్క ప్రయోజనం. 'కలకల' అనేది నవ్వటంలో ధ్వన్యనుకరణం. నాటకీయతకి పేర్గాంచిన తిక్కనార్యుని రచనలో ఇటువంటి నవ్వులు మనకి చాలాచోట్ల కన్పిస్తయ్.

ఇంతవరకు కవిత్రయంవారి ప్రయోగాల్ని

చూచాం. శబ్దాలంకారాల్లో పేర్గాంచిన భాగవతంలో నుంచిగూడా ఒక ప్రయోగం తీసుకుందాం.

భా గ వ త ము

శ్రీకృష్ణుడు దంతవక్త్రుణ్ణి సంహరించే ఘట్టంలోని పద్యం—

'దంత వక్త్రుండతి భీషణాకారంబుతోనప్పుడు—
పెటపెటఁ బండ్లు గీటుచును
బెట్టుగ మ్రోయుచుఁ గన్నుఁ గ్రేవలం
జిటచిట విస్ఫులింగములు సింద
మహోద్ధత పాదఘట్టనన్
నిటనిటనై ధరిత్రి వడఁకాడ వడిన్
గద కేల ద్రిప్పుచున్
మిటమిటమండు వేసవిని మించు
దివాకరుఁ బోలి యుగ్రతన్'
(దశమస్కంధం—ఉత్తర)

ఈ పద్యంలో నాలుగు ధ్వన్యనుకరణ ప్రయోగాలు ఉన్నాయి.

పెటపెట—పళ్లు కొఱకటంలో ధ్వన్యనుకరణం
చిటచిట— చిందటంలో ధ్వన్యనుకరణం
నిటనిట—వడకుటలో ధ్వన్యనుకరణం
మిటమిట—మండటంలో ధ్వన్యనుకరణం

'అతి భీషణాకారంబుతో' అన్నమాటకి కేవలం వ్యాఖ్యానప్రాయమైంది పద్యం. దంత వక్త్రుడి రూపాన్ని కళ్లకు కట్టేలా చిత్రించడానికి ధ్వన్యనుకరణశబ్దాలు ఉపయోగపడ్డాయి.

ఇక ప్రబంధాల్లోని ధ్వన్యనుకరణ ప్రయోగాల్ని పరిశీలిద్దాం.

కా శీ ఖ ం డ ము

నాల్గవ ఆశ్వాసంలో శుక్రలోకవర్ణన ఉంది. దానిలో కాలకంధర అంధకాసురులకి యుద్ధం జరుగుతుంది. ఆ యుద్ధంలో చచ్చిన రాక్షసుల్ని భార్గవుడు మృతసంజీవినితో బ్రతికిస్తాడు. అప్పుడు ప్రమథులు దిక్కులేక పరమేశ్వరుణ్ణి వేడతారు. ఆ సందర్భంలోగల సీసపద్యంలోని ఎత్తుగీతి ఇది—

'కరతలమున బదరిపండు కాంతి నతనిఁ
గాల్చి దధితోడి చలిదిముద్దయును బోలె
విషము మ్రింగిన పెన్నుద్ది వేల్పుతేడు
మనసిజారాతి మ్రింగి గుటుక్కనఁగఁ ద్రేఁపె'

శివుడు శుక్రుణ్ణి మ్రింగడం ఈ పద్యంలో వర్ణితమైంది. శ్రీనాథుడు ఎంతటి దీర్ఘ సమాసాల్ని వేసినాగానీ, అవసరం కలిగితేమాత్రం తెలుగు పలుకుబడిని వేయకుండా ఉండలేదు. పై పద్యంలో పెరుగు కలిపిన చద్దిముద్దలాగా శుక్రుణ్ణి మ్రింగాడని చెప్తున్నాడు. చద్దిముద్ద కడుపునిండా తింటే త్రేపురావటం సహజం. దాన్ని గుర్తులో ఉంచుకొని కవిసార్వభౌముడు శివుడుగూడా త్రేపాడనీ, ఆ త్రేపు గుటుక్కనేశబ్దంతో అనుకరిస్తోంది అని చెప్పాడు. గుటుక్కనేది ధ్వన్యనుకరణం. సహజత్వానికి ఇవి ఎంతగా వన్నె చేకూరుస్తాయో తెలుస్తోంది.

మ ను చ రి త్ర ము

వలపుల సుందరియైన వరూధిని ప్రవరుణ్ణి కౌగలించుకొన్నది. అతగాడు త్రోసి వేశాడు. ఈ సమయంలో వరూధినీ స్థితిని వర్ణిస్తూ చెప్పిన పెద్దనగారి పద్యం చూడండి—

'త్రోపువడి నిలిచి సిగ్గున ల
జ్జా పరవశ యగుచుఁ గొప్పు సవరించి
యొడల్
దీపింప నతనిఁ జుఱుచుఱఁ
గోపమునన్ జూచి క్రీడకొనుచున్ బలికెన్.
(2 వ ఆశ్వాసం.)

వరూధినికి సిగ్గువేసింది. ఇంతవరకు తనని కోరినవారేగాని, తానుగా ఇంతగా ఎప్పుడూ కోరలేదు. అటువంటిది ఇప్పుడు తాను స్వయంగా కోరితే అవమానించాడు. పాపం! కోపంవచ్చింది. కొప్పు సవరించింది. అతగాడిని చుఱచుఱ చూసింది. ఈ చుఱచుఱ అనేది కాలుటలో ధ్వన్యనుకరణం. ఆమె చూపులు ప్రవరుణ్ణి కాలుస్తున్నాయా అన్నట్లు ఉన్నాయన్న మాట. ఇక్కడ ఈ ధ్వన్యనుకరణ ప్రయోగంవల్ల పాఠకుడికి వరూధినియొక్క రూపం దర్శన మిస్తుంది.

పారిజాతాపహరణము

'అనవిని (వేటువడ్డ
యురగాంగనయుంబలె నేయివోయ బ
గ్గన దరికొన్న భీషణ
హుతాశనకీల యనంగ లేచి......'
((పథమాశ్వాసం.)

ఇది పారిజాత వృత్తాంతాన్ని విన్న సత్యభామకి ఎంతకోపంవచ్చిందో తెలుపుతున్న పద్యం. ఆమె అప్పటి దాకా శయనించి ఉన్నది. ఈ వృత్తాంతం వినగానే కోపంతో లేచింది. ఆ లేవడం దెబ్బతిన్న ఆడుపాము వలెఉంది. అగ్నిలో నెయ్యిపోస్తే జ్వాలలు ఎట్లా వస్తాయో అట్లా లేచిం దా సత్యభామ. మంటలు లేవ డాన్ని వర్ణించాలంటే ధ్వన్యనుకరణ శబ్దమే యథో చితంగా ఉపకరిస్తుంది. ఇక్కడ 'బగ్గ'అనే ధ్వన్యను కరణం దృశ్య సాక్షాత్కారానికి ఎంతో ఉపయోగ పడింది.

మరికొన్ని ప్రయోగాలు

'ఏందు వీడువచ్చినఁ దలయుంటఁ
గటు కొని జిఱ్ఱునఁ బీడుదు'
(భోజరాజీయం, 4 వ ఆశ్వాసం)

జిఱ్ఱనేది పీడటంలో ధ్వన్యనుకరణం.

ఒక్కొక్క ధ్వన్యనుకరణం ఉన్నదీ అంటే అది వివిధసందర్భాల్లో వివిధమైన పాత్రల్ని ధరిస్తుంది. ఉదాహరణకి 'జలజల'.

'జలజల నలరులు రాలెను' — వసుచరిత్ర, 3 వ ఆశ్వాసం.

'జలజల రక్తంబు చల్లెనో యనంగి' 1—భా.

'కన్నుల జలజల కాఱెడుసీరు'— 4 భా.

రాఘవార్యుని ద్విపద నళచరిత్రము.

(చూ. శబ్దరత్నాకరము.)

పింగళి సూరనార్యుని కళాపూర్ణోదయంలోని ఈ క్రింది ప్రయోగం చూడండి—

'జాలునం గ్రుక్కిఁడు గ్రుక్కిఁడే మధుపు గ్రోలుచు' (6 వ ఆశ్వాసం)

కిటకిటఅనే ధ్వన్యనుకరణ ప్రయోగానికి వైజయంతీ విలాసంలో ప్రయోగం ఉంది—

'(శుతులు విజ్జోడైనచోఁ దంత్రి బిగినిరఁ
డిడించి కిటకిట బిరడ త్రిప్పు'
(1 వ ఆశ్వాసం)

ఈ ధ్వన్యనుకరణ శబ్దాల ప్రయోగంవల్ల వ్యావహారికత అనే విశిష్టగుణం ఏర్పడుతుంది. కావ్యానికి అవసరమైన పాత్రచిత్రణకి ఈ ధ్వన్యనుకరణ శబ్దాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయనేది పరిశీలనవల్లనే తెలుస్తుంది.

— ద్వా. నా. శాస్త్రి

వా లి వ ధ

ఫిబ్రవరి 1972 భారతిలో కలగూరగంపలో శ్రీ కాళూరి హనుమంతరావుగారి వ్యాసము చదివి ప్రేరితుడనై వాలివధ విషయమును కొంత ప్రస్తావించు చున్నాను. హనుమంతరావుగారు వ్రాసిన దానిని ఖండించుట ధ్యేయముగా పెట్టుకొనక అభిప్రాయభేదమును సూటిగా స్పష్టముచేసి దాని యాధారమున వాలివధగూర్చిన వాస్తవమును కొంత మాత్రమే సంగ్రహముగా ప్రకటింప దలచుకొన్నాను.

కాళూరివారి చివరి వాక్యములో శ్రీరాముని రాజనీతి మాత్రమే వాలివధలో ప్రధానముగా కన్పడు చున్నది అని చెప్పబడినది. పైకి అట్లు కన్పడు నది నిజమేగాని వాస్తవము పరిశీలింపగా నది రాజ ధర్మముగాని రాజనీతి కాదు. స్వతఃప్రమాణమగు ధర్మమును అసిధారావ్రతముగ నాచరించుట ధర్మ నియతుల నీతియగును. పదుగురిలో మంచివాడగు టకు తంటాలుపడుట లోకనీతి. స్వార్థసాధనకై యొకరి పక్షము నాశ్రయించి వైరిపక్షము జయించు టకు అవసరమగుచో కుటిలనీతి నవలంబించుట రాజ నీతి యన బరగును. శ్రీరామచంద్రుని స్వార్థము సీతాప్రాప్తి. సీత రావణుని యింటనున్నది. రావణుడు వాలియు బద్ధస్నేహులు. మఱియు బలశాలియైన

వాలిమాటను రావణుడు కాదనలేడు కావున శ్రీరాముడు స్వార్థపరుడైనచో వాలితోనే చేయికలిపి యుండెడివాడు. అపుడు సునాయాసముగా రాజనీతి సఫలమై శ్రీరాముడు కృతార్థుడై యుండెడివాడు. అనగా వాలి పంపున రావణుడు దోసిలొగ్గి సీతను అప్పగించి యుండెడివాడు. కాని త్రేతాయుగములోని మనుధర్మమూర్తియైన రాఘవుడు కుటిలమైన రాజనీతిని పాలింపలేదు. రాజధర్మముగా దుష్టశిక్షణమును నిష్పక్షపాతముగా సాక్షి స్వరూపుడుగా చేయదలచియున్నాడు. ఈ రాజనీతి రాజధర్మముల మర్మమును భవభూతి మహాకవి మహావీరచరితములో వింగడించి చూపించియున్నాడు. దానిలో రావణప్రేరితుడయిన వాలి శ్రీరామునితో ముఖాముఖి తలపడి మరణించినాడు. అన్నను చంపినాడన్న క్రౌర్యముతో సుగ్రీవుడు శ్రీరామునిపై దుముకుచుండగా వాలి తమ్ముని వారించి దుష్టుడయిన రావణునిపక్షము నాశ్రయించుట తన తప్పనియు ఆ తప్పు నీవు చేయవద్దనియుచెప్పి మరణించెను. దీని సారాంశము పర్యాలోచన చేయగా పరదారాసక్తులై మదమత్తులయిన వాలి రావణులు స్వభావతః ఒక పక్షమువారు. పాపము నాచరించినవారి శిక్షించుట రాజధర్మము. రాజధర్మము ప్రకారము శ్రీరాముడు వాలి పాపమును హరించుటకు శిక్షించెను. ఈ విషయము శ్రీరాముని సమాధానమందు స్పష్టమయినది. కాగా వాలికిని శ్రీరామునకును వ్యక్తిగత వైరములేదు. కావుననే వ్యక్తిగతముగా పరస్పరము యుద్ధమునకు కాలుద్రవ్వుట శ్రీరామునకు అసంబద్ధమగును. ఈ విషయమును వాలి మొదట గ్రహియింపక శ్రీరామ సుగ్రీవుల మైత్రి వినియు శ్రీరామునిపై తెలియని పూజ్యభావముతో తన జోలికి రాడుగదా అనుకొన్నాడు. శ్రీరాముడుకూడ వాలి పాపాత్ముడుగావున వధించుటకు పూనుకొనెనే గాని సుగ్రీవునియందు పక్షపాతముతో గాదు. ఈ విషయము సుగ్రీవుని ప్రమత్త సందర్భమున రామాయణము బాగుగా జదివినవారికి అర్థము కాగలదు.

కాబట్టియే శ్రీరాముడు కాకాసురుని శిక్షించినట్లు ఏ అస్త్రముతోనో వాలిని వధింపక సుగ్రీవుని రెండు మారులు ప్రేరేపించి వాలితో యుద్ధము చేయించెను. వాలి సుగ్రీవులలో భేదమును పోల్చలేక పోయెను అనగా అర్థకామములకు లోనయిన పశువులలో తారతమ్యము మర్యాదా పురుషోత్తముడయిన శ్రీ రామచంద్రునకు మృగ్యమయ్యెనని తాత్పర్యము. ఒక్కక్షణమాగినచో సుగ్రీవుని ప్రాణములు పోవుననగా శ్రీరాముడు వాలిని సంహరించి వాని తమ్ముని గాపాడెను. సాక్షిగానున్న రాజునకు బలవంతుని బారినుండి బలహీనుని గాపాడుట అను ధర్మము తానై వర్తింమను. ఈ సూక్ష్మధర్మములోని సుముహూర్తమునకై శ్రీరాముడు తఱి వేచియుండెను.

భారతములోనికి యుదాహరణముతో జెప్పినచో భీష్మ ద్రోణ కృపులకు శ్రీ కృష్ణునిపై పాండవులపై సద్భావముండెడిది. కాని యుద్ధములో వారు కౌరవపక్షమందుండగా శ్రీ కృష్ణుడు ధర్మపక్షమందుండి వారి నెదుర్కొని శిక్షింపజేసెను. అనగా వ్యక్తిగతవైరమున్నప్పుడు ప్రత్యక్షయుద్ధము, ధర్మాధర్మ కారణమైన వైరమున్నపుడు పరోక్షయుద్ధము సంభవమగునని తెలియదగును. వీడు దుష్టుడు పాపుడు అని నిర్ణీతముకాగా శిక్షించుట ప్రధానముగాని వానికి ముందు తెలియబఱచి వానిని ఒప్పించుటకు వాని హేతువాదమును మన్నింపవలసినపనిలేదు. ఇది త్రేతాయుగమునాటి మనుధర్మము. వాలి కొఱకు జాలిపడవలసినపనిలేదు. ఏలయనగా వాలి శ్రీరాముని సమాధానముతో తృప్తిపడి జ్ఞానోదయముతో తనువు చాలించినాడు. ఈ వాలివధ ముందు వెనుకలలో నెక్కడను ప్రక్షిప్తశ్లోకములు లేవు. ఉన్న శ్లోకములను ఉన్నట్లుగా గ్రహించి సత్యసంధుడయిన శ్రీరాముని సత్యమును నిత్యనిర్మలముగా తెలియుటయే మన కృత్యము.

— వి. ఏ. కుమారస్వామి.

గ్రంథవిమర్శలు

జ్ఞానేశ్వరి భగవద్గీత: జ్ఞానేశ్వర విరచితము

(అనువాదకులు : శ్రీ దిగవల్లి శేషగిరిరావు, ప్రకాశకులు : త్రివేణి పబ్లిషర్సు, మచిలీపట్నం, 1, మదరాసు—1. క్రౌను $\frac{1}{8}$ పే. 1097 లు. హాఫ్ కాలికోబైండు, వెల రు. 25/—లు.)

మహారాష్ట్ర భక్తాగ్రేసరులలో నొకరగుటయే కాక ఆ భాషకు స్వరూపమిచ్చినవారిలో ప్రధానుడగు జ్ఞానేశ్వరులు ఈ గ్రంథము క్రీ. 13 వ శతాబ్ది చివరిపాదములో రచించెను. ఆయన జీవించినది 21 సం.లే యైనను అంతచిన్నతనములో రచించిన ఈ మహాగ్రంథము శీఘ్రకాలముననే మహారాష్ట్ర దేశమందంతట వ్యాప్తినొంది సంస్కృతములోనికిని ఈ మధ్య హిందీ మొదలగు భారతీయభాష లెన్నింటి లోనికో అనువాదముపొంది విశేషప్రచారము పొందినది. ఆంగ్లములోనికిగూడ అనువదింపబడినది.

జ్ఞానేశ్వరులు ప్రధానముగా శాంకరమతమునే అవలంబించినను గీతకు శంకర భగవత్పాదులుచేసిన సంక్షేపభాష్యమువలెగాక ఇది అత్యంతవిపులమైనది. మూలశ్లోకములను అచ్చటచ్చట కేవల నిమిత్త మాత్రములుగా నుంచుకొని జ్ఞానేశ్వరులు భక్తిపారవశ్యముతో ఎన్నోవిశేషవిషయములు విస్తరించుకొనిపోవును. శాస్త్రవాదము లిందు కానరావు. మూలములోని శబ్దార్థములకు మాత్రమే కట్టుబడి యుండుటలేదు. కేవలము అద్వైతానుభవమునే ఆనంద పారవశ్యముతో అందించుచు పాఠకులను భక్తి సుధాసాగరమున నోలలాడింప జేయును. అద్వైతభావన అనుభవమునకు వచ్చునట్లు అసంఖ్యాకములైన ఉపమానములు ప్రపంచింపబడుచు కొన్ని పునఃపునరావృత్తము లగుచుండును.

ఈ గ్రంథములో మరియొక విశేషమున్నది. మూలగ్రంథము కృష్ణార్జున సంవాద రూపముగా నుండి, సంజయునిచే ధృతరాష్ట్రునకు నివేదింపబడినదనుట ప్రసిద్ధమైన విషయము. కాని గ్రంథములో అడుగని ప్రశ్నలకు జవాబులుకలవు. సంభాషణలలో మధ్య మధ్య ముఖకవళికలలో మార్పులు కూడ ఉండి యుండవలెను. ఇట్టివెన్నో జ్ఞానేశ్వరులు భావించుకొని పాఠకులకు వివరించుకొని పోవుదురు. ఎదుట శ్రీ కృష్ణార్జునులు సంభాషించు చున్నట్లును జ్ఞానియైన సంజయుడు అంధుడైన ధృతరాష్ట్రునికి ఈ అద్భుత సంవాదమును పులకాంకిత శరీరుడై కథనముచేయుచున్నట్లును, జ్ఞానేశ్వరులు ప్రత్యక్షము చేసుకొని గ్రంథరచనము కావించినందున మనకును అవి ప్రత్యక్షములగును.

ఇంతేకాక మూలములో ప్రస్తావింపబడిన విషయముల నాధారముచేసుకొని ఎన్నోసాధనల విశేషములు ప్రపంచింపబడినవి. ఆరవ యధ్యాయములో యోగసాధ

నలు యోగానుభవములు నాథ సంప్రదాయము ననుసరించి అద్భుతముగా ప్రదర్శితములయినవి.

ఇట్టి యుద్గ్రంథము రచించుటకు జ్ఞానేశ్వరులకుగల భగవద్భక్తికి అన్నగారగు నివృత్తినాథులపై గల యఖండగురుభక్తి తోడైనది. జ్ఞానేశ్వరులను గూర్చి ప్రచారములోనున్న కథలనుబట్టి ఆయన కారణజన్ముడని తోచును.

ఈ యనువాదము మూలభావములకు తగినట్లు సుబోధము ముందుకు పాఠకులను పరుగులెత్తించు సరళ గ్రాంథికభాషలో రచింపబడినది. కళాద్రుతప్రకృతిక సాంకర్యము, స్వల్పసంధిదోషములు, శబ్దదోషములు, ఆ మహాప్రవాహములో పరిసిపోవుచున్నవి.

పీఠికాదులవలన నది ఆంగ్లానువాద సాహాయ్యము హిందీఅనువాదము ననుసరించి వ్రాయబడినట్లు సూచితమైనది. కాని మహారాష్ట్ర భాష నుండి**యే** అనువదింపబడి యుండవచ్చును. ఎట్లు చేసినను గ్రంథ మాద్యంతము జ్ఞానేశ్వరులకున్న భక్త్యావేశములో సంపూర్ణమై యున్నది. మొదటి ముద్రణమైన పిమ్మట 23 సం. లకు ఇప్పుడిది మరల ముద్రింపబడుట ప్రమోదావహము.

మొత్తముమీద అచ్చుతప్పులు చాల తక్కువగా చక్కగా ఈ మహాగ్రంథమును ముద్రించి ప్రచురించినందుకు త్రివేణీప్రెస్సువారిని త్రివేణి పబ్లిషర్సును అభినందించుచున్నాము.

మాళవికాగ్నిమిత్రము:

మహాకవి కాళిదాసకృతము

(అనువాదకులు : శ్రీ మోచెర్ల రామకృష్ణకవి, ప్రచురణ : శ్రీ మోచెర్ల రామకృష్ణకవి, అత్తితోట అగ్రహారము, నెల్లూరు. డెమీ $\frac{1}{8}$ పే. 92 లు. వెల రూ. 3/—లు.)

కాళిదాసకృత నాటకములలోనిది ప్రథమమైనను విశిష్టమైనది. తక్కిన రెండును పురాణకథాధారములు. ఇది చారిత్రికాధారము. ప్రస్తావనను బట్టి కాళిదాసుకూడ ప్రథమములో సమకాలికుల యనాదరణమునకు పాత్రుడైనట్లు ఊహింపదగియున్నది. దీనితో నాతడు విద్వత్కవి సామాజికుల మన్నన పొందుటకు ప్రయత్నించి సఫలీకృతుడయ్యెనని భావింపదగును. 'ప్రయోగదృష్టితో జూచునపుడు కాళిదాస రూపకత్రయములో మాళవికాగ్నిమిత్రము అగ్రగణ్యము'అని ఆముఖములో శ్రీ కే. యస్. రామానుజాచార్యులు అన్నవాక్యము సర్వవిధముల సంభావ్యము. శ్రీ శ్రీనివాసచక్రవర్తిగారు 'కాళిదాసు విదూషకులు' అను వ్యాసములో మాళవికాగ్నిమిత్రములోని విదూషకపాత్ర విశిష్టమైనదని నిరూపించినది**కూడ** ఈ సందర్భములో గుర్తించుకొనదగును. ఇది కాళిదాసు ప్రథమనాటకమని తేలికచేయక ఆయనకు నాటక రచనలో శాశ్వతస్థానము సంపాదించినదని గౌరవింపదగినది.

కాళిదాస రచితములైన తక్కిన నాటకములను ఆంధ్రీకరించిన శ్రీ మోచర్ల రామకృష్ణకవి ఎంతో శ్రద్ధతో రమణీయముగా మూలానుగుణముగా ఈ నాటకమును అనువదించిరి. శ్రీ రామకృష్ణకవి సంస్కృతాంధ్రములలో విద్వత్కవి. వారి యాంధ్రవాణి మాధుర్యముతో తొణికిస లాడుచుండును. కాళిదాసుని కాలములో ప్రియుల ప్రేమము లెంత మధురముగా నుండెడివో ఈ క్రింది పద్యములో వ్యక్తమగుచున్నది. వకుళావళికతో మాళవికకు ఉత్తరముగా రాజు చెప్పిన దిది.

'ఈ క్షణమె పుష్పబాణాగ్ని సాక్షికముగ
నన్నెనేను సమర్పించు కొన్నవాఁడ
నీచెలికి, సేవ్యుఁడనుగాను, నేనె యగుదుఁ
జెలువ కేకాంతభృత్యుండఁ బలుకులేల ?'

శ్రీ రామకృష్ణకవి వచనరచనకూడ మనోజ్ఞముగాచేసి ఈ యాంధ్రానువాదమును సర్వాంగ సుందరముగా తీర్చినారు. ఆంధ్రు లందరును దీనిని పఠించి కాళిదాస మహాకవి రచనా వైదగ్ధ్యమును అనుభవింతురుగాక !

శ్రీమదాంధ్ర మధురావిజయము

(గంగాదేవి గీర్వాణ కావ్యమునకు అనువాదము. అనువాదకులు : శ్రీ బండ్ల వెంకటరమణయ్య. ప్రచురణము : గ్రంథకర్త, ప్రొద్దుటూరు (కడపజిల్లా) డెమి $\frac{1}{8}$ పే. 140 లు. వెల రు 4=50)

ఇది తన భర్త కంపరాయలు మధురను-సుల్తానును చంపి జయించి విజయనగరరాజ్యములో కలిపిన వృత్తాంతమును వర్ణించుచు గంగాదేవి చెప్పిన సంస్కృత కావ్యము. కాని కావ్యములో చివరి రెండు సర్గలు (8, 9) మాత్రమే మధురావిజయమునకు సంబంధించినవి. అంతకుముందు 7 సర్గలును, బుక్కరాయల, విజయనగర వర్ణనలు, కంపరాయల జననాదులు, ఆయన తుండీర మండలము జయించుట, మహాకావ్యత్వమున కవసరమైన వర్ణనలతో నిండి యున్నది. ఇది చరిత్రను వర్ణించు కావ్యముగా కన బడుచున్నను ఇందులో ఎక్కువ సంప్రదాయ ధోరణియే కనిపించుచున్నది. ఈ సంస్కృత కవయిత్రి కవిస్తుతిలో తిక్కన సోమయాజులను చేర్చుటచే ఆంధ్రులకు విశేషప్రీతిపాత్రమైనది.

దీనిని బహుకాలము క్రిందట పూజ్యశ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రిగారు మూడాశ్వాసములలో ఆంధ్రీకరించి ప్రచురించినారు. తర్వాత 1966 లో శ్రీ పోతుకుచ్చి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు విపులమైన ఆంధ్యవ్యాఖ్యానముతో ప్రచురించిరి. ఇది నూతనముగా వెలువడిన అనువాదము. శ్రీ రాఘవనారాయణశాస్త్రిగారి అనువాదము చంపూ రూపము. ఆ యనువాదము సంగతి ఈ గ్రంథకర్తకుగాని ఉపోద్ఘాతకర్తలగు శ్రీ వేదము వెంకటరాయశాస్త్రిగారికిగాని తెలిసినట్లు తోచదు. శ్రీ శాస్త్రిగారిది కొంత స్వేచ్ఛానువాదము. ఇది మూలమును సన్నిహితముగా అనుసరించు చుండుటచే మూలగ్రంథ స్వరూపమును సుష్ఠుగా ప్రదర్శించుచున్నది. మొదటి పద్యమే అనువాద విధానమునకు మచ్చుతునుక.

మూలము :

కల్యాణాయ సతాం భూయా
ద్దేవో దన్తావలాననః
శరణాగత సంకల్ప
కల్పనా కల్ప పాదపః॥

అనువాదము :

శ్రీ లొసంగుగాత సజ్జనశ్రేణికి శర
ణార్థి సంకల్ప కల్పనానల్ప కల్ప
కంబు దంతావళాస్యదైవంబు సతము
విస్ఫురత్కృపామృతస్నిగ్ధ వీక్షణముల

మొదటి మూడు పాదములు మూలములోని ప్రధాన పదములతోగూడ గూడియున్నవి. పద్యపూర్తి కొరకు సందర్భానుకూలముగా నాల్గవపాదము చేర్చ బడినది. ఇట్లే తక్కిన గ్రంథమును సాగినది. మూలమును అనుసరించుటలో అనువాదకులు ఎంతో శ్రద్ధ వహించినారు. మూలానుసారి యైనను అనువాద పద్యములు ఎక్కువభాగము స్వతంత్ర రచనవలె రమ్యమైన కూర్పు బిగువుతో నొప్పారుచున్నవి. పంచమ సర్గములోని 62 వ పద్య మిట్లున్నది :

అంతట లేఁజివుళ్లనెడి యంజలి
యొగ్గి, విలాస కాననా
భ్యంతర వృక్ష వాటికల
యందలి పువ్వుల కాన్కలిచ్చి య
త్యంత మనోభిరామ మగునట్టి
వనప్రియ కూజితోక్తి భూ
కాంతునిఁ గొల్వ వేడ్కపడి
గ్రక్కున వచ్చె వసంత మయ్యెడన్,

ఇట్లే అనువాదమంతయు ప్రౌఢపద్య రచనతో ఆంధ్ర పాఠకులకు ఆకర్షకముగా నున్నది. కవికి సంస్కృతాంధ్రములలోగల విద్వత్తు, రచనలో శ్రద్ధ ఈ గ్రంథమునకు సొగసు చేకూర్చినవి.

ఈ గ్రంథమునకు శ్రీ వేదము వెంకటరాయ శాస్త్రి (శాస్త్రి మనుమడు) వ్రాసిన విపులమైన ఉపోద్ఘాతము (28 పేజీలు) కావ్యమునకు సంబంధించినవేకాక ఆ కాలమునకు సంబంధించిన చరిత్రాంశములను, కావ్యకథాసంగ్రహమును దాని స్వరూపమును ప్రదర్శించుచు విజ్ఞానదాయకమై ఈ గ్రంథ ప్రచురణమునకు ప్రయోజనాధిక్యమును చేకూర్చుచున్నది.

ఆంధ్రవనితయైన గంగాదేవి రచించిన ప్రౌఢ సంస్కృత కావ్యమును రమ్యముగా అనువదించిన గ్రంథకర్తను హృదయపూర్వకముగా అభినందించుచున్నాము. గ్రంథముద్రణమునకు ద్రవ్యమిచ్చిన శ్రీ వై. బి. రెడ్డిగారు ప్రశంసాపాత్రులు.

—శ్రీ నోరి నరసింహశాస్త్రి.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu chetty Street, Madras-1, Editor : S Sambhu Prasad,

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్ రేట్లు	కాంట్రాక్టు రేట్లు
4 వ కవరు పేజి	...	రు. 175/-	రు. 150/-
2 లేక 3 వ కవరు పేజి	...		
ఒకే (నలుపు) రంగు	...	రు. 150/-	రు. 125/-
లోపలి పేజీలు			
పూర్తి పేజి	...	రు. 125/-	రు. 100/-
అర పేజి	...	రు. 65/-	రు. 55/-
పావు పేజి	...	రు. 40/-	రు. 35/-

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

సం॥నకు వరుసగా 6 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

చందా వివరములు

సంవత్సర చందా	...	రు. 12—00
6 మాసముల చందా	...	రు. 6—00
విడి ప్రతి	...	రు. 1—00

మేనేజరు, భారతి,
మద్రాసు—1.